



# వుదయం






వరంగల్ | 26-01-2026 సోమవారం | సంపుటి : 11 | సంచిక : 221 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur | Follow us on



# జనవరి 26, 1950

**ఉదయం 10 గంటల 18 నిమిషాలు**

## భద్రత లేకుండా వచ్చిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, జనవరి 25 :** రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చిన రోజును, అధికారికంగా దేశం సార్వభౌమ, ప్రజాస్వామిక గణతంత్రం అయిన రోజునూ స్మరించుకుంటూ ప్రతి ఏడాది జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని భారత్ జరుపుకుంటోంది. నేడు వేడుకల నుంచి రాజ్‌పథ్‌ను విడదీయలేకపోయినప్పటికీ, తొలి గణతంత్ర దినోత్సవాన్ని భిన్నంగా జరుపుకున్నారు. దానిలోని ఢిల్లీకి చెందిన గవర్నమెంట్ హౌజ్, ఇర్విన్ ఆంపిథియేటర్‌లో తొలి గణతంత్ర దినోత్సవ వేడుక జరిగింది.

**వలసపాలన ముగిసింది**

జనవరి 26, 1950లో డా. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన భారత రాజ్యాంగాన్ని అమలులోకి తేవడం ద్వారా బ్రిటిష్ సామ్రాజ్యంతో గల ఆఖరి రాజ్యాంగ సంబంధాలను భారత్ తెంచుకుంది. భారత జాతీయ కాంగ్రెస్ 1930లో వలసపాలన నుంచి పూర్తి స్వతంత్రాన్ని ప్రకటించుకుంటూ చేసిన పూర్ణస్వరాజ్ ప్రకటనను గౌరవించేందుకు ఈ తేదీని ఎంపిక చేశారు.

మిగతా 2లో

# శాంతి దూత భారత్



పలు ఖండాలలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ భారత్ శాంతి సందేశాన్ని వ్యాపింపచేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పేర్కొన్నారు. సార్వత్రిక సామరస్యానికి కట్టుబడ్డ ప్రాచీన నాగరికతా నిబద్ధతను బలోపేతం చేసే శాంతి దూతగా భారత్ ను ఆమె అభివర్ణించారు. నేడు భారత్ పునరుద్ధరించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెడుతోందని ఆమె అన్నారు. పౌరుల రక్షణ కోసం సాయుధ దళాల సంసిద్ధతను ఆమె కొనియాడారు. ఆమె ఆపరేషన్ సిందూర్, మహిళా సాధికారత సహా పలు అంశాలపై ఆమె చర్చించారు.

**న్యూఢిల్లీ, జనవరి 25 :** విదేశీ పాలన సంకెళ్ల నుంచి భారత్‌ను విడిపించేందుకు గొప్ప త్యాగాలు చేసిన సాహస వీరులకు నివాళులు అర్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ గణతంత్ర దినోత్సవం ముందు రోజు దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. పౌరుల భద్రత కోసం సైనిక దళాల సంసిద్ధతను రాష్ట్రపతి కొనియాడారు. భారత ప్రజాస్వామ్య ప్రయాణం, రాజ్యాంగ ఆదర్శాలు, ఉమ్మడి బాధ్యతలపై ఆమె తన ఆలోచనలను పంచుకున్నారు. కీలకమైన జాతీయ విజయాలను పట్టి చూపుతూ, సమృద్ధమైన, స్వావలంబన కలిగిన, దూరదృష్టి గల భారత్ కోసం సమిష్టిగా కృషి చేస్తూనే, ఐక్యతను, కలుపుకోవడాన్ని బలోపేతం చేసి, సమస్యలను ఎదుర్కొనే శక్తిని పౌరులు పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశ పౌరులకు 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు చెప్పారు. దేశీయంగా, విదేశాలలో భారతదేశ ప్రజలమైన మనం గణతంత్ర దినోత్సవాన్ని ఉత్సాహంతో జరుపుకోనున్నాం అంటూ, మన దేశ గత, వర్తమాన, భవిష్యత్ దిశ, హోదా గురించి ఆలోచించేందుకు గణతంత్ర దినోత్సవం మనకు ఒక అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. మన స్వాతంత్రోద్యమ శక్తి, మన దేశ హోదా ను ఆగస్టు 15, 1947న మార్చింది. భారత్ స్వతంత్రమైంది. స్వాతంత్రోద్యమం భారత్ విధిని ఆగస్టు 15, 1947న పరివర్తనకు లోను చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. దేశం స్వాతంత్రం సాధించిన అనంతరం తన స్వంత భవిష్యత్తును మలచుకోవడం ప్రారంభించామన్నారు. రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమల్లోకి రావడం భారతదేశం ఒక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా జన్మించడానికి సంకేతం, ఇది భారతదేశాన్ని వలసవాద వ్యవస్థ నుంచి విముక్తం చేసిందని ఆమె అన్నారు. ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద గణతంత్రపు మూల పత్రం మన రాజ్యాంగం. మన రాజ్యాంగంలో పొందుపరచిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రతృత్వం అనే ఆదర్శాలు మన గణతంత్రాన్ని నిర్వచిస్తాయి. రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ నిబంధనల ద్వారా జాతీయవాద స్ఫూర్తి, దేశ ఐక్యతకు ఒక బలమైన పునాదిని వేశారన్నారు.

# కేరళకు మూడు పద్మ విభూషణ్‌లు

## శిబూసోరేన్‌కు పద్మ భూషణ్



శిబూసోరేన్

- వికసించిన తెలుగు పద్మాలు
- ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు 'నోరి'కి వరించిన పద్మ భూషణ్
- రెండు తెలుగు రాష్ట్రాలకు 11 పద్మశ్రీ లు
- తెలంగాణ నుంచి ఏడుగురిని వరించిన పద్మశ్రీ
- పశుసంవర్ధక, పాడి పరిశ్రమ విభాగాల్లో అందించిన సేవలకు గుర్తింపు
- యూజీసీ మాజీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌కు ఢిల్లీ కోటాలో పద్మశ్రీ
- అభినందనలు తెలిపిన సీఎం రేవంత్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'పద్మ'పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మ భూషణ్, 113మందికి పద్మశ్రీ అవార్డులను ఆదివారం ప్రకటించింది. వీరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ కు ఎంపికయ్యారు. అలాగే ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో

మిగతా 2లో



ధర్మేంద్రకు మరణానంతరం పద్మ విభూషణ్



మమ్ముట్టికి పద్మ భూషణ్

**తెలంగాణకు ఏడు పద్మశ్రీలు**



దీపికా రెడ్డి



గూడూరు వెంకట్ రావు



గడ్డమనుగు చంద్రమౌళి



మామిడి రామారెడ్డి



పద్మ విభూషణ్ అచ్యుతానందన్



పద్మ భూషణ్ నోరీ దత్తాత్రేయుడు



పద్మశ్రీ రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

# మళ్లీ అధికారం మాదే

## త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లోనూ, వచ్చే అసెంబ్లీ పోల్స్ లోనూ గెలిచేది హస్తమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**వుదయం, నిజామాబాద్ :** వచ్చే శాసనసభ ఎన్నికల్లోనూ అధికారం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. అంతకు ముందు త్వరలోనే జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ గత ఎన్నికల ఫలితాలే వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా బీఆర్ఎస్, బీజేపీలకు అనుకూలంగా ఉన్న నిజామాబాద్ లోనూ ఈ సారి స్థానిక కార్పొరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆదివారం నిజామాబాద్ లోకసభ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్, మెట్పల్లి, కోరుట్ల పురపాలక సంఘాల పార్టీ సమన్వయ సమావేశాలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి, అమలు జరుపుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మీద విశ్వసనీయతను పెంపొందించిందని ఆయన పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిని అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విరివిగా తీసుకపోయేందుకు కాంగ్రెస్ పార్టీ లీడర్, క్యాడర్ కృషి చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న పురపాలక సంఘం ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 2లో



## ప్రముఖ జర్నలిస్టు మార్క్ టుల్లీమృతి

2

## భారతీయ కుటుంబ వ్యవస్థకు గర్వకారణం



యుఏఇ నిర్ణయంపై ప్రధాని మోడీ హర్షం



2

## ఎవరికీ తలొగ్గను

తమిళనటుడు విజయ్

# కాంగ్రెస్ లొసుగులు బయటపెడతా

## ఆ పార్టీ హయాంలో సింగరేణి టెండర్లలో జరిగిన కుంభకోణాలన్నింటినీ ఆధారాలతో సహా వెల్లడిస్తా ● సైట్ విజిట్ పై భట్టి అబద్దాలు : మాజీ మంత్రి హరీశ్ రావు



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** కాంగ్రెస్ పాలనలో సింగరేణి టెండర్లలో జరిగిన కుంభకోణాలన్నీ ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతానని మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. కేవలం నైని, సోలార్ స్కామ్‌లే కాదని ఇంకా చాలా కుంభకోణాలకు కాంగ్రెస్ నాయకుల తెరలేపారన్నారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పై భట్టి అవాస్తవాలు మాట్లాడారన్నారు. ఆ విధానం లోపభూయిష్టం అన్న ఆయన.. ఇది వద్దని సింగరేణికి ఫిర్యాదులు వచ్చింది నిజం కాదా? అని నిలదీశారు. ఈ విషయం మీటింగ్‌లో మాట్లాడారా లేదా బయటపెట్టాలని భట్టికి సవాల్ చేశారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. మినిట్స్ ఆఫ్ ది మీటింగ్స్ బయటపెట్టాలన్నారు. సీఎం బావమరిది ఏ హోటల్ లో కూర్చుని టెండర్లు నిర్ణయించారో మాకు తెలుసని ఆఫోటోలు కూడా సమయం వచ్చినప్పుడు బయటపెడతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని బొగ్గు స్కామ్ నుంచి బయటపడేసేందుకు భట్టి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డే అవినీతి చేస్తున్నారంటే ఆయనతో మాట్లాడటమేంటని ప్రశ్నించారు. టెండర్ల విషయంలో తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా భట్టి దాటవేశారన్నారు. ఈ విషయంలో మసిపూసి మారెడుకాయ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

**టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేదు**

సింగరేణి టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేదని హరీశ్ రావు ఆరోపించారు. సైట్ విజిట్ నిబంధన బీఆర్ఎస్ హాయంలోనే వచ్చిందని భట్టి అబద్ధం చెప్పారన్నారు. సింగరేణి టెండర్లను సీఎంపీడీఐ, మెకాన్, ఆర్ఐపీడీఎస్ పరిశీలిస్తాయన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ వారికి టెండర్లు ఇచ్చుకునేందుకే ఈ సంస్థలను పక్కన పెట్టిందన్నారు. 2018 నుంచే సైట్

మిగతా 2లో

# ప్రతి అంగుళం డిజిటల్

- భూ యజమానులకు శాశ్వత యాజమాన్య రైతు హక్కులు
- క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- పాత పద్ధతులకు స్వస్తి, ఆధునిక 'రోవర్స్'తో కొలతలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వుదయం, ఖమ్మం:** రాష్ట్రంలో అన్ని రకాల భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలోని టేపులు,

మిగతా 2లో

# చిన్నారులను చిదిమేసింది

## మహానగర అగ్ని ప్రమాదంలో ఐదుగురు మృతులు ● మృతుల్లో ఇద్దరు పిల్లలు

- నాంపల్లి అగ్ని ప్రమాదంలో విషాదం
- ఫర్నీచర్ షాపు ఓనర్ సతీష్ బచా అరెస్ట్
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- 22 గంటలు సాగిన రెస్క్యూ
- దట్టమైన పొగలతో సహాయకచర్యల్లో జాప్యం
- అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం సీరియస్
- అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

**వుదయం, హైదరాబాద్ :** నాంపల్లిలో స్టేషన్ రోడ్డులో ఈ నెల 24న జరిగిన అగ్ని ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. ఓ ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు నాలుగు అంతస్తులకు వ్యాపించిన ఈ ప్రమాదంలో చాలా మంది చిన్న చిన్న గాయాలై ప్రాణాలతో బయటపడగా.. ఆ మంటల్లో చిక్కుకున్న ఐదుగురు సజీవ దహనం అయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలో దిగిన రెస్క్యూ బృందాలు. 22 గంటల పాటు సహాయక చర్యలు చేపట్టిన తర్వాత మృతుల సంఖ్యపై స్పష్టత వచ్చింది. చనిపోయిన వారిలో ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. గుర్తించిన అఖిల్ (7), ప్రణీత్ (11), హాబీబ్ (35), ఇంతియాజ్ (32), బేబీ (43) మృతదేహాలను గుర్తించిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం వాటిని ఉస్మానియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మరో ప్రతి మృత కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

మిగతా 2లో

**మృతుల వివరాలు**

బీ.బీ. అమ్మ
భర్త: లేట్ హుస్సేన్ ఖాన్
వయస్సు: 60 సంవత్సరాలు
నివాసం: కర్ణాటక
(వాచ్‌మన్ సమీర్ తల్లి)

అఖిల్
తండ్రి: యాదయ్య
వయస్సు: 7 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

ప్రణీత్
తండ్రి: యాదయ్య
వయస్సు: 11 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

మొహమ్మద్ ఇంతియాజ్
తండ్రి: మొహమ్మద్ యూసుఫ్
వయస్సు: 31 సంవత్సరాలు
నివాసం: నాంపల్లి

సయ్యద్ హబీబ్
తండ్రి: ముజీబుద్దీన్
వయస్సు: 30 సంవత్సరాలు
వృత్తి: ఆటో డ్రైవర్
నివాసం: శాస్త్రిపురం, రాజేంద్రనగర్

# తెలంగాణ పోలీసులకు సేవా పతకాలు

- హెడ్ కానిస్టేబుల్ మర్రికి వరించిన మెడల్ ఆఫ్ గ్యాలంటరీ
- ఇద్దరికి రాష్ట్రపతి విశిష్ట సేవ పతకాలు
- 15 మందికి వరించిన మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ అవార్డు



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి విశిష్ట సేవా పథకాలకు తెలంగాణ పోలీసు ఎంపికయ్యారు. మెడల్ ఆఫ్ గ్యాలంటరీ అవార్డులకు హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకట రెడ్డి ఎంపిక అయ్యారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పథకాలకు ఇద్దరు అధికారులు ఎంపికయ్యారు. అడిషినల్ ఎస్పీ మంద జీఎస్ ప్రకాష్ రావు, సబ్ ఇన్స్‌పెక్టర్ ఎ.దామోదర్ రెడ్డి ఎంపిక అయ్యారు. మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ అవార్డుకి 15 మంది పోలీస్ అధికారులు ఎంపిక కాగా వారిలో ఎస్ఐబీ ఐజీ సుమతికి మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ అవార్డు ఎంపిక అయ్యారు. హోంగార్డ్ విభాగం నుంచి ముగ్గురు, ఫైర్ విభాగం ముగ్గురు నుంచి ఎంపికయ్యారు.

మిగతా 2లో

## మళ్లీ అధికారం మాదే

మొదటి పేజీ తరువాయి..

ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ పురపాలక సంఘం మీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ నిర్వహిస్తున్న సర్వేల ఆధారంగా టికెట్లు ఖరారు చేస్తామన్నారు. సర్వేతో పాటు విధేయత,చిత్తశుద్ధి, క్రమశిక్షణ ల ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. అవకాశం రాని వారికి ప్రత్యమ్నాయ అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపులో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జరుగుతున్న అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి పట్టణ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. అర్హులైన నిరుపేదలకు యావత్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా నాణ్యమైన సన్నబియ్యం ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.

## కాంగ్రెస్ లొసుగులు బయటపెడతా

మొదటి పేజీ తరువాయి..

విజిట్ నిబంధన ఉందని భట్టి మాట్లాడారనీ కానీ ఓబీ (ఓవర్ బర్డెన్ రిమూవల్) వర్క్స్ కు గతంలో సైట్ విజిట్ విధానమే లేదనే విషయాన్ని గుర్తు చేశారు. నిజాన్ని ఒప్పుకోకుండా ఈ నిందను బీఆర్ఎస్ పైకి నెట్టే ప్రయత్నం భట్టి చేస్తున్నారన్నారని హరీశ్ రావు మండిపడ్డారు. ఓబీ వర్క్స్ లో సైట్ విజిట్ విధానం తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. ఈ విషయంలో ఎక్కడైనా మాట్లాడుదామో భట్టి చెప్పాలని సవాల్ చేశారు. 2025 జనవరిలో సైట్ విజిట్ లేకుండానే భూపాలపల్లిలో ఒక ఓబీ కాంట్రాక్ట్ టెండర్ పిలిచారన్నారు. అంటే మీ ప్రభుత్వం తొలినాళ్లలో పాత బీఆర్ఎస్ విధానాన్నే ఇక్కడ అమలు చేశారని చెప్పారు. . ఆ తర్వాత మూడు నెలలకు 2025 మే నెలలో వీఆర్ఓసీ టెండర్ ను సైట్ విజిట్ తో పిలిచారనీ దీని లబ్ధిదారుడు సృజన్ రెడ్డి శోధా కన్ స్ట్రక్షన్ అని ఆరోపించారు.

## తెలంగాణ పోలీసులకు సేవా పతకాలు

మొదటి పేజీ తరువాయి..

పోలీస్, ఫైర్, హోమ్ గార్డ్ , సివిల్ డిఫెన్స్ , కరెక్షనల్ సర్వీసెస్ నుంచి అవార్డు గ్రహీతలను ఎంపిక చేశారు.
మెడల్ ఆఫ్ గ్యాలంటరీ – మర్రి వెంకట రెడ్డి(హెడ్ కానిస్టేబుల్)
రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం (ప్రెసిడెంట్ మెడల్ ఫర్ డిస్టిన్ గ్యూషుడ్ సర్వీస్)
మంద జీఎస్ ప్రకాష్ రావు అడిషినల్ ఎస్పీ
ఎ.దామోదర్ రెడ్డి సబ్ ఇన్స్ పెక్టర్
===
మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్
అవార్డు గ్రహిత – హోదా, బీ. సుమతి– ఐజీ, ఎస్ఐబీ, పి.వెంకట్ రాములు – కమాండెంట్ఎం ,. శంకర్– డీఎస్పీ, ఎ.భాను మూర్తి– సీనియర్ కమాండెంట్ కేవీఎం ప్రసాద్– డీసీపీ, సి వంశీ మోహన్ రెడ్డి– డీఎస్పీ, టీ.లక్ష్మి –డీఎస్పీ బీ.ఎల్లయ్య– సబ్ ఇన్స్పెక్టర్,, వి.పురుషోత్తం రెడ్డి –సబ్ ఇన్స్పెక్టర్, సయ్యద్ అబ్దుల్ కరీం –సబ్ ఇన్స్పెక్టర్, బీ. ఆనందమ్ అసిస్టెంట్ –సబ్ ఇన్స్పెక్టర్, పైలి మనోహర్– హెడ్ కానిస్టేబుల్

## ప్రతి అంగుళం డిజిటల్

మొదటి పేజీ తరువాయి..

గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నామని చెప్పారు. ఇప్పటికే ఆరొందల రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించినట్లు వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు. ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని మంత్రి వెల్లడించారు. ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిద్దంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## చిన్నారులను చిదిమేసింది

మొదటి పేజీ తరువాయి..

ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందనకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరోవైపు ప్రమాదంపై చేపట్టిన ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యంతోనే అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలింది. దీంతో ఫర్నీచర్ షాపు యజమాని సతీష్ బచాను అబిడ్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, ఫైర్ సేఫ్టీ రూల్స్ పాటించకుండా సెల్లార్‌లో వ్యాపారం చేస్తుండటంతో కేసు నమోదు చేశారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా ఈ నెల 24న మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో హైదరాబాద్ లోని అత్యంత రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నిచర్ షాపులో మొదట మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నిచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగాపై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు. ప్రమాద సమయంలో భవనంలో పలువురు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సాహసించి భవనంలోకి వెళ్లి కొంత మంది పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను, పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అగ్నిమాపక సిబ్బంది అన్ని విధాల ప్రయత్నించారు. ఆక్సిజన్ సిలిండర్‌తో సెల్లార్ లోకి వెళ్లారు. వీరివెంట వైద్య సిబ్బంది కూడా ఉన్నారు.

### ప్రముఖుల సంతాపం

అగ్ని ప్రమాదంపై పలువురు రాజకీయ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ విషాదం నుంచి వారు త్వరగా తేరుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రమాదంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా భద్రతా ప్రమాణాలను పాటించకుండా వ్యాపారాలు నిర్వహించడం అత్యంత నేరమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని మహేష్ కుమార్ సూచించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు, సంస్థలు ఎక్కడైనా ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని నగరవాసులను కోరారు. నిర్లక్ష్యంతో ఒక్క ప్రాణం కూడా పోకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం అత్యంత దురదృష్టకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.
ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలిందని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫర్నీచర్ షాప్ లో జరిగిన అగ్ని ప్రమాదం పై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జీహెచ్ఎంసీ,పోలీస్ ,రెవెన్యూ , హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే పిర్యాదు చేయాలని కోరారు.

# జనవరి 26, 1950

మొదటి పేజీ తరువాయి..

భారత రాజ్యాంగం అమలులోకి రావడంతో, బ్రిటిష్ రాచరికపు ఆధిపత్యం నుంచి విముక్తమై, తొలి రాష్ట్రపతిని ఎన్నుకోవడం ద్వారా సార్వభౌమాధికారం గల గణతంత్రంగా అవతరించింది. దీని ద్వారా జాతీయ రాజకీయ ప్రయాణంలో నిర్ణయాత్మక పరివర్తనకు నాంది పలికారు.

### గవర్నమెంట్ హౌజ్‌లో వేడుక

ప్రస్తుత రాష్ట్రపతి భవన్ అయిన నాటి గవర్నమెంట్ హౌజ్‌లోని వైభవోపేతమైన దర్బార్ హాల్‌లో గణతంత్ర రాజ్యస్థాపనకు సంబంధించి అధికారిక ప్రకటన 1950, జనవరి 26 ఉదయం సరిగ్గా 10.18 నిమిషాలకు వెలువడింది. కాగా, అనంతరం ఈ వేడుకలకు సంబంధించి ఫిబ్రవరి 4, 1950లో వెలువడిన ఒక నివేదిక మరిన్ని వివరాలను అందించింది. దాని ప్రకారం భారత్‌ను సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్రంగా ఉదయం 10 గంటల 18 నిమిషాలకు ప్రకటించగా, ఆరు నిమిషాల అనంతరం, డా. రాజేంద్ర ప్రసాద్ దేశ తొలి రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. గణతంత్ర రాజ్య పుట్టుక, రాష్ట్రపతి పదవీస్వీకారాన్ని ప్రకటిస్తూ 10.30 గంటలకు 31 తుపాకులతో గౌరవ వందనం చేశారు. పదవీ విరమణ చేస్తున్న గవర్నర్ జనరల్ సి. రాజగోపాలాచారి దేశాన్ని గణతంత్రంగా ప్రకటించడంతో పాటు రాష్ట్రపతి పమాణస్వీక ారోత్వం కూడా జరిగింది. డా. రాజేంద్రప్రసాద్ అప్పుడు ప్రమాణ స్వీకారం చేసి. దేశాన్ని ఉద్దేశించి ఉపన్యసించారు. క్లుప్తమైన తన ఉపన్యాసాన్ని తొలుత హిందీలో తర్వాత ఇంగ్లీషులో ఇచ్చారు.

### దేశానికి రాష్ట్రపతి సందేశం

తన ఉపన్యాసంలో డా. రాజేంద్రప్రసాద్ ఒకే రాజ్యాంగం కింద దేశం ఏకీకృతం కావడాన్ని అభివర్ణిస్తూ ఆ క్షణాల ప్రాముఖ్యతను పట్టి చూపారు. మన సుదీర్ఘకాల, అనేకానేక అనుభవాల కలబోత అయిన చరిత్రలో, తొలిసారి ఉత్తరాన ఉన్న కశ్మీర్ నుంచి దక్షిణంలోని కేప్ కేమొరిన్ వరకూ, పశ్చిమంలో కథియవాడ్ , కచ్ నుంచి తూర్పులోని కోకొనాడ, కామరూప్ వరకూ అందరినీ ఒక రాజ్యాంగం, ఒక యూనియన్ కిందకు తీసుకురావడం జరిగిందని అన్నారు.

### తొలి రిపబ్లిక్ డే పరేడ్

ఈ వేడక అనంతరం, రాష్ట్రపతి ఊరేగింపు ఢిల్లీలో కిక్కిరిసిన పౌరులతో ఉన్న వీధులలో సాగింది. ఈ ఊరేగింపును చూసేందుకు ప్రజలు ఇళ్లకప్పులు, చెట్లు ఎక్కగా, తొలి రాష్ట్రపతి ప్రజలకు నమస్కార వందనం చేశారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 3.45 నిమిషాలకు ఇర్విన్ ఆంఫీథియేటర్ వద్ద ముగిసింది. దీనికే అనంతరం కాలంలో నేషనల్ స్టేడియంగా పేరు మార్చారు. ఇర్విన్ ఆంపిథియేటర్ వద్ద సైన్యం, పోలీసు దళాలకు చెందిన 3వేలమంది అధికారులు, సిబ్బంది ఉత్సవ కవాతు కోసం అక్కడ చేరారు. ఈ చారిత్రక సందర్భాన్ని వీక్షించేందుకు దాదాపు 15వేలమంది ప్రజలు అక్కడ గుమిగూడారు. పాతకోట నేపథ్యంలో దళాలు కవాతు చేయడం లేదా రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ నేటి విజయ్ చౌక్ గా పిలుస్తున్న చారిత్రిక స్థలానికి ఎటువంటి భద్రతా లేకుండా వెళ్లడం అనేవి మరువలేని దృశ్యాలనే చెప్పాలి. ఆ తర్వాతి సంవత్సరం నుంచి, గణతంత్ర దినోత్సవ వేడుకలు రాజ్‌పథ్‌కు మారాయి. ఇది అనంతరకాలంలో వార్షిక జాతీయ పరేడ్‌కు ప్రతీకగా మారింది.

# కేరళకు మూడు పద్మ విభూషణ్‌లు

మొదటి పేజీ తరువాయి..

పురస్కారం ప్రకటించింది. తమిళనాడుకు చెందిన నటేశన్, హైదరాబాద్ లోని సీసీఎంబీలో పని చేస్తున్న డాక్టర్ కుమారస్వామి తంగరాజ్‌కు జన్యుసంబంధ పరిశోధనలకు వారిని పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు.

పద్మవిభూషణ్
ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్
అచ్యుతానందన్(కేరళ)కు మరణానంతరం పద్మవిభూషణ్
కె.టి.థామస్(కేరళ)కు పద్మవిభూషణ్
సాహితీవేత్త పి.నారాయణన్(కేరళ)కు పద్మవిభూషణ్
కళల విభాగంలో ఎన్.రాజాం(ఉత్తరప్రదేశ్)కు పద్మవిభూషణ్

పద్మభూషణ్
ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూసోరేన్‌కు పద్మభూషణ్
క్రీడాకారుడు విజయ్ అమృతరాజ్‌కు పద్మభూషణ్
ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రాకు పద్మభూషణ్
కళల విభాగంలో మమ్ముట్టి(కేరళ)కి పద్మ భూషణ్
ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడుకు పద్మ భూషణ్
గాయని అల్కా యాజ్ఞిక్(మహారాష్ట్ర)కు పద్మభూషణ్
మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి(ఉత్తరాఖండ్) పద్మభూషణ్

తెలుగు 'పద్మశ్రీ'లు
సినీనటుడు మురళీమోహన్‌కు పద్మశ్రీ
సినీనటుడు రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ
ఏపీకి చెందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పద్మశ్రీ
ఏపీకి చెందిన వేంపటి కుటుంబశాస్త్రి(సాహిత్యం)కి పద్మశ్రీ
తెలంగాణకు చెందిన గూడూరు వెంకట్రావు(వైద్యం)కు పద్మశ్రీ
తెలంగాణకు చెందిన కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్(సైన్స్)కు పద్మశ్రీ తెలంగాణకు చెందిన గడ్డమనుగు చంద్రమౌళి(సైన్స్ విభాగం)కి పద్మశ్రీ, తెలంగాణకు చెందిన దీపికారెడ్డి(నృత్యకారిణి)కి పద్మశ్రీ, తెలంగాణకు చెందిన పాలకొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి(వైద్యం)కు పద్మశ్రీ

అంకె గౌడ (సాహిత్యం – కర్ణాటక)
తంగరాజ్ (హైదరాబాద్ సీసీఎంబీ శాస్త్రవేత్త)
ఎస్‌జీ సుశీలమ్మ, సంగ్యుగామ్, షఫీ సాదిక్, శ్రీరంగ్ దేవబాలద్, శ్యామ్ సుందర్, సింహాచల్ పాత్రో, సురేశ్ హనఘవాడి, తాగరామ్ భీల్, తేచి గుబిన్, తిరువయ్యూర్ భక్తవత్సలం, విశ్వ బంధు, యమున్ జాత్ర సింగ్, అర్మిడ ఫెర్నాండెజ్ (మహారాష్ట్ర), భగవాన్‌దాస్ రాయికర్ (మధ్యప్రదేశ్), భిక్ల్యా లదక్య దిండా బ్రిజ్‌లాల్ భట్ (జమ్మూకశ్మీర్), బుద్రి తాటి. చరణ్ హెబ్రామ్, చిరంజి లాల్‌యాదవ్, ధార్మిక్‌లాల్ చునిలాల్ పాండ్య, గఫ్రుద్దీన్ మెవాటి జోగి హోలీ వార్ ,ఇంద్రజిత్ సింగ్ సింధు,కె.పజనీవెల్.కైలాశ్ చంద్ర పంత్. ఖెమ్ రాజ్ సుంద్రియాల్, కొల్లాక్కయిల్ దేవకి అమ్మ జీ, మహేంద్ర కుమార్ మిశ్రా, మిర్ హాజీభాయ్ కసమ్‌భాయ్, మోహన్ నగర్, నరేష్ చంద్ర దేవ్ వర్మ నీలేష్ వినోద్‌చంద్ర మండేవాలా, నూరుద్దీన్ అహ్మద్, ఒత్తువర్ తిరుత్తణి స్వామి నాథన్. పద్మ గుర్మీత్, పోహిలా లక్తెపి, పుణ్యమూర్తి నటేషణ్, ఆర్.కృష్ణన్, రఘుపత్ సింగ్, రఘువీర్ తుకారామ్ ఖేద్కర్, రాజస్తపతి కలిప్ప గౌండర్, రామకృష్ణారెడ్డి మామిడి
రామచంద్ర గాడ్‌బోలే – సునీత గాడ్‌బోలే

### సీఎం అభినందనలు

పద్మ భూషణ్, పద్మ శ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన వారికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి గడ్డమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మ శ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. సేవా, కళా, ఇతర రంగాల్లో వారు చూపిన అంకితభావం, సేవలతోనే ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపికయ్యారని సీఎం పేర్కొన్నారు.

## భారతీయ కుటుంబ వ్యవస్థకు గర్వకారణం

**న్యూఢిల్లీ, జనవరి 25:** దేశ సంప్రదాయాలలో భాగమైన భారతీయ కుటుంబ వ్యవస్థను పోలి ఉందంటూ, యుఎఇ 2026 సంవత్సరాన్ని కుటుంబ సంవత్సరంగా ప్రకటించడాన్ని ఆదివారం ప్రధానమంత్రి కొనియాడారు. తన నెలవారీ మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ, నివాసిత కుటుంబాలన్నింటికీ సామూహిక భోజనశాలను నడుపుతున్న ఒక గుజరాత్ గ్రామ చొరవను ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు. గుజరాత్‌లోని బేచారాజీలోని చందన్‌కీ గ్రామ సంప్రదాయం ప్రత్యేకమైంది. ఇక్కడ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు ఇంట్లో వంట చేసుకోరని చెప్తే మీరు ఆశ్చర్యపోతారు. దీనికి కారణంగా, గ్రామంలోని అద్భుతమైన సామూహిక భోజనశాలే అని మోదీ అన్నారు. ఈ చొరవ ప్రజలను అనుసంధానం చేయడమే కాదు, కుటుంబ భావనను పెంచిపోషిస్తుందని అంటూ, భారతీయ కుటుంబ వ్యవస్థ అన్నది వారి సంప్రదాయంలో అంతర్గత భాగమని అన్నారు. అనేక దేశాలలో అటువంటి కుటుంబ వ్యవస్థలను అత్యంత గౌరవిస్తారు. కొద్ది రోజుల క్రితమే, నా సోదరుడు, యుఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నాహ్యన్ భారత్‌లో పర్యటించిన విషయాన్ని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. యుఎఇ 2026ను కుటుంబ సంవత్సరంగా జరుపుకోనున్నట్టు అల్ నాహ్యన్ మోడీకి చెప్పారు. ప్రజల మధ్య సామరస్యాన్ని, సమాజ స్ఫూర్తిని బలోపేతం చేయాలన్నది దీని లక్ష్యం, ఇది నిజంగా ప్రశంసనీయమైన చొరవ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

## రాహుల్ లో అభద్రతా భావం అధికం

### మాజీ కాంగ్రెస్ నేత షకీల్ అహ్మద్

**పాట్నా, జనవరి 25 :** భారత రాజకీయాలలో అత్యంత అభద్రతా భావం కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ అంటూ మాజీ కాంగ్రెస్ నాయకుడు షకీల్ అహ్మద్ శనివారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సీనియర్ పార్టీ నాయకుడిపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా , కేంద్ర మంత్రిగా వ్యవహరించిన అహ్మద్ గత నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయిన వెంటనే రాజీనామా చేశారు.
పార్టీలో బీటలు ఒక ప్రైవేటు ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, నేడు అవమానపడకుండా పార్టీలో ఏ సీనియర్, అనుభవం కలిగిన కాంగ్రెస్ నాయకుడూ మనుగడ సాగించలేకపోతున్నారని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు తీవ్రమైన అవకతవకలకు పాల్పడ్డారని, ఈ విషయంపై నాయకత్వం ఎప్పుడైనా ఆత్మపరిశీలన చేసుకుంటుందా అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక నామమాత్రపు అధ్యక్షుడు, అన్ని నిర్ణయాలూ రాహుల్ గాంధీనే తీసుకుంటారని అన్నారు.
ప్రముఖ, సీనియర్ నాయకులతో కలిసి పని చేయడంలో రాహుల్ ఇబ్బంది పడతాడు. తాను అక్కడ బాస్ కాదనిపిస్తే వెంటనే ఆ పరిస్థితి నుంచి దూరం జరుగుతాడని ఆరోపించారు.

**ఎస్ఐఆర్‌పై విమర్శ**

ఎస్ఐఆర్‌పై రాహుల్‌ను విమర్శిస్తూ, అతడు పూర్తిగా విఫలమయ్యాడని, ఆఖరికి ముస్లిం సమాజం కూడా అతడి ఆరోపణలను అంగీకరించలేదని అన్నారు. అనేకమంది సీనియర్ నాయకులకు ముస్లిం నాయకులతో, ముస్లింలతో కలిసి ఫోటో తీయించుకోవడానికి భయపడుతున్నారని, ఎందుకంటే, తమ హిందూ వోటు బ్యాంకును కోల్పోతామనే భయం వారిలో ఉందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రాహుల్ చేపట్టిన ఉద్యమం అర్థం లేనిదని, ఎందుకంటే క్షేత్ర స్థాయిలో అది ఎటువంటి ప్రభావాన్ని చూపలేదని ఆయన అన్నారు.
అహ్మద్ వ్యాఖ్యలకు తీవ్రంగా స్పందిస్తూ, ఆయన రాజ్యసభ టిక్కెట్టు ఆశిస్తున్నారని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని బీహార్ కాంగ్రెస్ అసిత్ నాథ్ తివారీ ఆరోపించారు. ఇటువంటి బ్లాక్‌మెయిలింగ్‌ను కాంగ్రెస్ ఎన్నటికీ సహించదని ఆయన నొక్కి చెప్పారు.
మరోవైపు, రాహుల్‌పై తన వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ బండారాన్ని మరోసారి బయటపెట్టారని బీహార్ జెడి(యు) అధికార ప్రతినిధి అభిషేక్ ఝా అన్నారు. స్వంత పార్టీలో ప్రజాస్వామ్యాన్ని అనుసరించని రాహుల్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు. ఖర్గేను రాహుల్ డమ్మీగా మార్చారు అని షకీల్ అహ్మద్ అంటున్నారు. ఏ కాంగ్రెస్ నాయకుడూ రాహుల్ గాంధీని గంభీరంగా తీసుకోరని బీజేపీ నాయకుడు ప్రదీప్ భండారీ అన్నారు.

## ఎవరికీ తల ఒగ్గే ప్రసక్తే లేదు : టివికె అధినేత, నటుడు విజయ్

**చెన్నై, జనవరి 25 :** తాను ఒత్తిడికి బెదిరి లొంగిపోనని, తల ఒగ్గే ప్రసక్తే లేదనే బలమైన సందేశాన్ని నటుడు, రాజకీయనాయకుడు విజయ్ ఆదివారంనాడు ఇచ్చారు. ఇటీవలే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ఆయనను ప్రశ్నించడం, సెన్సార్ బోర్డు ఆయన సినిమా విడుదలను అడ్డుకోవడం తెలిసిందే. ఈ క్రమంలోనే మామల్లపురంలో మూడువేల మంది రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలతో జరిగిన పార్టీ వ్యూహాత్మక సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పార్టీ టివికె తొలిసారి పోటీ చేయనుందని, విజయ్ తన మద్దతుదారులకు వెల్లడించారు. అది కేవలం ఎన్నిక మాత్రమే కాదు, అది ఒక ప్రజాస్వామిక యుద్ధం. ఆ యుద్ధంలో పోరాడే నా కమెండోలు మీరే అంటూ ఆయన వారికి సందేశమిచ్చారు. అధికార పక్షమైన డిఎంకెని, ప్రతిపక్షం ఎఐఎడిఎంకెని లక్ష్యంగా చేసుకుంటూ, రాజకీయాలలో ఉన్నవారు అన్నాను మరచిపోయారు, ముఖ్యంగా ఎవరి పార్టీ పేరులో అన్నా పేరు ఉందో వారు విస్మరించారు అంటూ విమర్శలు కురిపించారు. ఇక్కడ అన్నా అంటే తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, ద్రవిడ రాజకీయాలకు కీలక సిద్ధాంతకర్త అయిన సిఎన్ అన్నాదురై. అధికారంలో ఉన్న పార్టీలకు పోలింగ్ బూతులనేవి బోగస్ వోటింగ్ కేంద్రాలు అని విమర్శించారు. ప్రతి ఒక్క ఓటునూ, ప్రతివారినీ కలవండి అని కార్యకర్తలకు సందేశమిచ్చారు. దుష్టశక్తి (డిఎంకె)నీ, అవినీతి శక్తి (ఎఐఎడిఎంకె)ను ఎదుర్కోగల సత్తా కేవలం టివికెకు మాత్రమే ఉందని విజయ్ పేర్కొన్నారు. సోమవారం నుంచి పార్టీ రాష్ట్రవ్యాప్త ప్రచార టూర్‌ను నిర్వహించనున్నట్టు టివికె నాయకులు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల ముందు మద్దతును కూడగట్టుకొనేందుకు ఈ పర్యటన రాష్ట్రంలో ఉన్న మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాలను స్పృశిస్తుందన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకుంటున్నట్టు టివికె ఇంత వరకూ ప్రకటించలేదు. ఈ రాజకీయ పొత్తుల విషయంపై విజయ్ నిర్ణయం తీసుకుంటారని టివికె నాయకులు అన్నారు. మిత్రులు లేకుండా ఒంటరిగానే మేం గెలుస్తాం, అని విజయ్ ఆదివారం ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే రాజకీయ రంగంలోకి దూకిన 51ఏళ్ల సూపర్ స్టార్, గత కొద్ది నెలలుగా వార్తలలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో, తమిళనాడులోని కరూర్‌లో విజయ్ ప్రసంగించిన బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో 41మంది మరణించారు. దీనికి సంబంధించే సిబిఐ ఆయనపై దర్యాప్తు జరుపుతోంది. రెండుసార్లు ఢిల్లీలో ఆయనను ప్రశ్నించింది. విజయ్ సినిమా జన నాయగన్ విడుదలను సెన్సార్ బోర్డు అడ్డుకోవడంతో దానికి తెగ ప్రచారం లభిస్తోంది. దీని విడుదలకు సంబంధించి విజయ్ కోర్టులను ఆశ్రయించాడు.

## ప్రముఖ జర్నలిస్టు మార్క్ టుల్లీ మృతి

**న్యూఢిల్లీ, జనవరి 25 :** భారతీయ ఉపఖండంలో బిబిసికి చెందిన అతిపరిచితమైన స్వరంగా పరిగణించే ప్రముఖ జర్నలిస్టు, బ్రాడ్‌కాస్టర్ మార్క్ టుల్లీ, శనివారం నాడు మరణించారు. స్వల్పకాల అస్వస్థతకు లోనై మరణించిన టుల్లీ వయసు 90. సీనియర్ జర్నలిస్టు అనురాగ్ చతుర్వేది టుల్లీ అనారోగ్యంతో ఉండి, ఢిల్లీ ఆసుపత్రిలో చేరారని ఆయన పరిస్థితి గంభీరంగా ఉందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆందోళన వ్యక్తం కావడం మొదలైంది. ఆయన మరణవార్త తెలిసినప్పటి నుంచీ దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకుల నివాళులు వెల్లువెత్తాయి.
బ్రిటన్‌లో జన్మించిన మార్క్ టుల్లీ, భారత్‌లో స్థిరపడి, గత మూడు దశాబ్దాలుగా రాజకీయాలు, సమాజం, దేశంలో వస్తున్న పరివర్తనను నిర్వచించే చరిత్రకార ుడిగా మారాడు. ఆయన బిబిసి న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా 20 ఏళ్లపాటు సేవలు అందించారు. 1994 జులైలో రాజీనామా సమర్పించే వరకూ ఆ ప్రసార కంపెనీలో 30 ఏళ్లు పని చేశారు. ప్రధాన రాజకీయ పరిణామాలు, క్షేత్ర స్థాయి వాస్తవాల చారిత్రాత్మక వార్తలను అందించడం ద్వారా, భారతీయ శ్రోతల విశ్వసనీయతను టుల్లీ చూరగొన్నారు. సామూహిక ప్రసారానికి ప్రధాన మాధ్యమంగా రేడియో ఉన్నప్పుడు, టెలిఫోన్ అనుసంధానత ఆధారపడదగినది కాకపోవడంతో, రికార్డు చేసిన నివేదికలను మాగ్నెటిక్ టేప్ ద్వారా భౌతికంగా రవాణా చేసిన కాలానికి సజీవ సాక్షిగా యునెస్కో కొరియర్ ఆయనను అభివర్ణించింది. ఒక శతాబ్దంలో పావు వంతుకాలంలో, భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన, నమ్మదగిన రేడియో గొంతుకలలో ఒకరిగా మార్క్ టుల్లీ ప్రజావిశ్వాసాన్ని చూరగొన్నారని ఆ ప్రచురణ పేర్కొంది. కేవలం బ్రాడ్‌కాస్టింగే కాక, టుల్లీ తొమ్మిది పుస్తకాలు రచించిన ప్రసిద్ధ రచయిత. అందులో నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా అన్నది విస్తృతమైన ఆదరణను కలిగి ఉంది. పరిణామం చెందుతున్న భారత సామాజిక, రాజకీయ స్వరూపం గురించి చేసిన గొప్ప విశ్లేషణకు ఆయన ప్రశంసలను అందుకున్నారు. మార్క్ టుల్లీ మరణం జర్నలిజంలో ఒక శకానికి ముగింపు పలికింది. లోతైన విశ్లేషణ, విశ్వసనీయత, కథనాన్ని వివరించడంలో అచంచలమైన నిబద్ధతతో నిర్వచించిన శకానికి చెందిన వ్యక్తి ఆయన.

## జనవరి 27 నుండి 72వ మహిళా జాతీయ కబడ్డీ పోటీలు



**కుత్బుల్లాపూర్, జనవరి 25,(వుదయం ప్రతినిధి),:** తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 72వ సీనియర్ మహిళల జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్ –2026 జనవరి 27 నుంచి హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ పలువురు ప్రముఖులను వ్యక్తిగతంగా కలసి ఆహ్వానించారు. అందులో భాగంగాతెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వనపర్తి డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డిని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డిని,మాజీ మంత్రి వర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి ఈ జాతీయ స్థాయి క్రీడా వేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు. క్రీడల కోసం ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల నాయకుల నుండి లభిస్తున్న గొప్ప మద్దతును చూసి సంతోషం వ్యక్తం చేశారు.



## కాంగ్రెస్ నుంచి గులాబీ పార్టీలో చేరికలు

**జిన్నారం జనవరి 25(వుదయం ప్రతినిధి) :** జిన్నారం మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ మార్పులపర్వం జోరుగా ప్రారంభమైంది. ఆదివారం మున్సిపల్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. జిన్నారం గులాబీ గడ్డ కంచుకోటలో మరోసారి బిఆర్ఎస్ జండా రెపరెపలాడించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. బిఆర్ఎస్ లో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యుడు కంది ప్రవీణ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి శ్రీధర్ గౌడ్ రమేష్ శ్రీకాంత్ గౌడ్ నరసింహారెడ్డి బ్రహ్మేంద్ర గౌడ్ నర్సింగ్ రావు మల్లేష్ నర్సింగ్ రావు శేఖర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## భజన మండలిని అవమానిస్తే సహించం

### ఊరుకొండ పేట ఆంజనేయస్వామి దేవాలయంలో భజన కమిటీఆవేదన

**ఊరుకొండ, జనవరి 26వుదయం ప్రతినిధి):** మండలంలోని ఊరుకొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి భజన మండలి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భజన కార్యక్రమాల కోసం అవసరమైన తబలాలు, హార్మోనియం, తాళాలు, మైకులు తదితర సాంస్కృతిక సామగ్రిని దాతల సహకారంతో సమకూర్చినట్లు భజన మండలి కమిటీ అధ్యక్షులు జంగయ్య యాదవ్ తెలిపారు.



ఆదివారం ఆయన మాట్లాడుతూ భజన కార్యక్రమాలు నిరంతరం కొనసాగితేనే దేవాలయానికి భక్తుల ఆదరణ పెరిగి అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాంటి భజన మండలి కమిటీని, సభ్యులను దేవాలయ పాలక మండలి మరియు సంబంధిత అధికారులు కించపరచడం తగదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భజన మండలి సభ్యుల కృషిని గుర్తించకుండా అవమానకరంగా వ్యవహరిస్తే ఇకపై సహించేది లేదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎండోమెంట్ శాఖ అధికారులు కూడా జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా భజన మండలి సభ్యుల సౌకర్యార్థం భజన మండలికి ప్రత్యేక విశ్రాంతి భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



# యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి

## కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, జనవరి 25 (వుదయం)**

16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గారి సందేశం వినిపించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికి మనమందరం భారతీయులమని అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 25 జనవరి 1950 నాడు భారత రాజ్యాంగంలో 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించడం జరిగిందని దీని గుర్తుగా 2011 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తర్వాత ఓటు హక్కు వయసును 18 సంవత్సరాలకు సవరించి అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఏ దేశంలోలేని విధంగా భారత రాజ్యాంగం మన దేశంలో పౌరులకు స్వేచ్ఛను స్వాతంత్రాన్ని కల్పించిందని ఏ ఎన్నికలైనా కూడా ఓటు ప్రధాన పాత్ర పోషిస్తదని, కాబట్టి పౌరులందరూ తమకు నచ్చిన, సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవడానికి ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, ఓటు హక్కు ప్రాధాన్యతను ఇతరులకు తెలియజేయాలని అన్నారు. 18 సంవత్సరముల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటరుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా యువత బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ సి.కృష్ణారెడ్డి, చౌదరి, మధుసూదన్ రావు, ఎం.సత్తయ్య గౌడ్, పి.ప్రతాప్ రెడ్డి లను కలెక్టర్ సత్కరించారు. ప్రజాస్వామ్యములో ఓటర్ల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో పాల్గొని విజేతలుగా నిలచిన విద్యార్థులైన టి.శ్రీవల్లి, (10వ తరగతి విద్యార్థి టీజీఎంఎస్, నేదునూర్), కె.అభినయ, (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్ , కొంగర కలాన్), ఎన్. రఘుపతి (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్ (బాలుర) తుక్కుగూడ) ఎన్.సౌమ్య (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్ , శేరిగూడ), కె.అక్ష (10వ తరగతి టీజీఎంఎస్, మహేశ్వరం), జి.శ్రీనేత్ర (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్, రవిర్యాల), ఎం.సునిల్ (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్, రాగన్నగూడ), పి.శ్రీజ (10వ తరగతి కేజీవీబీ, మహేశ్వరం), ఎం.శృతి (10వ తరగతి కేజీవీబీ, యాచారం), వి.హర్షవర్ధన్ (10వ తరగతి జడ్పీహెచ్ ఎస్, సాహెబ్ నగర్), జి.అలంకృత (10వ తరగతి టీజీఎంఎస్ బొంగులూర్), కె.సింధు (9వ తరగతి కేజీవీబీ, మంచాల్), ఎన్.అనిత (10వ తరగతి కేజీవీబీ, ఇబ్రహీంపట్నం), కె.శశాంక్ (10వ తరగతి టీజీఎంఎస్, గున్ గల్), ఎండి.ఇంరాణా (10వ తరగతి టీజీఎంఎస్, ఆరుట్ల) లకు, ఎన్నికల్లో పని చేసిన కె.సౌమ్య, జెవైభాస్కర్, జె.దేవదాస్, నాగరాజ్, ఏ.అశోక్, రాజశేఖర్, ఎన్.నరేశ్, కె.వెంకటయ్య బిఎల్ఓ లకు అవార్డులను కలెక్టర్ అందజేశారు. యువ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్న శివరాం కనుగుల, ఎడ్ల మహేష్, శ్యాంప్రసాద్, వడియాల వరుణ్ లకు ఓటర్ కార్డులను అందజేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ 'భారత దేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని మతం, జాతి, కులం వర్గం భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు చేస్తామని' వివిధ శాఖల అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీణాభివృద్ధి పిడి మరియు స్వీప్ నోడల్ అధికారి శ్రీలత, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతుంది



**మరికల్, జనవరి 25 ( వుదయం) :**

మరికల్ మండల కేంద్ర పరిధిలో నీ ఎలిగండ్ల గ్రామంలో ఆదివారం డిసిసి జిల్లా అధ్యక్షులు జయ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఏ బి జె రాంజీ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందని ఆయన అన్నారు కేంద్ర ప్రభుత్వం మాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరోదించాలని ఆయన అన్నారు ఉపాధి హామీ హక్కులని కాలరాస్తుందని పేదలకు 100 రోజులు పని కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చట్టాలని తీసుకొస్తే అది తుంగలో తొక్కి బిజెపి కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తమ చేతికి తీసుకొని ఇష్టం వచ్చినట్లు చెప్పాలని మారుస్తున్నారని ఆయన అన్నారు వెంటనే ఈ చట్టాన్ని సవరించి ఉపాధి హామీ చట్టాన్ని రైతులకు కూలీల కు వాళ్ళ హక్కులని భంగం కలిగిస్తే కాంగ్రెస్ పోరాటం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన అన్నారు వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏపీజే రాంజీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఓబిసి జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య హనుమంతు బొంత మొగులయ్య మాజీ సర్పంచ్ నబీ సాబ్ సాకలి చిన్న బాలు రజాక్ వెంకటరమణ సాకలి నరేష్ అనిల్ కుమార్ సాయిల్ గౌడ్ వెంకటయ్య కథలయ్యా కురుమయ్య బాలయ్య లింగం చంద్రయ్య తోపాటు రైతులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఓటు హక్కు ఎంతో విలువైనది

**నాగర్ కర్నూల్, జనవరి25(వుదయం) :**



భారత రాజ్యాంగం స్ఫూర్తితో ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని నాగర్ కర్నూల్ రెవిన్యూ అదనపు కలెక్టర్ పి అమరేందర్ అన్నారు. అదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పి అమరేందర్ హాజరయ్యారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ సందేశాన్ని చదివి వినిపించారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి సీతారాం నాయక్ ప్రతిజ్ఞ చేయించారు. అదనపు కలెక్టర్ పి అమరేందర్ మాట్లాడుతూ.. దేశ ఉజ్వల భవిష్యత్తుకు ఓటే ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ గుర్తింపు పొందిందని, జాతీయస్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రస్థాయిలో రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటర్ల ప్రధాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యానికి మన దేశం ఒక ప్రత్యేక గుర్తింపు పొందింది అన్నారు. 1951లో ప్రారంభమైన తొలి సాధారణ ఎన్నికల నుంచి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా, ఓటు హక్కు విలువ, ప్రాధాన్యతను విద్యార్థులకు ఆయన ప్రత్యేకంగా గుర్తు చేశారు. రాజ్యాంగం ద్వారా ప్రసాదించబడిన ఓటు హక్కు ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాదిగా నిలుస్తోందని గుర్తు చేశారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల సంఘం పకడ్బందీగా ఎన్నికలు జరిపిస్తోందని, ప్రతీసారి వినూత్న పద్ధతులను ప్రవేశపెడుతూ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలు పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బూత్ స్థాయి పోలింగ్ అధికారులకు సన్మానం చేశారు . కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్‌కుమార్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సుజాత, జిల్లా పశు వర్ధక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, ఆర్డీవో సురేష్, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్, నాగర్ కర్నూల్ తహసిల్దార్ పాల్గొన్నారు .

# ఓటు హక్కు పౌరుల బాధ్యత

**గద్వాల, జనవరి 25 (వుదయం):**

16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం ఐడిఓసి ఆవరణలో ఓటరు దినోత్సవ ర్యాలీని అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పౌరులు, వివిధ శాఖల అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఓటు ప్రాధాన్యతను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి రైల్వే పైవంతెన మీదుగా అంబేద్కర్ చౌరస్తా అనంతరం కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ చేరుకున్నాక అదనపు కలెక్టర్ ప్రసంగించారు. 1950 జనవరి 26న గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి పౌరులందరికీ ఓటు హక్కును కల్పించడం జరిగిందన్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు కలిగిన, వివిధ వర్గాల ప్రజలతో వైవిధ్య భరితంగా ఉన్న మన దేశంలో దశాబ్దాలుగా ప్రజాస్వామ్య మనుగడకు ఓటు హక్కు కీలకంగా నిలుస్తోందన్నారు. ఓటరు దినోత్సవంతో యువత పెద్ద ఎత్తున ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవడానికి, ఓటు హక్కు విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడానికి ఆస్కారం ఉందన్నారు. అనంతరం అధికారులు ర్యాలీలో పాల్గొన్న వారందరితో ఓటరు ప్రతిజ్ఞ ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి రమేష్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా,డివైఎస్ఓ కృష్ణయ్య, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఇతర అధికా రులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌తో గ్రామాలకు మహర్దశ

## ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి



**తాడూరు, జనవరి 25 (వుదయం):**

కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ అని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల రాజేష్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు జిల్లాలోని తాడూరు మండల పరిధిలోని యత్మతాపుర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యొక్క ముఖ్య లక్ష్యమని ఆవిధంగానే ముందుకు వెళ్తూ గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని అని అన్నారు . కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి మాధవి వెంకటేశ్వర రెడ్డి , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు , సంభధిత అధికారులు మరియు మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# మన్ కి బాత్ వీక్షించిన బిజెపి నాయకులు



**నారాయణపేట టౌన్. జనవరి 25(వుదయం) :**

దేశ ప్రధాని నరేంద్రమోడీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లాలో బిజెపి నాయకులు వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా బిజెపి లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ మాట్లాడుతూ అన్ని అంశాల పై ప్రతి నెలకు ఒకసారి ప్రజల తో మమేకమై మాట్లాడే ఏకైక ప్రధాని నరేంద్రమోడీ అన్నా రు.ప్రజలతో మాట్లాడుతు ప్రజల అభిప్రాయాలు తెలు సుకుని వాటి అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉమాకాంత్,కుమార్,హనుమంతరావు,మహేష్,అనిత పాల్గొన్నారు.

# శంకుస్థాపనలకు కక్కుర్తి ఎందుకు?

## ఎంపీ డీకే అరుణ

**నారాయణపేట టౌన్, జనవరి 25(వుదయం) :**



కేంద్రం ఇచ్చిన నిధులతో చేపట్టే పనులకు కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా మంత్రులు ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేసే కక్కుర్తి ఎందుకు అని పాలమూరు పార్లమెంట్ సభ్యులు డి.కే. అరుణ ప్రశ్నించారు.ఆదివారం నారాయణపేట లో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండు రెడ్డి, జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ లలో కేంద్రం ద్వారా వచ్చిన నిధులు, ప్రజల నుంచి వచ్చిన పన్నుల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు.అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావచ్చిన మున్సిపాలిటీల అభివృద్ధికి చిల్లీ గవ్వ ఇవ్వలేదని విమర్శించారు.మాటలు మాత్రం కోట్లు చేతల్లో చిల్లీ గవ్వలేదని అన్నారు. అభివృద్ధి చేస్తామని కోట్లాది నిధులు ప్రకటిస్తున్నారని ఓట్ల కోసం జూటా మాటలు ఆడుతు న్నారని అన్నారు.గతంలో గత మంత్రులు పోటీ పడి స్టేడియం అభివృద్ధికి 20 కోట్లు ప్రకటించారనీ గుర్తు చేశారు.ఇప్పటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. ఆత్మకూరు లో అమృత్ పథకం నిధుల కింద మంజూ రు అయిన అభివృద్ధి పనుల కు మంత్రి హడావిడిగా రాత్రికి రాత్రి శిలాఫలకం వేసి ఉదయం శంకుస్థాపనలు చేసి టెంకాయలు కొట్టాల్సిన కక్కుర్తి ఎందుకు అని ప్రశ్నించారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి,కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,ఎన్నికల ఇంఛార్జి శ్రీకాంత్,కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్,నాయకులు మిర్చి వెంకటయ్య,శంకు ఉమేష్ ,సత్య రఘుపాల్ , పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ పాల్గొన్నారు.




# ఉష
## వుదయం సాహిత్యం

## భారతీయ కవిత

# ఆఖరి తపాలా బంట్రోతు

ఆఖరి తపాలా బంట్రోతును నేను –
ఈ చివరి ఉత్తరాన్ని బట్వాడా చేయడానికి
నేలంతా తిరుగుతున్నాను
దీని మీద చిరునామా స్పష్టంగా లేదు
భగవంతుడి చిరునామా లాగా –
చిరునామాదారు అక్కడ ఉండటం లేదని
దేవాలయాలు చెబుతున్నాయి
వాళ్ళకు "అతను " తెలియదు అని
మతాలు చెబుతున్నాయి.

అవును , ఉత్తరాల కాలం గతించి పోయింది
మధ్యాహ్నపుటెండ, ఋతుపవనాల వాన ఆనవాళ్ళున్న
నా గోధుమ రంగు గొడుగును చూసి
గోడ చాటు నుంచి వచ్చే
గాజుల చేయి ఇపుడు లేనే లేదు
ఏ తలుపు మీద వేలం నోటీసులను వేసే వాడినో
అదిప్పుడు తెరుచుకోవడం మానేసింది
పేదరికంలో పెన్షన్ కోసం ఎదురుచూసే
కన్ను మూతపడింది శాశ్వతంగా –
నియామక పత్రాల కోసం తిరిగి తిరిగీ
అరిగిన పాదాలు బతుకు నుంచి విరమణ పొందాయి

పగుళ్లు వారిన
వెదురు ఆధారం మీద
వానతో మంచుతో ఊదా
రంగుకెక్కిన గుండె లాగా
తపాలా పెట్టె ఇపుడు
ఒక అనాథ అయింది
నేను మాత్రమే మిగిలాను,
ఇంకా ఈ ఉత్తరం కూడా –

ఈ ఉత్తరం నా కోసం కాదని
సముద్రమంటున్నది –
ఋతువులకా , వాటికి
శాశ్వత చిరునామా లేదు
పక్షులు వలస పోయాయి
బహుశా ఈ ఉత్తరం
చివరి తపాలా బంట్రోతునైన
నా కోసమే నేమో

దాన్ని నేను తెరిచాను
ఆకాశమూ భూమీ
దుమ్ముతో కప్పబడి వున్నాయి



మలయాళ మూలం : రఫీక్ అహ్మద్
ఆంగ్లానువాదం: కె సచ్చిదానందన్
తెలుగు సేత : దర్భశయనం శ్రీనివాసాచార్య

◆◆◆◆◆

# కవితల తోటమాలి గుల్జార్



మన్నించండి, మిత్రులారా! నేను మీకు గుల్జార్ గురించిన తెలియని విషయాలేమీ చెప్పబోవడం లేదు. కాకపోతే ఒక కథ చెబుదామని మాత్రం అనుకుంటున్నా..

ఒకసారి ఒక పేదవాడు వెళ్తున్న మార్గంలో ఒక బోర్డు కనబడింది. ఇక్కడ పది అడుగులు తవ్వితే మీకు బంగారు నిధి నిక్షేపాలు లభిస్తాయని రాసి వుంది. వెంటనే ఆ పేదవాడు అక్కడ తవ్వడం ప్రారంభించాడు. రెండు, మూడు అడుగులు తవ్వేసరికి చుట్టు పక్కల గ్రామస్తులు జమకూడారు. బాగా తవ్వమని అతడిని ప్రోత్సహించారు. అతడు రెట్టించిన వుత్సాహంతో మరింత వేగంగా తవ్వడం ప్రారంభించాడు. నాలుగైదు అడుగులు తవ్వేసరికి చుట్టూ మూగిన ఆ గ్రామస్తులే వెక్కిరించడం ప్రారంభించారు. వెర్రి వాడివని అతడిని గేలి చేశారు. అయినా ఆ పేదవాడు పట్టు వీడకుడా మరో రెండు అడుగులు తవ్వాడు. బంగారం జాడ ఏ మాత్రం కనిపించలేదు. అతడిని నిరాశ ఆవరించింది. చుట్టూ మూగిన గ్రామస్తులు ఎగతాళిగా నవ్వుతున్నారు. అయినా, అతడు ఓపిక చేసుకుని మరో అడుగు తవ్వాడు. అక్కడంతా ఇసుక తప్ప ఏమీ కనిపించలేదు. ఆ పేదవాడు నిస్త్రాణగా తన ప్రయత్నాన్ని విరమించుకుని వెనుదిరిగాడు. గ్రామస్తులు ఆయన వెంటపడి గోల చేస్తూ తరిమికొట్టారు. కొద్ది రోజుల తరువాత అదే మార్గం గుండా మరో పేదవాడు వచ్చాడు. అక్కని బోర్డు చూసి, తవ్వాలని నిర్ణయించుకు న్నాడు. మరి అతడికి బంగారం దొరికిందా? నిధి నిక్షేపాలు అక్కడ నిజంగా వున్నాయా? తెలుసుకునే ముందు, గుల్జార్ గురించి నేను విన్నవీ, కన్నవీ మీకు నివేదిస్తాను. కాస్త ఓపిక చేసుకోండి..

★★★

నొప్పి తెలిసినవాడే జీవితాన్ని నవనవోన్మేషంగా మలుచుకో గలుగుతాడు. గుండెకు గాయమైనవాడే గేయమై వెల్లువెత్తు తాడు. దేశ విభజన, మత విద్వేషాలు, సామూహిక హత్యలు, చెల్లాచెదురైపోయిన జీవితాలు, గుండెలు పగిలిన కలలు.. దేశంపైని పుట్టుమచ్చలైతే, ఆ మచ్చల మధ్య ఓ మధురమైన విషాదపు టాటూ గుల్జార్. ప్రస్తుత పాకిస్తాన్‌లోని జీలం జిల్లా దీనాలో 1934 ఆగస్టు 18న జన్మించిన సంపూరన్ సింగ్ కల్రా.. గుల్జార్‌గా మారడం వెనుక వున్న చరిత్ర ఘనమైనది కాదు, విషాదకరమైనది. అది ఈ దేశ చరిత్రలోని చీకటితో ముడిపడి వుంది. దేశ విభజన సందర్భంలో జరిగిన అల్లర్లలో గుల్జార్ కుటుంబం అమృతసర్, ఢిల్లీల మీదుగా ముంబై చేరుకుంది. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. సవతి తల్లి యథావిధిగానే సరిగా చూడలేదు. చదువు మీద శ్రద్ధ లేకపోవడంతో ఇంటర్మీడి యట్‌తో ఆపేశాడు. తండ్రి సంపాదన అంతంత మాత్రమే కావడంతో ఒక కార్ల గ్యారేజీలో పనికి కుదురుకున్నాడు. అక్కడ పని ఎక్కువగా వుండకపోవడంతో పుస్తకాలు విస్తృతంగా చదవడం మొదలెట్టాడు. చిన్నతనం నుంచి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆకర్షణలో ఓలలాడుతున్న గుల్జార్ కవిత్వాన్ని తన మార్గం చేసుకున్నాడు. అలా అక్కడి ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ కార్యక్రమాలకు దగ్గర య్యాడు. తరచూ ఆ కార్యక్రమాల్లో పాల్గొంటున్న గుల్జార్‌ను అప్పటి ప్రముఖ కవి శైలేంద్ర ప్రముఖ దర్శకుడు బిమల్ రాయ్‌కి పరిచయం చేశారు. 'బందినీ' సినిమాకు సంగీతం సమకూరుస్తున్న ఎస్.డి. బర్మన్‌కీ, శైలేంద్రకీ ఏవో తేడాలు రావడంతో ఆ సినిమాలో ఒక పాట రాసే అవకాశం గుల్జార్‌కు దక్కింది. ఆ పాట బాగా నచ్చడంతో బిమల్, గుల్జార్‌ని తన అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు. అంతే, అక్కడ్నించి గుల్జార్ హిందీ సినిమారంగాన్ని కమ్ముకు న్నాడు. బిమల్ రాయ్ బెనజీర్ మొదలు పెట్టిన రోజులవి. అందులో అలనాటి అందాల నటి మీనా కుమారి హీరోయిన్. బిమల్ అసిస్టెంట్‌గా వున్న గుల్జార్ ఆమె మైకంలో మునిగిపోయాడు. త్వరలోనే వారి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ సాన్నిహిత్యంలో ఎంత ప్రేమ వుందంటే–ఒకసారి అనారోగ్యంతో వున్న మీనా కుమారి రంజాన్ ఉపవాస దీక్ష కారణంగా మందులు వేసుకోవడా నికి నిరాకరిస్తే, ఆమె బదులు తాను ఉపవాసం వుండి ఆమెను కాపాడాడు. ఆ అలవాటుతోనో, ఆమె జ్ఞాపకాల తోనో.. మీనా కుమారి మృతి చెందిన తర్వాత కూడా గుల్జార్ రంజాన్ ఉపవాస దీక్ష చేసేవాడని చెప్పుకుంటారు. గుల్జార్ మొదటి సినిమా 'మేరే అప్నే'లో మీనాయే హీరోయిన్. ఆమె మరణానంతరం ప్రముఖ హీరోయిన్ రాఖీని వివాహం చేసుకున్నాడు. అయితే, కూతురు మేఘన పుట్టగానే ఇద్దరూ విడిపోయారు. కానీ, ఇప్పటికీ విడాకులు తీసుకోలేదు.

సినిమాలు, పాటలు రాయడంలో మునిగి తేలుతున్నా సీరియస్ సాహిత్యాన్ని గుల్జార్ నిర్లక్ష్యం చేయలేదు. అంతేకాదు, ఒకేరకమైన ధోరణికి విరుద్ధంగా కొత్తగా ఏవైనా చేయాలనే తహతహతో పిల్లల కామిక్స్ వైపు ద ృష్టిసారించాడు. 'జంగిల్ బుక్'కు రాసిన 'జంగిల్.. జంగిల్.. బతా చలాహై' పాట ఎంత పాపులర్ అయ్యిందో అందరికీ తెలిసిందే. 'అలియాస్ ఇన్ వండర్‌లాండ్', 'పొట్లి బాబా'కు మాటలు, పాటలు రాశాడు. ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా నేర్చుకోవాలని తపించే గుల్జార్ 40వ ఏట సితార్ వాయించడం నేర్చుకు న్నాడు. 50వ ఏట టెన్నిస్ ఆడటం మొద లుపెట్టాడు. ఠాగూర్ సాహిత్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం కోసం ఏకంగా బెంగాలీ భాష నేర్చుకు న్నాడు. 'కోషిష్' సినిమాలో మూగ చెవిటి హీరో హీరోయి న్లకు సరైన దిశా నిర్దేశం చేయడం కోసం ఏకంగా ఆ సైగల భాష కూడా నేర్చుకున్నారు. ఆ అనుభవంతో వారి పాఠశాలకు సహాయం చేయడానికి విస్తృతంగా కృషి చేశాడు. 84 ఏళ్ల వయసులో 'టు' పేరుతో నవల రాశాడు. దేశ విభజన నాటి ఘటనలను అందులో కళ్లకు కట్టాడు. ఠాగూర్ సాహిత్యాన్ని అనువాదం చేసిన గుల్జార్ "ఆయన సాహిత్యం చదువుతున్న కొద్దీ అద్భుతంగా అనిపిస్తుంద"ని అంటాడు. తొంభై ఏళ్లకు చేరువవుతున్న ఆయన ఇప్పటికీ వివిధ భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని చదువుతూ, సమకాలీన మార్పులను అవగాహన చేసుకుంటూనే వుంటాడు. 34 భాషల నుంచి 300 మంది కవుల కవితలను అనువాదం చేసిన ఆయన ఈశాన్య రాష్ట్రాల నుంచి ఇప్పుడు పదునైన కవిత్వం వస్తోందని అంటారు. ఈ దేశంలో బతకాలంటే మతం నుంచి నన్ను నేను దూరంగా వుంచుకోవాలనుకు న్నాను. అప్పుడు మాత్రమే ఈ దేశంలో బతకగలం అని నవ్వుతూ అంటారు. గుల్జార్ కవిత్వం గురించి విస్తృతంగా తెలిసిన అనేక మందికి ఆయన వచనం గురించి చాలా తక్కువగా తెలుసు. విభజన సమయంలోని దుర్ఘటనల గురించి ఎంత చెప్పినా, వాటిని ప్రక్షాళన చేయలేమని వాపోతాడు. ఆ దుఃఖాన్ని వెళ్లబోసుకోవడంలో ఉర్దూ సహ కరించినట్టుగా, ఇంగ్లీషుతో కుదరడంలేదని చిరాకుపడ తాడు. రోడ్ల మీద చెల్లా చెదురుగా పడిన మృతదేహాలను, కుళ్లిపోయిన శవాలను గుర్తు చేసుకుంటూ విభజన నగ్నత్వాన్ని 'టు' అనే నవలలో అసమానంగా ఆవిష్కరి స్తాడు. కవిత్వంలో గుల్జార్ భాష మాత్రమే తెలిసినవారికి ఈ వచనంలోని భాష తొందరగా కొరుకుడు పడదు. విభజన వల్ల నష్టపోయిన, దాని శిథిల జ్ఞాపకాల్లో నివసి స్తున్న వారి మౌన సంభాషణను ఈ నవల పదునుగా వినిపి స్తుంది. మూడు సంపుటాలుగా వెలువడిన గుల్జార్ కథలు కూడా ఎంతో ప్రభావశీలమైనవి. గుల్జార్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందించిన కథా సంకలనాన్ని 'పొగ' పేరిట మృణాళిని గారు తెలుగులోకి అనువదించారు. మరో కథా సంపుటి 'ఆఫ్ ఏ రూపీ'ని పెంగ్విన్ ప్రచురించింది. ఈ కథల్లో బిమల్ రాయ్, జావేద్ అక్తర్, సాహిర్ లూథియాన్వి, కులదీప్ నయ్యర్‌ల గురించిన నిజజీవిత కథలు కూడా వుండటం విశేషం. ప్రధాన మంత్రిని హత మార్చాడానికి వచ్చిన మహిళా మానవ బాంబు చివరి రోజు జీవితం, ముంబైలో ఇల్లు కొట్టుకుపోతుంటే వర్షంతో కొట్లాడే తాగుబోతు వ్యక్తావ్యక్త ఆలాపన, వైర్ లెస్‌లో మాత్రమే మాట్లాడటానికి అలవాటుపడిన సైనికుడు ఈ కథల్లో మనకు తారసపడ తారు. దేశ విభజన నాటి అమానవీయ ఘటనలు గుల్జార్ హృదయంపై చెరగని ముద్ర వేశాయి అనడానికి 'నేరేడు చెట్టు', 'భయం', 'పంట', 'పొగ', 'విభజన' వంటి కథలు నిదర్శనంగా నిలుస్తాయి. 'వివాహ బంధం', 'మగవాడు', 'అతిథి' వంటి కథలు స్త్రీ పురుష సంబంధాలను ఆవిష్కరిస్తాయి. కాకపోతే, గుల్జార్ కవిత్వానికి, వచనానికి ఒక దగ్గర సంబంధం వుంది. అదేమిటంటే, ఆ రచనను చదవడం పూర్తయిన తర్వాత కూడా ఆ భావాలు మనల్ని వెంటాడతాయి. అందుకే–'సృష్టిలోని ప్రతిదాంట్లో రొమాన్స్ వుంటుంది. నొప్పిలో, పడే కష్టంలో కూడా రొమాన్స్ వుంటుంది. జీవితాన్ని ప్రేమించడం నేర్చుకుంటే, అది మీ సొంతమ వుతుంద'ని గుల్జార్ అంటారు.

★★★

అన్నట్టు కథ సంగతేంటనే కదా మీ సందేహం. అప్పటికే ఎనిమిది అడుగులు తవ్విన పేదవాడికి లభించనది, నాకేం దొరు కుతుందులే అని మరో పేదవాడు అనుకోలేదు. గొప్ప ఆశావహ దృక్పథంతో ఆ ఎనిమిది అడుగులు గోతిలోకి దిగాడు. చెమటోడ్చి, కష్టపడి మరో రెండు అడుగులు తవ్వాడు. అంతే.. మరో వెర్రి వెంగళప్ప వచ్చాడని గేలిచే స్తున్న గ్రామస్తుల నోళ్లు మూతబడిపోయాయి. ఆ పదడుగుల గోతిలో దొరికిన బంగారు నిధి నిక్షేపాల వెలుగులకు చుట్టు పక్కల అందరి కళ్లు బైర్లు కమ్మాయి. కృషి, పట్టుదలతో ఆ నిధిని సొంతం చేసుకున్న పేదవాడు మాత్రం దశాబ్దాలకు పైగా బంగారాన్ని అందరికీ పంచుతూనే వున్నాడు. ఇంతకీ, ఆ మరో పేదవాడు ఎవరో నేను మీకు చెప్పక్కర్లేదు కదా?

★★★

తోటమాలికి తెలియకుండా దొంగిలించిన, ఈ నాలుగు పూలను గుత్తిగా మలిచి ఆ జ్ఞానపీఠం ముందుంచి వినమ్రంగా ప్రణమిల్లుతూ.



దేశరాజు

> నీ నిష్క్రమణతో ఏమీ మారలేదు
> రాత్రి వచ్చింది, చంద్రుడూ వున్నాడు
> కానీ, నిదురే లేదు.
> ...
> నా హృదయంలో ఏదో మండుతోంది
> అది పొగలు కక్కుతోంది
> నా కళ్లను ఏదో కుట్టినట్టుంది
> బహుశా ఒక కల రగులుతోందేమో
> ..
> ఈ జీవితంలో మనం
> చాలా పొందుతాం. కానీ
> సాధించలేనివాటినే
> మనం లెక్కించుకుంటాం.
> ....
> నేను వార్తాపత్రికను తీసుకోగానే
> కొన్ని చిన్నచిన్న వార్తలు
> ఒడిలో పడ్డాయి
> ఓ పసిగుడ్డును ఎవరో
> చెత్తకుండీలో వదిలివెళ్లారు
> కుక్క ఒకటి మూడు రోజులుగా
> పాలు తాపించి బతికించింది
> ఇంతలో ఎవరో వచ్చి బిడ్డను తీసుకెళ్లారు
> ఇప్పుడా కుక్క పగలు, రాత్రి
> చెత్తను తడుముకుంటూనే వుంది.
>
> మూలం: గుల్జార్, తెలుగు: దేశరాజు

# ఎరుకల ఇతిహాసం

ఎరుకల ఎస్టీ కాలనీలో కాంతమ్మత్త, ఉడుకోడు వంటి ఉదాత్తమైన మనుషులు ఉన్నారని 'అమరజీవి మా కాంతమ్మత్త ' 'ఉడుకోడు' కథల్లో ఆయాపాత్రలను సజీవంగా చూపించారు. కాంతమ్మత్త చని పోయినా, ఉడుకోడు చనిపోయినా వాళ్ల గురించే మాట్లాడుకోవడం ఈ రెండు కథల్లో కనిస్తుంది. ఆడ పిల్లలు మొగుడి దగ్గర దెబ్బలు తిని ఏడుస్తా కనిపించినా కాంతమ్మత్తకు పూనకం వచ్చేది. "ఆడదా నిపైన చెయ్యి చేసుకోవడం కూడా ఒక మొగతనమేనారా. ఎంతో మురిపెంగా సాకి బిడ్డను ఇచ్చేది మొగోడి వంశాన్ని నిలబెట్టేదానికి, భార్య అంటే తల్లి తర్వాత తల్లి మొగోడికి. ఆ బుద్ధి మొగోల్లకి ఉండల్ల." అనేది.

" 'పేదోల్లు సార్. ఇండ్లకు పట్టాలు లేవు" అని అర్జీలు ఉడుకోడే రాసి ఎన్ని తూర్లు ఎమ్మార్వో వద్దకి ఆర్డీవో వద్దకి తిరిగినాడో లెక్కే లేదు. ఆడోళ్లు డ్వాక్రా గ్రూపుల్లో కరెక్టుగా లోన్లు కట్టకుండా ఉంటే, బ్యాంకు వాళ్లు వచ్చి అడిగేది కూడా ఈ పెద్ద మనిషినే. వాళ్లకు నచ్చచెపుతాడో, భయపెడతాడో అధికారుల వల్ల కానిది, నాయకుల వల్ల కానిది చేసి చూపిస్తాడు." ఉడుకోడు చనిపోతే, "పలక కొట్టే వాళ్లు దుడ్లు వద్దనేసిరి. గుంత తవ్వినోల్లు దుడ్లు వొద్దు అనేసిరి. సావు సరుకుల కోసం ఉడుకాయప్పకే కదా అని ఫ్రీగా ఇచ్చినారు. కొత్త టవలు, పంచె కూడ ఫ్రీనే" "ఆటో స్టాండు వాళ్లందరూ గట్టిగా అనుకున్యారంట సావుకు వచ్చినోల్ల కాడ ఎవరి దగ్గరా రూపాయి తీసుకోకూడదని." అదీ 'ఉడుకోడు' అనే నరసిం యలే. ఈ పంచాయితీ ఎలా ఉంటుందంటే, "కుల పెద్దలంటే మాటలు కాదు. నాటు సారా, పంది మాంసం పంచాయతీ పెద్దలకు ఇరుపక్షాలు పంచాయతీ జరిగినంత కాలం సమర్పించుకోవాల్సిందే. వాదించే కొద్దీ మాటలే కాదు, ఖర్చులూ పెరిగిపోతాయి. అప్పులూ పెరిగిపోతాయి.

### మా ఇండ్లకు రాబోకమ్మ

కిష్టప్ప, రాధమ్మలకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. కొడుకులి ద్దరికీ ఎస్టీ కోటా కింద ఉద్యోగాలొస్తాయి. వేరే కులంలో పెళ్లి చేసు కుంటారు. కొడుకులొచ్చి రెండేళ్లయిందని, తానే చూసి వద్దామని ఆ తల్లి వెళుతుంది. "ఎప్పుడూ ఈ పక్క రాబోకమ్మా. మనం ఎరుక లోళ్లం అని ఈ పక్క ఎవరికీ తెలియిదు. నువ్వొచ్చి మమ్మల్ని అగుడు చెయ్యద్దు. మాకుండే మానం మర్యాద అట్టనే ఉండాలంటే ఇంకెప్పుడూ మా ఇండ్లకు రాబోకమ్మా తల్లీ నీకు పుణ్యం ఉంటుంది." అన్న కొడుకులపైన రాదమ్మ కోపం తెచ్చుకోలేదు, అసహ్యించుకో నూలేదు. "ఆ ఇద్దరు మొగపల్లల్ని సాకే బదులు గమ్మునా నాలుగు పందుల్ని పంట్టింటే బావుండేది రాధమ్మా..అవన్నా మనల్ని సాకింటాయి మే.." అంటాడు క్రిష్ణప్ప 'ఎర్రమన్ను, ముగ్గుపిండి' కథలో టమాట పంటనంతా ఏనుగులు తొక్కేశాయని ఎరుకల దొరస్వామి గుండెలవిసేలా ఏడుస్తున్నాడు . ఏడు నెలల గర్భిణీ నీలమ్మ కండ్లలో నీళ్లు పొంగుతున్నాయి 'వెదుర్లు' కథలో.

హులు కథ. పోలీసు ఉద్యోగం పోగొట్టుకున్న నరసింహులు కాబోయే పోలీసు మొగిలప్పకు 'దేనికీ భయపడొద్దు'లో హితబోధ చేస్తాడు. "కులానికి ఎరుకలోడు అయితే దొంగే అంటావా. ఎవడ్రా దొంగా..దొంగనాకొడకా అని ఎస్ఐ చొక్కా పట్టకునేస్తి. ఉద్యోగం అయితే పొయ్యింది కానీ, నా పేరులోంచి పోలీస్ అనే మాటను పీకే దానికి ఎవడితరం కాలే." "కాలు పైకెత్తి సెల్యూట్ కొట్టేది మానేసి, ఇప్పుడు నేల తల్లికి దండం పెట్టకుంటా ఉండాను." "ఎప్పుడో ఎవరో పై కాలంలో దొంగతనాలు చేసినారని మొత్తం మన జాతినే దొంగలంటే యెట్టా ఒప్పుకుంటాం." అంటూ 'దేనికీ భయపడొద్దు' ఈకథలో ఎరుకల ఆత్మాభిమానాన్ని చూపిస్తాడు.

### ప్రపంచీకరణలోనే సమస్యల మూలాలు

ఎరుకల ఎస్టీ కాలనీలో కాంతమ్మ, ఉడుకోడు తో పాటు కార్మికుల కోసం పనిచేసే రమణ కూడా ఆదర్శంగా కనిపిస్తాడు. ఎమ్మార్వో కార్యాలయం ముందు జరుగుతున్న ధర్నాలో రమణ మాట్లాడుతూ "ఈ రోజు చేస్తున్న పని రేపటికి ఉంటుందన్న గ్యారంటీ లేదు. జీతం కానివ్వండి, కూలీ కానివ్వండి, సరిగ్గా చేతికి వస్తుందన్న నమ్మకం లేదు. ప్రపంచీకరణతో మోసం, దౌర్జన్యం, దుర్మార్గం పెరిగిపోతు న్నాయి." అంటాడు రమణ. "మీకు న్యా యంగా కేటాయించిన ఇంటి పట్టాల్ని రద్దు చేసి బినామీలకు అమ్ముకున్న ఎమ్మార్వో, ఆర్.ఐకు వ్యతిరేకంగా మనం చేస్తున్న ఈ పోరాటం న్యాయపోరాటం. " అంటాడు. ఈ 'ధర్నా' కథలో రెవెన్యూ వ్యవస్థలోని లో పాలను బట్టబయలు చేస్తూ, ఇవన్నీ ప్రపం చీకరణ వల్ల జరిగే మోసాలేనని, సమస్య మూలాలు ఎక్కడున్నాయో చూపిస్తారు.




### పంచాయతీ రిజర్వు అయినా..?

ఎస్టీ కులానికి చెందిన శ్రీనివాసులు సర్పంచ్ అయినా ఊరి కామందు రెడ్డి "ఒరేయ్" అంటాడు. "నీయబ్బ" అంటాడు. "నా కొడకా" అనీ అంటాడు. తెల్లకాగితం పైన ఖాళీ రిజిష్టర్ పైన సంతకాలు పెట్ట మంటాడు. అతను చెప్పిన చోట శీను సంతకం పెట్టాల్సిందే. ఎందుకు అని అతను అడగడు. ఎందుకో, ఏమిటో రెడ్డి చెప్పడు. ఏం రామాయణమంతా రాయల్నా. యాడ సంతకం పెట్టాల్నో గుర్తెట్టు చాలు, శీనుగా సంతకం పెట్రా." అంటాడు రెడ్డి. తరతరాల అవమా నాలు గుర్తొస్తుంటే, తదేకంగా తెల్లకాగితాల వైపే చూస్తూ నిలబడ తాడు శ్రీనివాసులు. కొన్ని పంచాయితీలను ఎస్టీలకు రిజర్వు చేయడంలో ఉన్న మోసాన్ని 'చప్పుడు' కథలో బహిర్గతం చేస్తారు.

### ఎరుకలోల్లంటే ఎరుక చెప్పే వాళ్లే

పిల్లలికి మూడో సంవత్సరంలోగా మునీశ్వరుడికి తల వెంట్రుకలిచ్చి, మేకపోతును, కోడి పుంజును, కోడి పెట్టను బలిచ్చే పండుగ మునిదే వర పండుగ పెద్ద కోలా హలం. 'మునిదేవర' కథలో మహేష్ కు , గోవిందుకు మధ్య జరిగే సంభాషణ ద్వారా ఈ కోలాహలం వెనుక ఉన్న సంగతులు వెల్లడవుతాయి. " దబ్బలల్లటం, మట్టలు చెయ్యడం, ఎర్రమన్ను అమ్మటం. ఆడాదా తిరిగి పందుల్ని పెంచటం, బాతుల్ని పెంచటం ఇంతే కదా. సోది చెప్పటం కదా మా ఆడోళ్లకు ముందు తెలిసింది. అసలు ఎరుకలోల్లంటే ఎరుక చెప్పే వాళ్లే కదా." ఇళ్లలో పాచి పనిచేసే కమలమ్మకు కూడా ఎరుకల కులమే అడ్డంకిగా ఎలా తయారవుతోందో 'అదే ప్రశ్న' చూపిస్తుంది.

### కుల పంచాయితీలు

కుల పంచాయితీల్లో జరిగే అన్యాయాలకు 'కబాబ్ కపాలి' కథ అద్దం పడుతుంది. ముగ్గురు అన్నలు ఏవో లెక్కలు చూపించి, పంచా యితీలో ఆస్తంతా రాయించుకుని కపాలికి మూడు వేలిచ్చారు. పంచాయితీలకు రెండు వేలు ఖర్చుకాగా, మిగిలింది వెయ్యిరూపా

మునిరాజ, మంజుల భార్యాభర్తలు. మల్లీశ్వర రెడ్డి మేకలను మంజుల మేపుతుంటుంది. మేక పిల్లను మింగడానికి వచ్చిన కొండ చిలువను లాఘవంగా తప్పిస్తుంది మంజుల. మల్లీశ్వర రెడ్డిని కొండ చిలువని ప్రతీకాత్మకంగా భావించేలా 'గురి' కథ ముగుస్తుంది. గ్రామ సభ ఎలా జరుగుతుందో దశ్యమానం చేస్తుంది 'ప్రయత్నం' కథ. అట్టడుగు వర్గం నుంచి వచ్చిన పంచాయతీ కార్యదర్శి లబ్దిదారుల జాబితా చదువుతుంటే ఎవరూ అభ్యంతరం చెప్పరు. "నిరుపేదల్లో నిరుపేదల కోసం ఉద్దేశించిన రుణాలు చాలా వరకు బినామీల పేరుతోనే స్వాహా అయిపోతూ ఉన్నాయి తమ్ముడూ." అంటూ పంచాయతీ కార్యదర్శి లలితమ్మ చెప్పడం వ్యవస్థ లోపాల్ని బహిర్గతం చేస్తోంది.

### ఏనుగులను తరిమే దానికీ కులం అడ్డం

ఏనుగులు అడవి దాటి సరాసరి కోటూరు వద్ద పొలాల్లోకి వచ్చేశాయి. "ఎరుకలామె మామిడి తోటలో ఏనుగులు పడి మొత్తం పాడుచేస్తున్నాయి. ఆమె ఒంటరి ఆడది. భర్త కరెంటు మానెక్కి సచ్చిపోయినాడని, ఇద్దరు ఆడ బిడ్డలకి ఇంకా పెండ్లీ దేవరా చెయాల్సి ఉందని, ఆ ఏనుగులకు ఏమైనా తెలుస్తాదా." అంటారొకరు. "కూలిపనులకి పిలుస్తారు కానీ ఎరికిలోల్లు పొలంలోకి దిగకూడదంటారు. అందుకే సారూ ఇల్లు అమ్ముకుని, ఇంట్లో సామాన్లు అమ్ముకుని, నేనూ నా మొగుడూ అన్నాలు తినేది కూడా వదిలేసి ఈ తోపు కొనింది. ఏనుగుల్ని తరిమేదానికి కూడా మీకు మా కులం అడ్డం వస్తా ఉండాదంటే చెప్పండి సారూ మిమ్మల్ని అడుక్కునే బదులు అదేందో నేను నా బిడ్డలు పొయ్యి ఆ ఏనుగుల్నే అడుక్కుంటాం సారూ.." అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఎరుకల కులంలో పుట్టడం వల్ల తామెలా అవమానా లకు, అన్యాయాలకు గురవుతున్నది ఆ సమావేశంలో వివరిస్తున్నారు. "ముందు కాలనీ పేరు మార్చాలి. ఎరుకల కాలనీ అనే పేరే వద్దు. 'ఏకలవ్య కాలనీ' అని పేరు పెట్టాలి. అందుకు మున్సిపాలిటీ తీర్మానం చేయాలి." అన్న ప్రతిపాదన వచ్చింది. తర్జన భర్జనలు జరిగాయి. 'ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు' వారి జీవితాన్ని చూపించిన సజీవ చిత్రాలు. ఈ కథల్లో ఉపయోగించిన భాష చాలా సరళంగా ఉంది. చిత్తూరు మాండలిక మాధుర్యాలను పాత్రోచితంగా చాలా జాగ్రత్తగా పలికించారు. పాలకులపై, అధికా రులపై సామాన్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేసేటప్పుడు తప్ప పెద్దగా తిట్లు ఉపయోగించలేదు. ప్రజల భాష పేరుతో గుప్పించే బూతులు మాత్రం లేకుండా పలమనేరు బాలాజీ చాలా జాగ్రత్త వహించారు. "గ్రాంథిక భాషను అర్థం చేసుకోవాలంటే ముందు రాయలసీమ మాండలికాలు అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, రాయలసీమ మాండలికాలే గ్రాంథిక భాషలో ఎక్కువగా ఉన్నాయి." అని గిడుగు రామ్మూర్తి ఒక సంపాదకీయంలో రాస్తారు. అందమైన రాయలసీమ మాండలికంలో భాగమైన చిత్తూరు మాండలిక పద సొగసుల నాడిని పలమనేరు బాలాజీ ఈ కథల్లో చక్కగా అంది పుచ్చుకున్నారు. ఇదొక 'ఎపిక్' అన్నారు డాక్టర్ గీతాంజలి. అందుకనే నేనీ కథల్ని 'ఎరుకల ఇతిహాసం' అంటున్నాను.



రాఘవ

పుస్తకం పేరు : ఏకలవ్య కాలనీ ఎరుకల జీవన గాథలు
రచయిత : పలమనేరు బాలాజీ 944-099-5010
పేజీలు : 163, వెల : 220
ప్రచురణ : పర్ స్పెక్టివ్స్
ప్రతులకు : నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, హైదరాబాద్ 500027, ఫోన్ నెంబర్ : 24652387

## అసామాన్యులు

లోకాన్ని నవ్వించడానికి
చారెడె కన్నీళ్లు దిగమింగుతాడు
హాస్యనటుడు

స్వేచ్ఛా జీవిగా బతకటానికి
వందల సంకెళ్ళు తప్పించుకుంటాడు
స్వాతంత్ర్య పిపాసి

ఒక్క కలను సాకారం చేసుకోవటానికి
వేల ముళ్ళ చూపులమీద
నడిచొస్తుంది యువతి
సింహాన్ని మచ్చిక చేసుకోవటానికి
లెక్కలేనన్ని పంజాదెబ్బలను
కాచుకుంటాడు సర్కస్ కార్మికుడు

ఉరిమే మేఘాలను తరిమేసి
స్వచ్ఛమైన ఆకారాన్ని వాగ్దానం చేసే
వీళ్ళు సామాన్యులు కారు
అసామాన్యులు



అమ్మంగి
వేణుగోపాల్
9441054637

# అభివృద్ధి నిర్మాత చెమట

అభివృద్ధి వెనుక చెమటచుక్కల జీవితాల చిత్రీకరణే వేల్పుల నారాయణ రచించిన "వెలుగుల వెనుక" కథా సంపుటి.ఈ కథల సంపుటి సింగరేణి బొగ్గు గనుల కార్మికుల జీవితాలను ఆధారంగా చేసుకుని రచించబ డిన ఒక శక్తివంతమైన,యథార్థ సాహిత్య రచన.ఈ కథలు దేశ ఆర్థికాభివృద్ధికి మూలస్తంభంగా నిలిచిన బొగ్గు ఉత్పత్తి వెనుక దాగి ఉన్న మానవీయ బాధలు,ఉత్పత్తి సంబంధాలు,అభద్రతలు,అన్యా యాలు,విధ్వంసమౌతున్న కుటుంబ సంబంధాలను వెలుగెత్తి చూపిస్తాయి. భూగర్భ సొరంగాల చీకటి నుంచి ఓపెన్ కాస్ట్ గనుల వరకు,భయానక పనిపరిస్థి తులు, దుర్భర బతుకులు,ఆక్రందనలు ఆధునికత పేరుతో జరిగే దోపిడీని ఎంతో సహజంగా చిత్రిస్తాయి. సింగరేణి గనుల గర్భంలో దాగిన కార్మికుల చెమట,రక్తం, ఆశలు ఈ పదిహేను కథల్లో (1988–2025) రచయిత స్వానుభవాల ద్వారా సజీవంగా నిలబడుతాయి. అభ్యుదయ దృక్పథంతో దోపిడీ, పోరాటం, మానవీయ స్పర్శలను రచయిత స్వయంగా కథలో భాగమై రాసిన విధానం పాఠకుడిని ఆలోచనలో ముంచెత్తుతుంది. ముందుమాట లోడా. రాచ పాళెం చంద్రశేఖర రెడ్డి గారు పేర్కొన్నట్లు ఇది కేవలం కథల సంపుటి మాత్రమే కాదు,భారతీయ కార్మిక వర్గ అగ్రశ్రేణి సాహిత్యంలో ఒక మైలురాయి.యాజమాన్యం నిర్లక్ష్యం,యూనియన్ విభేదాలు,రాజకీయ వాగ్దానాల ద్వంద్వం ఇవన్నీ బలమైన విమర్శతో చెప్పబడతాయి.కా ర్మికుల ఐక్యత లేకపోవడం,కార్మిక సంఘాల బలహీన తలు సమస్యలకు మూలమనే విశ్లేషణ వాస్తవంగా కన బడుతుంది.ప్రతి కథా మరణం,గాయం,నిరాశ కుటుం బాలను చూపిస్తూ పాఠకుడిని కదిలిస్తుంది. గనుల గర్భంలో దాగిన "నల్ల బంగారం"ఇతిహాసం పాతకా లపు చేతి తవ్వకం నుంచి యంత్రాల ప్రవేశం వరకు సాగుతుంది.ఇందులో వివరించిన సాంకేతికాంశాలు పాఠకులను గనులలోకి తీసుకువెళ్లి కొత్త ప్రపంచాన్ని చూపిస్తాయి. అగ్గి రాజుకుంటుంది కథలో – మల్లమ్మ ఆర్తనాదం ద్వారా కార్మికులకు ఒక న్యాయం, అధికా రులకు మరొకటి ఉండటం ఆలోచనలు రేకెత్తిస్తుంది. ఆరోగ్య హక్కులు, అమానుషత్వం మధ్య రగులుకునే అగ్ని నిస్సహాయాన్ని రగిలిస్తుంది. "మృత్యు కుహరం"లో గని ప్రమాదాల వాస్తవ చిత్రణ – బల వంతపు ఉత్పత్తి లక్ష్యాల కోసం జీవిత భద్రతను తాకట్టు పెట్టడం దిగ్భ్రమ కలిగిస్తుంది. ప్రాణభయాలు, భద్రతా లోపాలు భావోద్వేగాన్ని చురగ్గా రేపుతాయి. విధ్వంసం కథలో గని పని "విధ్వంసం"ను కుటుంబంలోకి తెస్తుంది. గని పని వల్ల మొగవాళ్లు అలసిన మనసు,శరీ రాలతో జీవిత భాగస్వాములను తృప్తి పరచలేకపో వడం,మధ్య దూరం పెరగడం,రెండు కుటుంబాల ద్వారా చూపిన వాస్తవికత ఆం దోళన పుట్టి స్తుంది. ఉద్యోగం కుటుంబాన్ని ఛిద్రం చేయడం దారుణమని చూపుతూ,కు టుంబ సంబంధాలు,ఉద్యోగ పరిస్థితుల సంఘర్షణ విచారకర ఉద్వేగపూరితంగా చిత్రించారు. "సమ్మె" యాజమాన్య కుట్రలను బయటపెడుతుంది – హక్కుల కాలరాస్తే కార్మికులు పని మానేసేలా చేయడం, అయినా ధైర్యంగా నిలబడటం పోరాట శక్తిని హైలైట్ చేస్తుంది. "బలి" కథలో ప్రమాదాలు బలులుగా మారతాయి.వి శ్వాసాలు, ఒంటరి స్త్రీల పట్ల అధికారుల వికృతత ఆక్రోశాన్ని రగుల్చుతుంది. "వారసత్వం"ముందుగానే పదవీ విరమణ తర్వాత సంతానానికి ఉద్యోగం కోసం పడే బాధలు, యూనియన్ నాయకుల అవినీతిని విమర్శిస్తూ కార్మికుల నిరాశను చిత్రిస్తుంది. మరణం తర్వాత వారసులకు"కారుణ్యం" ఉద్యోగ నియామకం – కుటుంబ భవిష్యత్ కష్టాలు, నాయకుల అనిబద్ధత సానుభూతిని పెంచుతుంది. "వాన చినుకులు"లో పేదల మానవత్వం మెరుస్తుంది – ధనికుల నిర్లక్ష్యం మధ్య పేద కార్మికుల సహకారం ఆశావాదాన్ని నింపుతుంది.

నక్సల్బరీ "ఉద్యమకెరటం" నవలగా రాయదగిన చాలా పెద్ద కథ.భూస్వాములను పెట్టుబడిదారులుగా మార్చిన పరిణామాలు,సుగుణ ప్రేమ,రవి త్యాగం,పారి శ్రామికవేత్తగా మారిన రంగారెడ్డి కుటుంబం ద్వారా సామాజిక మార్పులను ప్రశ్నిస్తూ ఆలోచనలు రేకెత్తి స్తుంది.ఇందులో ఉద్యమ పరిణామాల వల్ల కలిగిన లాభ నష్టాలు దృశ్యమానంగా కనిపిస్తాయి. "రవళీ నాదం" విఫల ప్రేమ ఫలితాలవల్ల జీవితాలు ఎలా తారుమారు అవుతాయో చూపి విచారాన్ని ఆవిష్కరి స్తుంది. ప్రపంచీకరణ సంబంధాలను ధ్వంసం చేసినా, మానవ ప్రయత్నంతో కాపాడుకోవచ్చని "సారు" కథ ఆశావాద సందేశమిస్తుంది. బాల్య ప్రేమ "చెదిరిన కల"గా మిగిలి, గత–వర్తమాన మధ్య మానసిక సంఘ ర్షణను ఫ్రాయిడ్ సిద్ధాంతంతో విశ్లేషిస్తూ జీవితంలో కలిగే నిరాశను చూపిస్తుంది.ఇది మంచి మనస్తత్వ కథ."చీకటి కడుపులో" అధికారుల హింస, అమాయ కులపై పోలీసు కేసులు,స్త్రీ అన్యాయాన్ని ఎత్తిచూపి ఆక్రోశాన్ని రగుల్చుతుంది. మతోన్మాదుల విద్వేష,వి కృత చర్యల మధ్య "దేవాలయం"లా మారిన మహిళ ఆశ్రయం – నిరుద్యోగ యువకుడిని సామాజిక ఉద్యమంలో భాగం చేయడం ఉదాత్తంగా సానుభూతిని ప్రేరేపిస్తుంది. తెలంగాణ భాషలో క వితాత ్మక ంగా రాయబడిన ఈ కథలు వాస్తవ స ంఘ ట న ల ఆధారంగా వస్తు–శిల్ప సమన్వ యంతో తీర్చిదిద్దబ డ్డాయి. కార్మిక సమ స్యలపై ఆలోచన రేకెత్తిస్తూ, విమర్శ నాత్మక వాస్తవిక తతో అభ్యుదయ నిబద్ధతను ప్రదర్శి స్తాయి.ఈ కథల సంపుటి ఒక అద్భుతమైన సామాజిక దర్పణం.సింగరేణి కార్మికులకు నివాళి అర్పించడమే కాక,విధాన నిర్ణేతలకు,సమాజానికి కళ్లు తెరిపించే చక్కని కథలు ఇవి."నల్ల బంగారం" వెనుక దాగిన రక్తం, చెమటను శాశ్వతంగా నమోదు చేసిన కథల సంపుటి,అందరూ చదవా ల్సిన మంచి పుస్తకం ఇది.ఇంత మంచి కథలను నవచేతన వారు పబ్లిష్ చేయడం అభినందనీయం. ఈ పుస్తకం నవచేతన (పబ్లి షింగ్, విశాలాంధ్ర,అన్ని బ్రాంచ్ లలో దొరుకు తుంది.)



డా.పల్లేరు వీరస్వామి
9194416 02605


వుదయం

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020



# జాతీయం-అంతర్జాతీయం



## శుభాన్షు శుక్లాకు అశోక్ చక్ర



**న్యూఢిల్లీ, జనవరి 25 :**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను అశోక చక్ర వరించనుంది. ప్రైవేట్ ఏక్సియోమ్ 4 మిషన్‌కు పైలెట్‌గా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు వెళ్లిన తొలి భారతీయ, ఇస్రో వ్యోమగామి అయినందున శుక్లాకు అశోక్ చక్ర ఇవ్వనున్నారు. ఉత్తర్ ప్రదేశ్ గౌరవ్ సమ్మాన్‌ను కూడా అందుకోనున్న శుభాన్షు శుక్లా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాష్ట్రానికి గౌరవాన్ని తెచ్చిపెట్టినందుకు శుభాన్షు శుక్లాను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సత్కరించనుంది. వార్తా సంస్థల ప్రకారం, శనివారం ప్రారంభం కానున్న మూడు రోజుల వేడుక, ఉత్తర్ ప్రదేశ్ డే 2026లో భాగంగా శుక్లాను ఉత్తర్ ప్రదేశ్ గౌరవ్ సమ్మాన్ తో రాష్ట్ర ప్రభుత్వం గౌరవించనుంది. నాసా కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి జూన్26, 2025న స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని చేరుకొని శుక్లా చరిత్ర సృష్టించారు. ఐఎస్ఎస్‌పై కాలు పెట్టిన తొలి భారతీయ వ్యోమగామి ఆయన. అయితే, అంతరిక్షంలోకి వెళ్లిన రెండవ భారతీయుడు. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడు రాకేష్ శర్మ అన్న విషయం తెలిసిందే. శుభాన్షు శుక్లతో పాటుగా అలఖ్ పాండే, డా.హరి ఓం పన్వర్, రష్మి ఆర్య, డా. సుధాన్సు సింగ్‌లను కూడా యుపి ప్రభుత్వం అవార్డులతో సత్కరించనుంది.

## గ్రామ సంప్రదాయం ప్రత్యేకమైంది

### ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, జనవరి 25 :**

దేశ సంప్రదాయాలలో భాగమైన భారతీయ కుటుంబ వ్యవస్థను పోలి ఉందంటూ, యుఎఇ 2026 సంవత్సరాన్ని కుటుంబ సంవత్సరంగా ప్రకటించడాన్ని ఆదివారం ప్రధానమంత్రి కొనియాడారు. తన నెలవారీ మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడుతూ, నివాసిత కుటుంబాలన్నింటికీ సామూహిక భోజనశాలను నడుపుతున్న ఒక గుజరాత్ గ్రామ చొరవను ప్రధాన మంత్రి గుర్తు చేసుకున్నారు. గుజరాత్‌లోని బేచారాజీలోని చందన్‌కీ గ్రామ సంప్రదాయం ప్రత్యేకమైంది. ఇక్కడ ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు ఇంట్లో వంట చేసుకోరని చెప్తే మీరు ఆశ్చర్యపోతారు. దీనికి కారణంగా, గ్రామంలోని అద్భుతమైన సామూహిక భోజనశాలే అని మోడీ అన్నారు. ఈ చొరవ ప్రజలను అనుసంధానం చేయడమే కాదు, కుటుంబ భావనను పెంచిపోషిస్తుందని అంటూ, భారతీయ కుటుంబ వ్యవస్థ అన్నది వారి సంప్రదాయంలో అంతర్గత భాగమని అన్నారు. అనేక దేశాలలో అటువంటి కుటుంబ వ్యవస్థలను అత్యంత గౌరవిస్తారు. కొద్ది రోజుల క్రితమే, నా సోదరుడు, యుఎఇ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నాహ్యాన్ భారత్‌లో పర్యటించిన విషయాన్ని ప్రధాని మోడీ గుర్తు చేసుకున్నారు.

యుఎఇ 2026ను కుటుంబ సంవత్సరంగా జరుపుకోనున్నట్టు అల్ నాహ్యాన్ మోడీకి చెప్పారు. ప్రజల మధ్య సామరస్యాన్ని, సమాజ స్ఫూర్తిని బలోపేతం చేయాలన్నది దీని లక్ష్యం, ఇది నిజంగా ప్రశంసనీయమైన చొరవ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

## రాహుల్‌లో అభద్రతా భావం అధికం

### మాజీ కాంగ్రెస్ నేత షకీల్ అహ్మద్



**పాట్నా, జనవరి 25 :**

భారత రాజకీయాలలో అత్యంత అభద్రతా భావం కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ అంటూ మాజీ కాంగ్రెస్ నాయకుడు షకీల్ అహ్మద్ శనివారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సీనియర్ పార్టీ నాయకుడిపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా , కేంద్ర మంత్రిగా వ్యవహరించిన అహ్మద్ గత నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయిన వెంటనే రాజీనామా చేశారు.

**పార్టీలో చీటలు**

ఒక ప్రైవేటు ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, నేడు అవమానపడకుండా పార్టీలో ఏ సీనియర్, అనుభవం కలిగిన కాంగ్రెస్ నాయకుడూ మనుగడ సాగించలేకపోతున్నారని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు తీవ్రమైన అవకతవకలకు పాల్పడ్డారని, ఈ విషయంపై నాయకత్వం ఎప్పుడైనా ఆత్మపరిశీలన చేసుకుంటుందా అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక నామమాత్రపు అధ్యక్షుడు, అన్ని నిర్ణయాలూ రాహుల్ గాంధీనే తీసుకుంటారని అన్నారు. ప్రముఖ, సీనియర్ నాయకులతో కలిసి పని చేయడంలో రాహుల్ ఇబ్బంది పడతాడు. తాను అక్కడ బాస్ కాదనిపిస్తే వెంటనే ఆ పరిస్థితి నుంచి దూరం జరుగుతాడని ఆరోపించారు.

**ఎస్ఐఆర్‌పై విమర్శ**

ఎస్ఐఆర్‌పై రాహుల్‌ను విమర్శిస్తూ, అతడు పూర్తిగా విఫలమయ్యాడని, ఆఖరికి ముస్లిం సమాజం కూడా అతడి ఆరోపణలను అంగీకరించలేదని అన్నారు. అనేకమంది సీనియర్ నాయకులకు ముస్లిం నాయకులతో, ముస్లింలతో కలిసి ఫోటో తీయించుకోవడానికి భయపడుతున్నారని, ఎందుకంటే, తమ హిందూ వోటు బ్యాంకును కోల్పోతామనే భయం వారిలో ఉందని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రాహుల్ చేపట్టిన ఉద్యమం అర్థం లేనిదని, ఎందుకంటే క్షేత్ర స్థాయిలో అది ఎటువంటి ప్రభావాన్ని చూపలేదని ఆయన అన్నారు. అహ్మద్ వ్యాఖ్యలకు తీవ్రంగా స్పందిస్తూ, ఆయన రాజ్యసభ టిక్కెట్టు ఆశిస్తున్నారని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని బీహార్ కాంగ్రెస్ అసిత్ నాథ్ తివారీ ఆరోపించారు. ఇటువంటి బ్లాక్‌మెయిలింగ్‌ను కాంగ్రెస్ ఎన్నటికీ సహించదని ఆయన నొక్కి చెప్పారు. మరోవైపు, రాహుల్‌పై తన వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ బండారాన్ని మరోసారి బయటపెట్టారని బీహార్ జెడి(యు) అధికార ప్రతినిధి అభిషేక్ ఝా అన్నారు. స్వంత పార్టీలో ప్రజాస్వామ్యాన్ని అనుసరించని రాహుల్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారు. ఖర్గేను రాహుల్ డమ్మీగా మార్చారు అని షకీల్ అహ్మద్ అంటున్నారు. ఏ కాంగ్రెస్ నాయకుడూ రాహుల్ గాంధీని గంభీరంగా తీసుకోరని బీజేపీ నాయకుడు ప్రదీప్ భండారీ అన్నారు.

## ప్రముఖ జర్నలిస్టు మార్క్ టుల్లీ మరణం



**న్యూఢిల్లీ, జనవరి 25:**

భారతీయ ఉపఖండంలో బిబిసికి చెందిన అతిపరిచితమైన స్వరంగా పరిగణించే ప్రముఖ జర్నలిస్టు, బ్రాడ్‌కాస్టర్ మార్క్ టుల్లీ, శనివారం నాడు మరణించారు. స్వల్పకాల అస్వస్థతకు లోనై మరణించిన టుల్లీ వయసు 90.సీనియర్ జర్నలిస్టు అనురాగ్ చతుర్వేది టుల్లీ అనారోగ్యంతో ఉండి, ఢిల్లీ ఆసుపత్రిలో చేరారని ఆయన పరిస్థితి గంభీరంగా ఉందంటూ ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆందోళన వ్యక్తం కావడం మొదలైంది. ఆయన మరణవార్త తెలిసినప్పటి నుంచీ దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకుల నివాళులు వెల్లువెత్తాయి. బ్రిటన్‌లో జన్మించిన మార్క్ టుల్లీ, భారత్‌లో స్థిరపడి, గత మూడు దశాబ్దాలుగా రాజకీయాలు, సమాజం, దేశంలో వస్తున్న పరివర్తనను నిర్వచించే చరిత్రకారుడిగా మారాడు. ఆయన బిబిసి న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా 20 ఏళ్లపాటు సేవలు అందించారు. 1994 జులైలో రాజీనామా సమర్పించే వరకూ ఆ ప్రసార కంపెనీలో 30 ఏళ్లు పని చేశారు. ప్రధాన రాజకీయ పరిణామాలు, క్షేత్ర స్థాయి వాస్తవాల చారిత్రాత్మక వార్తలను అందించడం ద్వారా, భారతీయ శ్రోతల విశ్వసనీయతను టుల్లీ చూరగొన్నారు. సామూహిక ప్రసారానికి ప్రధాన మాధ్యమంగా రేడియో ఉన్నప్పుడు, టెలిఫోన్ అనుసంధానత ఆధారపడదగినది కాకపోవడంతో, రికార్డు చేసిన నివేదికలను మాగ్నెటిక్ టేప్ ద్వారా భౌతికంగా రవాణా చేసిన కాలానికి సజీవ సాక్షిగా యునెస్కో కొరియర్ ఆయనను అభివర్ణించింది. ఒక శతాబ్దంలో పావు వంతుకాలంలో, భారత్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన, నమ్మదగిన రేడియో గొంతుకలలో ఒకరిగా మార్క్ టుల్లీ ప్రజావిశ్వాసాన్ని చూరగొన్నారని ఆ ప్రచురణ పేర్కొంది. కేవలం బ్రాడ్‌కాస్టింగే కాక, టుల్లీ తొమ్మిది పుస్తకాలు రచించిన ప్రసిద్ధ రచయిత. అందులో నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా అన్నది విస్తృతమైన ఆదరణను కలిగి ఉంది. పరిణామం చెందుతున్న భారత సామాజిక, రాజకీయ స్వరూపం గురించి చేసిన గొప్ప విశ్లేషణకు ఆయన ప్రశంసలను అందుకున్నారు. మార్క్ టుల్లీ మరణం జర్నలిజంలో ఒక శకానికి ముగింపు పలికింది. లోతైన విశ్లేషణ, విశ్వసనీయత, కథనాన్ని వివరించడంలో అచంచలమైన నిబద్ధతతో నిర్వచించిన శకానికి చెందిన వ్యక్తి ఆయన.




## భార్య కోసం.. 600 కి.మీ. రిక్షా తొక్కిన 70 ఏళ్ల వృద్ధుడు



కటిక పేదరికం వెంటాడుతోంది. వయసు సహకరించడం లేదు. మరోవైపు అనారోగ్యం బారిన పడ్డ భార్య. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. కానీ ఆమెను కాపాడుకోవాలనే సంకల్పం బలంగా ఉంది. ఇందుకోసం ఏకంగా 600 కిలోమీటర్లు రిక్షా తొక్కి భార్యకు చికిత్స అందించాడు 70 ఏళ్ల వృద్ధుడు. ఈ ఘటన ఒడిశాలో చోటుచేసుకుంది.

సంబల్‌పూర్‌కు చెందిన లోహార్ రిక్షా తొక్కుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య జ్యోతి గత ఏడాది అనారోగ్యం బారిన పడ్డారు. మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ప్రభుత్వ ఎస్‌సీబీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. అంబులెన్స్, ఇతర వాహనాల ద్వారా వెళ్లేందుకు డబ్బుల్లేవు. కానీ ఎలాగైన భార్యకు చికిత్స అందించాలని ముందడుగు వేశాడు. ఇందుకోసం భార్యను రిక్షాలో తీసుకొని బయలుదేరాడు. రోజుకు దాదాపు 30 కిలో మీటర్లు రిక్షా తొక్కుతూ తొమ్మిది రోజులకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆమెకు ఆసుపత్రిలో రెండునెలల పాటు చికిత్స అందించారు. అనంతరం.. మళ్లీ అదే రిక్షాలో ఇంటికి తిరుగు ప్రయాణం ప్రారంభించాడు. మార్గమధ్యంలో ఓ వాహనం రిక్షాను ఢీకొంది. ఆ సమయంలో జ్యోతి తలకు స్వల్ప గాయమైంది. ఆమెకు చికిత్స అందించి సాయంగా నిలుస్తామని స్థానిక పోలీసులు హామీ ఇచ్చిన లోహార్ సున్నితంగా తిరస్కరించాడు. తన సతీమణి, రిక్షాతో స్వస్థలానికి చేరుకున్నాడు. భార్య కోసం ఏకంగా 600 కిలో మీటర్లు రిక్షా తొక్కి తన ప్రేమను చాటుకున్నాడు లోహార్. వయసు శరీరానికే కానీ ప్రేమకు అడ్డుకాదని నిరూపించాడు. 'నాకంటూ ఉన్నది ఇద్దరే. ఒకరు నా భార్య, మరొకరిక్షా.'అని లోహార్ తెలిపారు.

## అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం

### ఇంటర్వ్యూలు 2027లోకి మార్పు!

భారతీయ వృత్తి నిపుణులకు అమెరికా ప్రయాణాల్లో మరింత జాప్యం చోటుచేసుకోనుంది. హెచ్1బీ (H1B visa) వీసాల స్టాంపింగ్ ఇంటర్వ్యూల అపాయింట్‌మెంట్లు 2027లోకి మారాయి. కొత్త ఇంటర్వ్యూల స్లాట్లకు కొరత ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వేలాది మంది వృత్తి నిపుణులు భారత్‌లోనే చిక్కుకుపోయే పరిస్థితి నెలకొంది. మరికొందరి ఉద్యోగాలు ప్రమాదంలో పడే పరిస్థితి తలెత్తింది. భారత్‌లోని అమెరికా కాన్సులేట్లలో బ్యాక్‌లాగ్‌లు భారీగా పెరిగిపోయాయి. ఫలితంగా వీసా స్టాంపింగ్ ఇంటర్వ్యూలు 2027లోకి మారాయి. వాస్తవానికి డిసెంబర్ 2025లో వీటిల్లో తొలిసారి జాప్యం చోటుచేసుకొంది. నాడు ఇంటర్వ్యూలను మార్చి 2026కు మార్చాల్సివచ్చింది. ఆ తర్వాత ఆ తేదీలు అక్టోబర్‌కు.. ఇప్పుడు 2027కు మారినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఢిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా కేంద్రాల్లో కొత్త ఇంటర్వ్యూ స్లాట్లు లేవు. దీంతో ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్లను అధికారులు 18 నెలలు తర్వాతకు మార్చాల్సి వచ్చింది. ఫలితంగా 2027 సంవత్సరం మధ్యలోకి అవి చేరాయి.



## ఆర్జేడీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్

రాష్ట్రీయ జనతాదళ్ ఆర్జేడీ పార్టీకి నూతన జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీ యాదవ్ నియమితులయ్యారు. ఆర్జేడీ కీలక సమావేశంలో పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ నియామకాన్ని ప్రకటించారు. పార్టీ అగ్రనేతల సమక్షంలో తేజస్వీకి నియామక లేఖను అందజేశారు. లాలూ కుటుంబంలో వివాదాలు చెలరేగుతున్న సమయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తేజస్వీని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల చిన్న కుమారుడైన తేజస్వీ పార్టీలో ముఖ్య నేతగా కొనసాగుతున్నారు. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ బిహార్‌లో అతిపెద్ద పార్టీగా అవతరించడంలో తేజస్వీ కీలక పాత్ర పోషించాడు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సేవలు అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో చురుకుగా పాల్గొన్నారు. రాఘోపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, భాజపా అభ్యర్థి సతీశ్ కుమార్‌పై 14,532 ఓట్ల తేడాతో నెగ్గారు.

## పూతకు వస్తున్న మామిడి తోటలు

# కిక్ మన వుదయం కెమెరా



**అందోల్ జనవరి 25 (వుదయం ప్రతినిధి )**

మామిడి తోటలు ఆలస్యంగా పూతకొస్తున్నాయి. జనవరి ఆఖరి వారానికల్లా పూర్తి స్థాయి పూత రావాల్సి ఉండగా 40 శాతం చెట్లే పూత పట్టాయి. నాలుగేళ్లు వరసగా నష్టాలు మూటగట్టుకున్న, సంగారెడ్డి, మెదక్ జిల్లాలో మామిడి రైతులు ఈ సీజన్‌పై ఆశలు పెంచుకున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు రైతులకు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయి. రోజుల తరబడి మబ్బులు పట్టి, పొగమంచు కమ్ముకుంటుండటంతో చీడపీడల దాడి ఉధృతమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో ఎక్కువ పూతతో కనిపించిన మామిడి చెట్లు పూత కిక్ మన వుదయం కెమెరా ఇలా చిక్కింది.గత ఏడాది తీవ్రంగా నష్టపరిచిన పండు ఈగ ఉనికి కలవరపెడుతోంది
.చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులు పిచికారి zస్తున్నారు.సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి పూతను సంరక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని తోట యాజమాన్యాలు తెలిపారు.

# గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

గణతంత్ర దినోత్సవానికి పోలీసు పెరేడ్ మైదానంలో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి, జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్,

**నాగర్ కర్నూల్ జనవరి 25(వుదయం ప్రతినిధి)**



జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో సోమవారం జరగనున్న గణతంత్ర దినోత్సవానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు .. అందరికీ అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ తెలిపారు. నాగర్కర్నూల్ పోలీస్ పెరేడ్ మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవానికి సంబంధించి ఉదయం 8.50 గంటలకు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఆగమనం, ఉదయం 8.55 గంటలకు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ బాదావత్ సంతోష్ ఆగమనం. అనంతరం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ సంతోష్ జాతీయ పతాకావిష్కరణ చేస్తారని... ఉదయం 9.10 గంటలకు పోలీసు కవాతు, 9.20 గంటలకు కలెక్టర్ సంతోష్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పథకాలపై ఆయా శాఖలకు సంబంధిందిచి గణతంత్ర దినోత్సవ సందేశం, 9.50 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మాన కార్యక్రమం, అనంతరం ఉదయం 10 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉదయం 10.30 గంటలకు శకటాల ప్రదర్శన, ఉదయం 10.45 గంటలకు స్టాల్స్ సందర్శన, ఉదయం 11 గంటలకు ఉత్తమ ఉద్యోగులు తదితరులకు ప్రశంసాపత్రాలు, అవార్డుల ప్రధానోత్సవం అనంతరం చివరగా ఉదయం 11.30 గంటలకు వందన సమర్పణ ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ తెలిపారు.

## 'భగీరథ' అధికారుల నిర్లక్ష్యంపై

# సర్పంచ్ అబ్దుల్ రషీద్ ఆగ్రహం

*గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ పైపు లీకేజీ ల కు అధికారుల పూర్తి బాధ్యత*

**ఊర్కొండ జనవరి 25(వుదయం ప్రతినిధి)**



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండమండల పరిధిలోని ఊర్కొండపేట గ్రామంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం గ్రామంలో పెద్ద గుంతలు ఏర్పడి అందులో నీళ్లు లీకేజీ అవుతుందని అధికారులు ఇప్పుడైనా స్పందించి పూర్తి లీకేజీలను బాగు చేయాలని గ్రామ సర్పంచ్ రషీద్ తెలిపారు , ప్రజల నీటి కష్టాలకు సంబంధిత అధికారులైన ఏఈ మరియు డిఈఈలే పూర్తి బాధ్యులని గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్ మండిపడ్డారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు ఊర్కొండపేటలోని కొన్ని వార్డు లో మిషన్ భగీరథ వాటర్ పూర్తిగా రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ లక్ష్యం ఇంటింటికీ నీరు అందించడమే. కొన్ని వార్డు లో చుక్క నీరు కూడా రావడం లేదని మిషన్ భగీరథ నీళ్లు రాని వాడల్లో మిషన్ భగీరథ నీళ్ళు అందించాలని ఆయన తెలిపారు .శుక్రవారం డిఈఈ గ్రామానికి వచ్చి ఒక వార్డు సమస్య కాదని,ఊర్కొండపేట గ్రామం మొత్తం నీటి సమస్య ఉందని అన్నారు.ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాంగ్రామ సర్పంచ్‌గా సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు మొండిగా వ్యవహరిస్తున్నారు.ప్రజల ప్రాథమిక అవసరమైన నీటి విషయంలో ఏఈ, డిఈఈలు నిర్లక్ష్యం వహించరాదని.వెంటనే ,గ్రామమంటా నీటి సరఫరాను అందించాలని.జిల్లా అధికారులకు
ఫిర్యాదు చేయడంతో పాటు,పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం అని అబ్దుల్ రషీద్ హెచ్చరించారు.

# డబ్బుకు కాదు.. అభివృద్ధికి ఓటు వేయండి

## మంథనిలో బీజేపీ ముందస్తు ప్రచారం

**మంథని, జనవరి 25 (వుదయం ప్రతినిధి )**



మంథని మున్సిపాలిటీలో ఎన్నికల సందడి అప్పుడే మొదలైంది. రానున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తమ ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు (శ్రీరామ్ నగర్) లో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి బోయిని నారాయణకు మద్దతుగా బీజేపీ పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో ముందస్తు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.అభివృద్ధి లక్ష్యంగా ప్రచారంఈ సందర్భంగా మంథని మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ కొండపాక సత్య ప్రకాష్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఒక శక్తివంతమైన ఆయుధమని, దానిని డబ్బుకు అమ్ముకోకుండా కేవలం అభివృద్ధిని చూసి మాత్రమే వేయాలని కోరారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న బోయిని నారాయణను గెలిపించుకోవడం ద్వారానే వార్డు సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వార్డులోని ప్రధాన సమస్యల పరిష్కారమే ధ్యేయం: మౌలిక సదుపాయాలు: రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి. ప్రజా సంక్షేమం: తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల మెరుగుదల. నిరంతర సేవ: స్వార్థం కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసే వ్యక్తిగా నారాయణకు మద్దతు.ఐదేళ్ల భవిష్యత్తు కోసం ఆలోచించండివార్డు భవిష్యత్తు ఓటర్ల చేతుల్లోనే ఉందని, ఒక్క రోజు లాభం కోసం చూసుకోకుండా ఐదేళ్ల పాటు సాగే నిరంతర అభివృద్ధిని కాంక్షించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బోయిని నారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బోగోజు శ్రీనివాస్, నారమళ్ళ కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు సామల అశోక్, ఎడ్ల సాగర్,
ఉద్నాల శ్రీనివాస్, దూడపాక రోజా తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై మార్పులు

**హైదరాబాద్, జనవరి 25 (వుదయం )**

మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి మహిళలు జీరో టికెట్ పొందేందుకు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డులు లాంటి ప్రభుత్వ గుర్తింపు ధృవీకరణ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు మహిళల ఆధార్ కార్డులను చెక్ చేసి కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. అయితే ఆధార్ కార్డుల్లో పాత ఫోటోలు ఉండటంతో మహిళలను గుర్తించడం కండక్టర్లకు కష్టతరంగా మారింది. దీంతో కండక్టర్లు, మహిళల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీనికి చెక్ పెట్టి మహిళలు సులభతరంగా బస్సుల్లో ప్రయాణించేందుకు కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మహిళలకు ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వనుంది. త్వరలో రాష్ట్రంలోని మహిళలందరికీ మహాలక్ష్మి ఐడీ కార్డ్లను పంపిణీ చేయనుంది. మహిళలు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం పొందేందుకు ఇవి ఒక ఐడీ కార్డులా ఉపయోగపడతాయి. ఈ కార్డులపై మహిళ ఫొటోతో పాటు పేరు, గ్రామం, మండలం, జిల్లా వంటి అడ్రస్ వివరాలు పొందుపర్చి ఉంటాయి. అలాగే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్తో పాటు అత్యాధునిక చిప్ ఉంటుంది. కండక్టర్ల వద్ద ఉండే మెషిన్ స్మార్ట్ కార్డులపై ఉండే చిప్పు స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. దీని వల్ల మహిళలు ఆధార్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. తమ దగ్గర ఆధార్ కార్డును క్యారీ చేయాల్సిన పని ఉండదు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా సులువుగా మహిళలు ప్రయాణం చేయవచ్చు. ప్రతీ ఒక్క వ్యక్తికి ఆధార్ ప్రత్యేక నెంబర్ ఉన్నట్లుగానే.. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతీ మహిళకు ఒక 16 అంకెల విశిష్ట నెంబర్ను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫొటో, అడ్రస్ వివరాలు ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల తయారీ ఇప్పటికే ప్రారంభమవ్వగా.. త్వరలో ముద్రణ పూర్తి కానుంది.

# రజక బాంధవులకు భరోసా

*రజక బాంధవులకు అండగా 'మండల సంఘం' పీర్లపల్లిలో బాధితులకు ఆర్థిక భరోసా*



**జగదేవపూర్, జనవరి 25 (వుదయం )**

కుల బాంధవుల కష్టమే తమ కష్టంగా భావిస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో జగదేవపూర్ మండల రజక సంఘం మరోసారి తన ఉదారతను చాటుకుంది. మండల పరిధిలోనిఆదివారం పీర్లపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ యాదగిరి ఇటీవల అకాల మరణం చెందగా, వారి కుటుంబాన్ని ఆదివారం సంఘం నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారూ మృతుడి కుటుంబ దీనస్థితిని చూసి చలించిన మండల రజక సంఘం అధ్యక్షుడు రాచకొండ సీతారాములు మరియు ప్రముఖ నాయకులు రాచమల్ల ఏల్లేష్, సంఘం తరపున 5000/- వేల రూపాయల తక్షణ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీతారాములు మాట్లాడుతూ మండలంలోని ఏ రజక బిడ్డకు కష్టం వచ్చినా తలవొంచి సాయం చేయడానికి మా సంఘం సిద్ధంగా ఉంటుంది. గత 4 సంవత్సరాలుగా జగదేవపూర్ మండలంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, రజకుల మధ్య విడదీయలేని ఐక్యతను నిర్మించాం" అని పేర్కొన్నారు. రాచమల్ల ఏల్లేష్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామంలోనూ రజక సంఘం బలోపేతం అవుతోందని, ఆపదలో ఉన్నవారికి వాలంటీర్లుగా మారి సేవలు అందిస్తున్నామని నాయకులు తెలిపారు. మీ అందరి బాసటగా" అనే నినాదంతో సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రజక సంఘం కీలక నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ బాల్ నరసయ్య, దూలిమెట్ట మల్లేష్, వడ్లకొండ యాదయ్యతో పాటు మరికొందరు సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా రథసప్తమి వేడుకలు

## కోమటి చెరువు రూబీ నెక్లెస్‌పై సామూహిక సూర్య నమస్కారాలు

**సిద్దిపేట జనవరి 25 (వుదయం )**



చల్లటి గాలులు, చిరుజల సవ్వడులు, లేలేత వెచ్చటి ఆదిత్య కిరణాల నడుమ ప్రపంచానికి ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య దేవునికి సామూహిక నమస్కారాలతో ఘన స్వాగతం పలికిన దృశ్యాలు సిద్దిపేట కోమటి చెరువు రూబీ నెక్లెస్ వద్ద కనువిందు చేశాయి. వ్యాస మహర్షి యోగ సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ప్రముఖ యోగా గురువు, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యులు తోట సతీష్, సంధ్యల నేతృత్వంలో ఆదిత్య హృదయ శ్లోకంతో కార్యక్రమం ప్రారంభమైంది. సూక్ష్మయోగ అనంతరం సూర్యుని స్తుతిస్తూ లయబద్ధంగా సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, మహిళలు, పెద్దలు, వాకర్లు సహా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రథసప్తమి వేడుకలకు శోభను చేకూర్చారు.భారతదేశం ప్రపంచానికి దిక్సూచిసామూహిక సూర్య నమస్కారాల అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు డా. ప్రణీత్ మాట్లాడుతూ యోగా అంతర్గత, బహిర్గత కాలుష్యాలను దూరం చేస్తుందని అన్నారు. యోగాను జీవితంలో భాగం చేసుకున్న వారు ఆరోగ్యంగా, ఉల్లాసంగా జీవిస్తారని తెలిపారు. ఇతర క్రీడల మాదిరిగా ఖరీదైన పరికరాలు అవసరం లేకుండా యోగాను ఎక్కడైనా సులభంగా సాధన చేయవచ్చని సూచించారు.వ్యాస మహర్షి యోగ సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు, శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు లక్షల సూర్య నమస్కారాలతో నిర్వహించిన ఉత్సవం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైందని పేర్కొన్నారు.సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగ విద్య నేడు ప్రపంచానికి దిక్సూచిగా మారిందన్నారు. సిద్దిపేట అన్ని రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్లే యోగా రంగంలోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి యువ క్రీడాకారులు ఎదుగుతున్నారని తెలిపారు. యోగ విద్య ద్వారా పొందిన ఆరోగ్యాన్ని ఇతరులకు అందించడం గొప్ప కానుకగా మారుతుందని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని ఎదుర్కోవాలంటే యోగ అత్యంత అవసరమని, కరోనా కాలంలో ఇది నిరూపితమైందని చెప్పారు.సంస్కార భారతి అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ యోగమున్నవారికే యోగ విద్య లభిస్తుందని, వారికి రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. సిద్దిపేట ఖ్యాతిని పెంచుతున్న యోగాసోసియేషన్‌లు, వ్యాస మహర్షి యోగ సొసైటీని ఆమె అభినందించారు.మున్సిపల్ కౌన్సిలర్ సాయి మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న ఒత్తిడులను జయించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యోగ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ చిప్ప ప్రభాకర్ మాట్లాడుతూ యోగ సాధన వల్ల తాను ఆరోగ్యంగా ఉండడమే కాక జాతీయ స్థాయిలో పోటీపడగలుగుతున్నానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొమరవెల్లి అంజయ్య, టి ఎన్ జి ఓ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు పట్నం భూపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, టి పి యు ఎస్ రాష్ట్ర బాధ్యులు శ్రీనాకర్ రెడ్డి, సంతోషి మాత దేవాలయం పూర్వ చైర్మన్ మంకాల నవీన్, పతంజలి యోగ సమితి చీఫ్ ప్యాట్రన్ అంజయ్య, యోగాసోసియేషన్ సభ్యులు బసవరాజు కుమార్, పల్లె సురేష్, స్వామి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్‌తో రైతు మృతి

**సిద్దిపేట జనవరి 25 (వుదయం )**



జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జామచెట్టు శ్రీనివాస్ రెడ్డి (వయస్సు సుమారు ...) వ్యవసాయ పనుల నిమిత్తం తన బావి వద్ద మోటర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికుల కథనం ప్రకారం, మోటర్ మరమ్మతుల కోసం ట్రాన్స్ఫార్మర్‌ను బంద్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. అయితే ట్రాన్స్ఫార్మర్‌పై ఉన్న ప్రధాన విద్యుత్ తీగ తెగి ఉండటంతో స్తంభానికి విద్యుత్ సరఫరా కొనసాగిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలియక శ్రీనివాస్ రెడ్డి స్తంభాన్ని తాకడంతో తీవ్రంగా విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న రాజగోపాల్‌పేట పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన గ్రామస్తులు, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బల్దియాలలో వేడెక్కిన రాజకీయం..!

- వార్డుల్లో ఆశావాహుల హడావిడి– ఇంటింటికి వెళ్తూ ముందస్తు ప్రచారం
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్న పార్టీలు– అన్ని పార్టీల్లోనూ భారీగా ఆశావాహులు

**కామారెడ్డి, జనవరి 25 (వుదయం):**




మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ వెలువడక ముందే పట్టణాల్లో రాజకీయాలు వేడెక్కాయి. రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావాహులు టికెట్ల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొందరైతే ఏకంగా వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్తూ ఓటర్ల మద్దతు కూడగట్టుకుంటున్నారు. పార్టీలు సైతం మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడం కోసం ఎత్తులు వేస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దాదాపు అన్ని పార్టీలోనూ ఆశావాహులు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులను ఎంపిక చేయడం ఆయా పార్టీల నేతలకు సవాలుగా మారనుంది. ఇప్పటికే తుది ఓటరు జాబితాను ప్రకటించారు. వార్డుల వారీగా రిజర్వేషన్లు సైతం ఖరారయ్యాయి. రేపో మాపో షెడ్యూల్ కూడా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మూడు ప్రధాన పార్టీలు అన్ని వార్డుల్లో అభ్యర్థులను దింపడానికి ఏర్పాటు చేస్తున్నాయి. కాగా ఆయా పార్టీల టికెట్టుపై పోటీ చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. మెజార్టీ స్థానాలు సాధించి బల్దియాలో తమ పార్టీ జెండా ఎగురవేయాలని భావిస్తున్న ఆయా పార్టీలు..గెలుపు గుర్రాల వేట మొదలుపెట్టాయి. ఆశావాహులు ఎక్కువగా ఉండడంతో ఆయా వార్డులో పట్టు ఎవరికి ఉంది, ప్రత్యర్థి పార్టీ నుంచి ఎవరు నిలబడతారు, వారిని ఢీకొట్టి గెలిచే సత్తా ఎవరికీ ఉందన్న దానిపై ముఖ్యనేతలు ఆరా తీస్తున్నారు. గెలుస్తారన్న అంచనాలు ఉన్న వారిని ప్రచారం చేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికే పలువురు ప్రచారం కూడా మొదలుపెట్టారు. పార్టీ టికెట్ తమకే వస్తుందన్న నమ్మకం ఉన్న పలువురు ఇంటింటికి తిరుగుతున్నారు.కామారెడ్డిలో బలంగా ప్రధాన పార్టీలు...కామారెడ్డి మున్సిపాలిటీపై మూడు ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ అన్ని వార్డులపై ఫోకస్ చేస్తుంది. ఆయా వార్డుల్లో టికెట్ ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఒక్కో వార్డు నుంచి ఇప్పటికే నలుగురు ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. ఎవరైతే గెలుస్తారు అన్న దాని గురించి ముఖ్యనేతలు ఆరా తీస్తున్నారు. ఇటీవల బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. వారికి తప్పకుండా టిక్కెట్లు ఇస్తారని తెలుస్తోంది. మరికొన్ని వార్డుల్లో బలమైన అభ్యర్థుల కోసం ఇతర పార్టీల నేతలకు గాలం వేస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గణనీయమైన స్థాయిలో ఓట్లు సాధించిన బిజెపి సైతం కామారెడ్డి మున్సిపల్ పై జెండా ఎగురవేయాలని ఉవ్విళ్లూరుతుంది. మునిసిపాలిటీని తన ఖాతాలో వేసుకోవడం కోసం ఆ పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది.ఎల్లారెడ్డిలోనూ తీవ్ర పోటీ:–ఎల్లారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం పోటీ నెలకొంది. గెలిచే వారికి టికెట్లు ఇస్తామని ముఖ్య నేతలు చెబుతున్నారు. మరోవైపు పట్టణంపై బిఆర్ఎస్ పార్టీకి పట్టు ఉంది. బల్దియా ఎన్నికలలో గెలిచి పట్టు నిలుపుకోవాలన్న లక్ష్యంతో ఆ పార్టీ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఎల్లారెడ్డి బల్దియా ఎన్నికలలో సత్తా చాటేందుకు బిజెపి సైతం వ్యూహాలు రచిస్తోంది.బాన్స్వాడలో...బాన్సువాడ పట్టణంలో రాజకీయం రసవత్తరంగా మారింది. గతంలో రెండు మినహా మిగతా స్థానాలన్నీ బి ఆర్ ఎస్ గెలుచుకుంది. అప్పుడు గెలిచిన వారిలో ఒకరిద్దరు మినహా ప్రస్తుతం అందరూ కాంగ్రెస్ గూటికి చేరారు. ఇక్కడ కాంగ్రెస్ లో రెండు గ్రూపులు ఉన్నాయి. దీనిని సొమ్ము చేసుకునేందుకు బి ఆర్ ఎస్ పావులు కదుపుతోంది. బిజెపి కూడా పోటీ ఇచ్చేందుకు సన్నద్ధం అవుతుంది.జుక్కల్ లో...కొత్తగా మున్సిపాలిటీగా ఆవిర్భవించిన బిచ్కుందలోను రాజకీయాలు వేడెక్కాయి. కొత్త బల్దియాపై పార్టీ జెండా ఎగురవేసేందుకు అధికార పార్టీ పావులు కదుపుతోంది. బీఆర్ఎస్ సైతం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బలమైన అభ్యర్థులను నిలపడం ద్వారా బల్దియాను కైవసం చేసుకోవాలని యోచిస్తుంది. అన్ని వార్డుల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు బిజెపి నాయకత్వం కసరత్తు చేస్తుంది.ముందస్తు ప్రచారం...నాలుగు మున్సిపాలిటీల్లో కొందరు ఇప్పటికే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ఇంటింటికి తిరుగుతూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. దీంతో ఆయా వార్డుల్లో రాజకీయం వేడెక్కింది. ఒకరి వెంట ఒకరు అన్నట్టు ఆశావాహులు ఇంటింటికి తిరుగుతున్నారు. కొందరు వాట్సప్ మెసేజ్ లు, మరికొందరు ఫోన్ కాల్స్ ద్వారా ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల వాతావరణమే కనిపిస్తుంది. టికెట్ రాకుంటే ఇండిపెండెంట్ గా బరిలో దిగేందుకు కూడా కొందరు రెడీ అయి ప్రచారం చేస్తున్నారు. కామారెడ్డిలో 49 వార్డులు, బిచ్కుందలో 12, బాన్స్వాడ లో 19 , ఎల్లారెడ్డిలో 12 వార్డులు ఉన్నాయి. కామారెడ్డిలో 152, ఎల్లారెడ్డిలో 24, బాన్సువాడలో 39, బిచ్కుందలో 24 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఈ ఎన్నికలను నిర్వహించనుంది.



# నాగులమ్మ దేవాలయ అధ్యక్షులుగా నాగరాజు నియామకం

**కోరుట్ల జనవరి 25 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల మండలంలోని నాగులపేట గ్రామంలో గల అతి పురాతనమైన స్వయంభు నాగులమ్మ దేవాలయ అధ్యక్షులుగా ఉప్పెరపెల్లి నాగరాజు కోశాధికారిగా కుంట రామకృష్ణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో దేవాలయ అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతిరెడ్డి గంగాజల భాస్కర్ రెడ్డి మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి ఉపసర్పంచ్ జక్కుల మల్లేశం నర్సారెడ్డి సాగర్ శేఖర్ రెడ్డి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ధర్మపురిలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

### ర్యాలీగా తరలివచ్చిన విద్యార్థులు



**ధర్మపురి,జనవరి 25**

**(వుదయం ప్రతినిధి):**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంత మైన ఆయుధమని, దేశ భవిష్య త్తును నిర్ణయించే బాధ్యత ఓటర్ల పైనే ఉందని ధర్మపురి తహశీల్దార్ ఎరుకొండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో భారీ అవగా హన కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం నుండి కమలాపూర్ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి, ఓటు ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు.ఓటు హక్కు విని యోగంపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థు లందరూ ఓటరు జాబితాలో చేరేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుం టున్నట్లు వెల్లడించారు.ఓటరు చైతన్య కార్యక్రమాల్లో భాగంగా మండలం లోని అన్ని గ్రామాల్లో బూత్ లెవల్ అధికా రులు వినూత్నం గా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఓటు వేయండి – దేశాన్ని కాపాడండి అనే సందేశాలతో కూడిన ముగ్గులు ప్రజలను ఆకట్టుకు న్నాయి.ఈ కార్య క్రమంలో నాయబ్ తహశీల్దార్ తిరుపతి, మండల గిర్దావర్ భాస్కర్ రావు, సీనియర్ అసిస్టెంట్ అనిల్, కార్యాలయ సిబ్బందితో, గ్రామ పాలనా అధికారులు,బి.ఎల్.ఓలు విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా

### ధర్మపురిని ఆధ్యాత్మిక హబ్‌గా తీర్చిదిద్దుతాంరు. 2.54 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి లక్ష్మణ్ కుమార్ శంకుస్థాపన

**ధర్మపురి, జనవరి 25**

**(వుదయం ప్రతినిధి):**

నన్ను ఒక సోదరుడిగా ఆశీర్వ దించి అసెంబ్లీకి పంపిన ధర్మపురి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని,నియో జకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తా అని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ఆదివారం ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 2.54 కోట్ల వ్యయంతో చేపట్టను న్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ సంక్షేమం,అభి వృద్దే లక్ష్యం గా పట్టణ అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధులు రూ. 50 లక్షలు, ఎస్డిఎఫ్ నిధుల నుంచి రూ. 2.04 కోట్లు వెచ్చిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గెలిచినా ఓడినా నేను ప్రజల మధ్యే ఉంటాను. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన నైట్ కాలేజీని తిరిగి ప్రారంభిం చాం.ధర్మపురిని రెవెన్యూ డివిజన్‌గా మార్చడమే కాకుండా,త్వర లోనే బస్సు డిపోను కూడా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.2027లో రానున్న గోదావరి పుష్కరాల కోసం ఆరు నెలల ముందే పనులు పూర్తయ్యేలా ప్రణాళి కలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వెల్లడిం చారు. ధర్మపురిని ఒక అందమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి స్థానిక ప్రజలు, మేధావుల సలహాలు తీసుకుం టామని పేర్కొన్నారు.షాదీ ఖానా,ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఆర్య వైశ్య భవనం, పద్మశాలి, మున్నూరు కాపు, బ్రాహ్మణ కర్మ భవనం సహా పలు కుల సంఘాల భవనాలకు భూమి పూజ చేశారు.పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ భవనం కోసం రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని మంత్రి



హామీ ఇచ్చారు. చింతామ ణి చెరువు కట్టపై నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను, హైమాస్ స్ట్రీట్ లైటింగ్‌ను మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ నాయకులు సంఘనబట్ల. దినేష్, వేముల.రాజేష్ ,ఎఎంసి వైస్ ఛైర్మన్ సంగ. నరసింహులు, చిలుముల లక్ష్మణ్, ఇందారపు రామన్న,మాజీ మున్సిపల్ ఛైర్మన్ సంగి.సత్తెమ్మ, సంగనభట్ల.సంతోషి,వేముల నాగలక్ష్మి ,జక్కు పద్మ,గరిగే. అరుణ, ఓజ్జాల.సౌజన్య అయ్యోరి వేణు,ఎండి షబ్బీర్,ఎస్డి యూనిస్,సయ్యద్ అలీమ్, ఎండి. రఫియొద్దీన్,సొల్ల. భీమయ్య, సింహారాజు.ప్రసాద్,జె.సుముఖ్,చిపిరిశెట్టి.రాజేష్ ,ఆ శాఖల అధికారులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారులకు వాలీబాల్ కిట్

### అందజేసిన యువ నాయకులు పొట్ల శ్రీకాంత్

**మంథని, జనవరి 25**

**వుదయం ప్రతినిధి**

మండలానికి చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు పొట్ల శ్రీకాంత్ వాలీబాల్ క్రీడాకారులకు కిట్ అందజేశారు. ఆదివారం మంథని మండలం ఆరెంద గ్రామ క్రీడాకారులకు మల్లారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ యువ నాయకులు పొట్ల శ్రీకాంత్ క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. క్రీడా నైపుణ్యంతో ప్రతి ఒక్కరు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. యువత అనుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆశించారు. ఈ కార్యక్రమంలో ఆరెంద గ్రామ యువజన నాయకులు గాడేపు కిరణ్, పొట్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 'వార్షిక డీ-మొబిలైజేషన్ పరేడ్'

### ముఖ్య అతిథిగా హాజరైన సిపి గౌష్ ఆలం

**.కరీంనగర్, జనవరి 25 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ పరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించిన వార్షిక డీ–మొబిలైజేషన్ పరేడ్ కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపిఎస్ ముఖ్య అతిథిగా హాజరై, సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించి పరేడ్‌ను పర్యవేక్షించారు. అనంతరం పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి పోలీసు కమిషనర్ ప్రసంగిస్తూ ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ అన్యువల్ మొబిలైజేషన్ కార్యక్రమం ద్వారా సిబ్బందికి వృత్తిపరమైన శిక్షణను పునరుద్ధరించడం జరుగుతుందని తెలిపారు.బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత, ఇలాంటి వార్షిక శిక్షణా తరగతులు పోలీసుల్లో మరింత నైపుణ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని, దీనివల్ల ప్రజలకు మరింత సమర్థవం




తంగా సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. గత నాలుగు వారాలుగా జరిగిన ఈ శిక్షణా కాలంలో సిబ్బందికి క్షేత్రస్థాయి విధులకు సంబంధించిన పలు కీలక అంశాలపై తర్ఫీదు ఇచ్చారన్నారు. వివిధ రకాల తుపాకుల వినియోగం మరియు మెయింటెనెన్స్‌పై ప్రత్యేక శిక్షణ, ఖైదీలను కోర్టులకు లేదా ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లే సమయంలో పాటించాల్సిన భద్రతా నియమాలు, భద్రతా గార్డుగా మరియు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ గా నిర్వహించాల్సిన బాధ్యతలు, అత్యవసర సమయాల్లో గురి తప్పకుండా ఫైరింగ్ చేసే విధానంపై ప్రాక్టికల్ శిక్షణ అందించమన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అధికారులు మరియు సిబ్బందిని సిపి ప్రత్యేకంగా అభినందించారు. క్రమశిక్షణతో కూడిన ఇటువంటి శిక్షణలు పోలీసు వ్యవస్థ పటిష్టతకు దోహదపడతాయని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఆర్.ఐ. పరిపాలన రజినీకాంత్ కమిషనరేట్ పరిధిలోని పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య ఆయుధం ఓటు

# చైతన్యంతోనే దేశ భవిష్యత్తు

### సిద్దిపేటలో విద్యార్థుల భారీ ర్యాలీ పిలుపునిచ్చిన జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి



**సిద్దిపేట, జనవరి 25**

**(వుదయం ప్రతినిధి**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటరేనని 'మేరా యువ భారత్' జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మై భారత్ కేంద్రం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో కలిసి సిద్దిపేటలో భారీ చైతన్య ర్యాలీని నిర్వహించారు. స్థానిక ముస్తాబాద్ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ బాలుర ఉన్నత పాఠశాల వరకు ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పే నినాదాలతో పట్టణాన్ని చైతన్యపరిచారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు వెంటనే తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. సరైన నాయకుడిని ఎంచుకోవడంలోనే సమాజ హితం దాగి ఉందని ఆయన పేర్కొన్నారు.జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఓటు విలువపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు

. ప్రజాస్వామ్య పండుగలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కళాశాల వసతిగృహ వార్డెన్లు శ్రీనివాస్, సత్యం, టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, యువజన ప్రతినిధులు రాజు,

శ్రీనివాస్ తదితరులు పాల్గొని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.

# టెడ్ టాక్ స్పీచ్ పోటీల్లో మగ్గిడి విద్యార్థిని ప్రతిభ

### రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన చైత్ర



**ధర్మపురి,జనవరి 25**

**(వుదయం ప్రతినిధి):**

మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల విద్యార్థిని హైదరా బాద్‌లోని అనురాగ్ యూని వర్సిటీ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి టెడ్ టాక్ స్పీచ్ పోటీల్లో మగ్గిడి మోడల్ స్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని చైత్ర అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.రూ.నిర్వాహకులు రూ. 10,000 నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరైన ఈ పోటీలో చైత్ర విజేతగా నిలవడం విశేషం.గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్,అధ్యాపక బృందం,గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం పట్ల స్థానికులు,తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బడ్జెట్ దారి మళ్లిస్తున్నారు

**సిద్దిపేట, జనవరి 25**
**(వుదయం ప్రతినిధి)**

> *ప్రైవేట్ సంఘాలకు మిగులు బడ్జెట్ ఎందుకు*
> *ప్రారంభం కాని పనులకు మిగులు బడ్జెట్ కేటాయింపు ఎలా..?*
> *మైనారిటీ, దళితులపై చిన్నచూపు ఎందుకు...*
> *కాంగ్రెస్ నాయకులు మహేందర్, సాకి ఆనంద్, రియాజ్*

సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దారి మళ్లుతున్నాయని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయకులు అలకుంట మహేందర్, సాకి ఆనంద్, కౌన్సిలర్ రియాజుద్దీన్ లు ఆరోపించారు. ఆదివారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యకుడు అత్తూ ఇమామ్ తో కలిసి మాట్లాడుతూ సిద్దిపేట మున్సిపాలిటీ లో ఇష్టరీతిగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. పట్టణం లోని రెడ్డి సంక్షేమ సంఘంలో ఇప్పటికే ఫంక్షన్ లు చేయడం స్టార్ట్ అయ్యాయని కాని మున్సిపాలిటీ నుండి రూ 10 లక్షలు మిగులు బడ్జెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అలాగే పట్టణంలోని 12 వార్డులో వ్యవసాయ క్షేత్రానికి రోడ్లు వేసుకోవడం సిగ్గు చేటన్నారు. కాలనిలో కొన్ని చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సొంత పొలానికి రోడ్లు వేయించుక్కవడం ప్రజల టాక్స్ ను దుర్వినియోగం చేయడమే అన్నారు. ఇప్పటికే మున్సిపల్ కి కోటి రూపాయల కరెంటు బిల్లు పెండింగ్ లో ఉందని. మున్సిపల్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కయ్ ఆడుతున్నా నాటకాలని ఆరోపించారు.కోట్ల రూపాయలను పక్కదారి మళ్లిస్తున్నారన్నారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ను వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు సాకి ఆనంద్ మాట్లాడుతూ మున్సిపల్ లో జెనరల్ ఫండ్ అనేది 43 వార్డుల్లో అభివృద్ధి పనులకు కేటీయించాలి... కాని గుళ్లకు. సంఘాలకు, మస్జీద్ లకు మేము వ్యతిరేకం కాదు కాని ఉద్దేశ్యం పూర్వకంగా కొన్ని సంఘాలకు నిధులు కేటీయించడం దారుణం అన్నారు. కుషాల్ నగర్ లో మాల స్మశానం వాటికకు ఒక్క రూపాయి నిధులు కేటీయించలేదని మండిపడ్డారు.. బీసీ, ఎస్సి ఎస్టీ ల గురించి ఆలోచన చేయడం లేదని మున్సిపల్ బడ్జెట్ అసలు కులం సంఘాలకు వాడకూడదన్నారు.




ఎజెండా లో అంశాలు పెడుతూ ఎవరికి అర్థం కాకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. . ఇలాంటి విషయాలపై కమిషనర్ కూడా వత్తాసు పలుకడం దారుణం అన్నారు. 43 వార్డు ప్రజల టాక్స్ అభివృద్ధి కి వాడాలి కాని సంఘాలకు వాడడం రాజ్యాంగ విరుద్ధం ఇది మీ జాగిరు కాదని స్పష్టం చేశారు. 20 వ వార్డు కౌన్సిలర్ రియాజ్ మాట్లాడుతూ దళితులు, మైనార్టీ లు అంటే మున్సిపాలి వారిఓయ్ అంత చులకన అని ప్రశ్నించారు..నిధులన్నీ కోమటి చెరువుకు కేటాయిస్తూ మిగతా వాటిని విస్మరించడం తాగదన్నారు. గత ప్రభుత్వ హయాంలోమదీనా ఫంక్షన్ హాల్ కు 25 లక్షలు ఇస్తా మంజూరు చేస్తామని కేవలం 10 ఇచ్చిచేతులు దులుపుకున్నారు. సిద్దిపేట లో కోమటి చెరువు తప్ప మిగతా అభివృద్ధి కనిపించడం లేదని. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సిద్దిపేట మైనారిటీ ల జనాభా ఎక్కువగా ఉందని ఇక్కడి యువత కోచింగ్ ల పేరిట హైదరాబాద్ కు వెళ్లకుండా ఇక్కడే మైనారిటీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చెస్తానని తెలిపిన హరీష్ రావు ఇచ్చినం వాగ్దాణం ఏమి చేశారాని ప్రశ్నించారు. మైనారిటీ లు దళితులు అంటే చిన్నచూపు చూస్తున్నారని మండి పడ్డారు. పట్టణం లోని కొన్ని వార్డులకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నారని వారికి అనుకూలం అయినా వార్డులకి మాత్రమే నిధులు కేటాయియించడం దారుణం అన్నారు.. మిగతా వార్డులపై ఎందుకంత వివక్ష అన్నారు.

## టిటిడి వాణిజ్య సముదాయానికి భూమి పూజ

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు



**కోరుట్ల జనవరి 25**

**(వుదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణ అయిలాపూర్ రోడ్డు లో గల టీటీడీ కల్యాణ మండపం అనుబంధంగా నిర్మించబోయే 38 లక్షలతో నిర్మించబోయే బానిస సముదాయానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఆదివారం భూమి పూజ చేశారు ప్రత్యేక అభివృద్ధి పథకం ద్వారా 38 లక్షల రూపాయల నిధులు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు సిఫారసు మేరకు మంజూరు కాగా ఇట్టి నిధుల ద్వారా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమంలో కోరుట్ల వెంకటేశ్వర దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య మాజీ చైర్మన్ పుప్పాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు

# విశిష్ట గౌరవం

### ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి రాష్ట్ర స్థాయి అవార్డు




**కరీంనగర్, జనవరి 25,**
**(వుదయం ప్రతినిధి):**

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి వేడుకల్లో కరీంనగర్ జిల్లాకు మరో విశిష్ట గౌరవం దక్కింది. ఎన్నికల నిర్వహణలో, వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, సామర్థ్యాభివృద్ధి రంగంలో చేసిన ఉత్తమ కృషికి గాను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు.హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ దిశా నిర్దేశంలో ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టడం ఈ అవార్డుకు ప్రధాన కారణంగా నిలిచాయి.అలాగే, వినూత్న ఓటర్ల అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం విశేషంగా కృషి చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, "జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు, సిబ్బంది అందరి సమష్టి కృషి వల్లే ఈ అవార్డు సాధ్యమైంది" అని తెలిపారు.ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ప్రతి ఒక్క అధికారికి అభినందనలు తెలిపారు. ఈ అవార్డు జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సుశిక్షిత సిబ్బందితో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని అధికారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# జాతీయ ఓటర్ దినోత్సవంలో సిద్దిపేటకు ఘనత

### ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారి అవార్డు స్వీకరించిన కలెక్టర్ హైమావతి







**సిద్దిపేట 25, (వుదయం ప్రతినిధి):**

:హైదరాబాదులోని రవీంద్రభారతిలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అధికారులకు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ సేవలందించిన అధికారులకు పురస్కారాలు అందజేశారు.ఈ సందర్భంగా ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా సిద్దిపేట జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి అవార్డును స్వీకరించారు. జిల్లాలో స్వచ్ఛమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణతో పాటు ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ గౌరవం లభించింది.అలాగే దుబ్బాక శాసనసభ నియోజకవర్గానికి ఉత్తమ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గరీమ అగ్రవాల్‌కు అవార్డు దక్కింది ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, సమర్థంగా నిర్వహించినందుకు ఆమెను ఎన్నికల సంఘం ప్రత్యేకంగా అభినందించింది.ఉత్తమ బూత్ లెవల్ ఆఫీసర్ ( బి ఎల్ ఓ ) గా బి. పుష్పలత అవార్డును అందుకున్నారు ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు అవగాహన కార్యక్రమాల్లో ఆమె చేసిన సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేశారు.ఈ అవార్డులు సిద్దిపేట జిల్లాకు మరింత ప్రతిష్ట తీసుకువచ్చాయని పలువురు ప్రశంసించారు. ఎన్నికల విధుల్లో అంకితభావంతో పనిచేసిన అధికారులకు లభించిన ఈ గుర్తింపు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.




## చర్లలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**చర్ల 25 (వుదయం ప్రతినిధి):**

భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం చర్లలోని ప్రజాభవన్‌లో చీమలమర్రి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యల పరిష్కానికి కృషి చేస్తూ ప్రజాభిమానాన్ని పొందుతున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి మరింత దూకుడుగా పనిచేస్తామన్నారు.

## దావ వసంత కు బ్రహ్మోత్సవాల

# ఆహ్వాన పత్రిక అందజేత



**జగిత్యాల జనవరి 25**
**(వుదయం ప్రతినిధి)**

జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 42వ బ్రహ్మోత్సవాల జాతరకు విచ్చేయవలసిందిగా కోరుతూ జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ లకు ఆహ్వాన పత్రికను అందజేసిన తాటిపెల్లి సర్పంచ్ జిల్లా సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు

బొలిశెట్టి గంగారెడ్డి అనంతరం జిల్లా సర్పంచుల పూర్వ అధ్యక్షులుగా ఎన్నికైన బొలిశెట్టి గంగారెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ కార్యక్రమంలో మోహన్ గోపి గణేష్ తదితరులు పాల్గొన్నారు



# గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

**అశ్వరావుపేట, జనవరి 25 (వుదయం ):**
అశ్వారావుపేట మండలం ఉసిర్లగూడెం గ్రామంలో చిన్ని వెంకన్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అనంతరం అదేగ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఎం, హరికృష్ణ ను వగ్గెల దుర్గారావు ను పరామర్శించి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు , సర్పంచ్ వగ్గెల లక్ష్మణ్ రావు , ఉపసర్పంచ్ వీర్నాల శ్రీనివాసరావు , ఉప్పల రాజశేఖర్ , వగ్గెల అర్జున్ , ఆలా మహేశ్వరరావు , శ్రీనివాసరావు రామకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్

**దమ్మపేట, జనవరి 25 (వుదయం ):**
నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై ఉద్యోగ ఉపాధి భద్రతకై మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాల ఐక్య పిలుపులో భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. ఆదివారం దమ్మపేటలో వ్యాపార సముదాయాలకు పెట్రోల్ బంకులలో యాజమాన్యాలకు సమ్మె విజయవంతంకై సమ్మె నోటీసులు విస్తృతంగా ఇస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ కార్మిక వర్గం తమ సమస్యలపై పని దినాల కోసం సక్రమమైన పని పరిస్థితులు వేతనాల కోసం దుర్భర పరిస్థితులను తొలగించి కనీస హక్కుల కోసం ఆనాటి కార్మిక వర్గం అనేక త్యాగాలతో కార్మిక హక్కులు చట్టాలు సాధిస్తే బిజెపి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే దానికోసం లేబర్ కోడ్ లు తెచ్చిందని అన్నారు. ప్రస్తుత లేబర్ కోడ్ లు అమల్లోకి వస్తున్న తరుణంలో సమస్త కార్మిక వర్గం ఐక్యంగా ప్రతిఘటిస్తేనే నిరంకుశ పాలకులు వెనకడుగు వేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ కోటేశ్వరరావు, ధర్మ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ బద్రావతి భావనారుషి స్వామివార్ల కళ్యాణ మహోత్సవం



- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐరా రియాలిటీ పోషం. వీరారెడ్డి

**మేళ్లచెరువు/ హుజూర్నగర్, జనవరి 25 (వుదయం ):**
సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో శ్రీ ఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ప్రాంగణంలో ఉన్నటువంటి శ్రీ భద్రావతి భావనా ఋషి స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాలు నడుమ కొంకపాక శివ విష్ణువర్ధన శర్మ, కొంకపాక ధనుంజయ శర్మ, సుదర్శన మోహన కృష్ణమాచార్యుల బ్రాహ్మణోత్తమలచే ఘనంగా నిర్వహించడం జరిగింది. తెల్లవారుజామునే పుణ్యావచనం, అభిషేకం స్వామివారికి కళ్యాణాన్ని మండల పద్మశాలి కమిటీ, గ్రామ పద్మశాలి కమిటీ,దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఐరా రియాలిటీ పోషం వీరారెడ్డి మేళ్లచెరువు సర్పంచ్ బచ్చు. పద్మావతి శ్రీనివాసరెడ్డి శివాలయ కార్యనిర్వహణ అధికారి నాగేల్ల. శంబిరెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ అధ్యక్షులు కమర్థపు. మురళి, చెనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు. వీర మోహన్, దేవాలయ కమిటీ చైర్మన్ సామిలేటి. రంగారావు, మట్టపల్లి అన్నదాన సత్ర అధ్యక్షులు చిన్నం.వీరమల్లు, గోనె.చిన్న అంకయ్య, పాగాల రామ్మోహన్రావు,గోలి. శ్రీనివాసరావు, గోలి. నాగరాజు అధిక సంఖ్యలో పద్మశాలి కుల బాంధవులు గ్రామపెద్దలు ప్రజలు, పాల్గొన్నారు.

# జనం మెచ్చిన వారికే టికెట్లు...!

- పైరవీలకు తావులేదు.. వారసత్వానికి చోటులేదు-
- ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది-
- శివరాత్రి లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి!
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి*



**ఖమ్మం ,నవరి 25 (వుదయం):**
మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది.. మనమంతా సిద్ధం కావాలి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం. పైరవీలకు ఇక్కడ తావులేదు. జనం కోరుకునే వ్యక్తికే బిఫామ్ అందుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల నుంచి తరలివచ్చిన పార్టీ ఇంచార్జీలు, ముఖ్య నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. సర్వేల ఆధారంగానే ఎంపికటికెట్ల కేటాయింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. "వారసత్వ రాజకీయాలకు నా వద్ద చోటు లేదు. నా రక్తసంబంధీకులకు ఎవరికీ టికెట్లు ఇవ్వను. ఇప్పటికే రెండు మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నాం. ప్రజలు ఎవరినైతే ఆదరిస్తారో, ఎవరికైతే గెలిచే సత్తా ఉందో వారికే అవకాశం దక్కుతుంది. ఓటర్ల మనసు గెలుచుకున్న వారే అభ్యర్థులుగా బరిలోకి దిగుతారు" అని పేర్కొన్నారు.రెచ్చగొడితే మోసపోవద్దు పార్టీలో టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అసంతృప్తితో ఇతర పార్టీల వైపు చూడవద్దని మంత్రి సూచించారు. "అధికారంలో ఉన్నాం కాబట్టి అందరికీ ఏదో ఒక రూపంలో సముచిత స్థానం కల్పిస్తాం. కొందరిని కోఆప్షన్ సభ్యులుగా, మరికొందరికి నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవిస్తాం. పార్టీని కాదని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని ఎవరైనా రెచ్చగొడితే మోసపోవద్దు. అటువంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది" అని హెచ్చరించారు.మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యంఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చడమే తన లక్ష్యమని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్, ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.కార్యకర్తలే నా బలం"మీరు నా కళ్ళు, చెవుల వంటి వారు. మీ కష్టమే నాకు గౌరవం. నేను ఎప్పుడూ కార్యకర్తలను విస్మరించను. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండే వారికే నా మద్దతు ఉంటుంది" అని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. అనంతరం ఒక్కో వార్డు నాయకులతో ఆయన ముఖాముఖి చర్చించి, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.



# ఐటీడీఏ గిరిజన దర్బార్ రద్దు

**జనవరి /25 వుదయం భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో జరిగే గిరిజన దర్బార్ రద్దు చేసినట్లు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఐ టి డి ఏ కార్యాలయంలో 77వ గణతంత్ర వేడుకలు ఉన్నందున ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండని కారణంగా గిరిజన దర్బార్ రద్దు చేయడం జరిగిందని, గిరిజనులు ఇట్టి విషయాన్ని గమనించి అర్జీలు సమర్పించడానికి భద్రాచలం లోని ఐటీడీఏ కార్యాలయంకు రావొద్దని ఆయన తెలిపారు.అదనపు పౌర సంబంధాల అధికారి కార్యాలయము భద్రాచలం నుండి జారీ చేయడమైనది

# పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**కర గూడెం, జనవరి25/వుదయం:**
కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు ముఖ్య కార్యకర్తలకు మరియు బూత్ , గ్రామ కమిటీ అధ్యక్షులకు, సర్పంచ్ ఉప సర్పంచులకు గ్రామ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా సోమవారం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఉదయం 9:00గంటలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం కలదు కావున ఈ యొక్క కార్యక్రమానికి అందరూ హాజరు కావాల్సిందిగా కోరుతున్నాముఇట్లు మీసయ్యద్ ఇక్బాల్ హుస్సేన్కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు..

# మతం వేరు, మతోన్మాదం వేరు

## మతం మణి మాణిక్యాల బురదతట్ట: జైభారత్



**భద్రాచలం,జనవరి 25/వుదయం :**
భద్రాచలంలోని బ్రహ్మం కళ్యాణ మండపంలో జై హో ఆధ్వర్యంలో హిందూ ముస్లిం ఐక్యత సభ జరిగింది. ఈ సందర్భంగా జైభారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి గుండు వెంకన్న, జైభారత్ బీసీ పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి వెలిమిశెట్టి వీరన్న మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబర్ 19 నుండి జనవరి 30 వరకు హిందూ ముస్లిం ఐక్యత సభలు జైభారత్, జై హో ఆధ్వర్యంలో మహనీయులు కలలుగన్న మతసామరస్యం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వేదాంత మేధస్సు ఇస్లాం శరీరంతో కూడిన విభవోజ్వల భారత్ ప్రభవించాలని స్వామి వివేకానంద కలలుగంటే, నేడు మతం పేరిట మతోన్మాదులు విభజన రేఖ గీసి మతతత్వాన్ని రేపుతున్నారని ఇది భారతదేశానికి ప్రమాదకరమని అన్నారు. అన్ని మతాలు గొప్ప విలువలను ప్రబోధించాయని ఆ విలువలను ఎత్తి పట్టుకొని, అన్ని మతాలలో ఉన్న అసమానతలను వదిలిపెట్టాలని పిలుపునిచ్చారు. మతం వేరు మతోన్మాదం వేరు అని, మతం మణి మాణిక్యాల బురద తట్ట అని జైభారత్ స్పష్టం చేస్తుందని తెలిపారు. హిందూ ముస్లిం సమైక్యతే శ్వాసగా తపించి జీవితాన్ని ధారపోసి మతోన్మాదుల హంతక దాడిలో అమరుడైన గాంధీజీ, హిందూ ముస్లిం ఐక్యత కోసం చివరికంటా నిలబడ్డ అశ్ఫాక్, బిస్మిల్, ఉద్ధం సింగ్, స్వామివివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ లాంటి యోధులను స్మరించుకుంటూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న జైభారత్ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ భాను ప్రసాద్ ఐక్యత ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో జైభారత్ sc పోరాట వేదిక ap రాష్ట్ర అధ్యక్షులు రాంప్రసాద్, జైహో భద్రాచల నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు అలవాల రాజా పెరియార్, డాక్టర్ భాను ప్రసాద్, యువతరం పార్టీ ఏపీ అధ్యక్షులు బానోత్ బాబు నాయక్, సూర్యకాంతం, సయ్యద్ అలీ, సయ్యద్ అబ్దుల్ సుకుర్, జానీ పాష, కన్నయ్య, శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

# ఢిల్లీ గణతంత్ర పరేడ్‌లో పింగిళి కళాశాల ఎన్ సి సి క్యాండేట్స్!

- లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి



**హనుమకొండ , జనవరి 25 (వుదయం ) :**
దేశ రాజధాని ఢిల్లీ లో నిర్వహించనున్న 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్-2026 లో పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్.సి.సి. క్యాడెట్లు పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు.ఢిల్లీలో సోమవారం రోజున జరగనున్న రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన ముగ్గురు ఎన్.సి.సి క్యాడెట్లు గత నెల రోజులుగా ఢిల్లీలో ఆర్మీ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, 8 వ గర్ల్స్ తెలంగాణ బెటాలియన్ నుండి మొత్తం నలుగురు ఎన్.సి.సి. క్యాడెట్లు ఎంపిక కాగా, అందులో ముగ్గురు క్యాడెట్లు పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన వారే కావడం కళాశాలకు గర్వకారణం అని పేర్కొన్నారు.ఢిల్లీలో జరిగే పరేడ్‌లో పాల్గొననున్న క్యాడెట్ల జి. వెంకటలక్ష్మి బి.ఎస్‌సి. ఎంపీ.సీస్ ఫైనల్ ఇయర్,సార్జెంట్ బి. త్రిష బి.ఎస్‌సి. బి.జెడ్.సి ఫైనల్ ఇయర్, క్యాడెట్ ఏ. భార్గవి బి.ఎస్‌సి. ఎంపీ. సీస్ ద్వితీయ సంవత్సరం.క్యాడెట్స్ లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్.సి.సి. కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఒకే కళాశాల నుండి ముగ్గురు యన్.సీ.సీ. క్యాడెట్లు రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక కావడం పింగిళి కళాశాల కు గర్వకారణమని, ఈవిదంగాఎక్కడ జరిగి ఉండక పోవచ్చని, కళాశాల చరిత్రలో ఇది ఒక శుభదినమని తెలిపినాడు. క్యాడేట్స్ లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు,ఆత్మవిశ్వాసం,ప్రణాళికబద్ధమైన కృషి, శిక్షణ వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా ఎన్.సి.సి. ఆఫీసర్ డా. సువర్ణ, మొదటి నుండి క్యాడేట్స్ కు మార్గదర్శనం చేసినారు. డాక్టర్ సువర్ణను,క్యాడేట్స్ ను అభినందించినవారిలోవైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని,ఐ.క్యూ.ఏ.సి. కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు,అకాడమిక్ కోఆర్డినేటర్ ఎం. అరుణ,డా, రేణుక, రామకృష్ణ రెడ్డి, శ్రీనివాస్, సుజాత,ఇతర అధ్యాపకులు, ఎన్.సి.సి. క్యాడెట్లు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన రామాపురం రైతులు



**బూర్గంపాడు,జనవరి/25 వుదయం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం. ముసలమడుగు. గ్రామ పంచాయతీ.రామపురం. గ్రామంలో. రైతులు. సాగు. చేస్తున్న.భూములకు కరెంటు. సౌకర్యం. లేక ఎన్నో ఏళ్లగా. ఇబ్బంది. పడుతూపంటలు పండక నానా అవస్థలు పడ్డాము అని అప్పుల పాలు అయ్యామని అప్పులు తీరక ఇంతకాలం నానా అవస్థలు పడ్డామని అన్నారు గత ప్రభుత్వం లో కూడా అధికారుల చుట్టూ తిరిగిన మా గోడు ఎవరు కూడా పట్టించుకోలేదని ఎన్నో దరఖాస్తులు పెట్టాము కానీ ఫలితం లేకపోయింది అని రైతులు విద్యుత్ కనెక్షన్ కొరకు ముసలమడుగు గ్రామ రైతులు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లకు దరఖాస్తు పెట్టుకోవడం జరిగినది అట్టి దరఖాస్తు పై వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులను అట్టి దరఖాస్తును వెంటనే పరిశీలించి విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశించడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అట్టి రైతుల భూములకు విద్యుత్ త్రీ ఫేస్ కనెక్షన్ ట్రాన్స్ఫారం మంజూరు చేయడంతో అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి మరియు ఏఈ రైతుల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# 60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం



- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- చాకలి ఐలమ్మ నగర్..

**పినపాక,జనవరి25/ (వుదయం):**
మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చాకలి ఐలమ్మ నగర్ లో రూ.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో బ్రిడ్జి నిర్మాణ పనులకుపినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ బ్రిడ్జి నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు పూర్తిగా తొలగి మణుగూరు ప్రాంత అభివృద్ధికి ఇది కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ఏఈ సత్య డీఈ శ్రీనివాస్ వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ సానిటరీ రత్నాకర్ నరేందర్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

# చేపల పెంపకం విధానాలను పరిశీలించిన మంత్రి తుమ్మల



**దమ్మపేట జనవరి 25 (వుదయం ):**
ఏలూరు జిల్లా పరిధిలోని చింతంపల్లి గ్రామంలో ఏలేటి కిషోర్ కు చెందిన ఏలేటి గార్డెన్స్ లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం రోజు పామాయిల్ లో కోకో, కంపోస్టింగ్, వర్మీ కంపోస్ట్, బ్యాక్టీరియా కల్చర్లు, పసుపు, కంపోస్టింగ్, వాటర్ హార్వెస్టింగ్ తో పాటు చేపల పెంపకం విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు ఏలేటి కిషోర్, వెంపాటి లక్ష్మీనారాయణ, మోరంపూడి నాగేశ్వరరావు, నున్న రత్నరావు తదితరులు ఉన్నారు.

# తుమ్మలను కలిసిన బెటాలియన్ పోలీస్



**దమ్మపేట, జనవరి 25 (వుదయం ):**
15వ బెటాలియన్ గంగారంకు చెందిన పలువురు పోలీసు సిబ్బంది ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును దమ్మపేట మండలం గండుగులపల్లి లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకలగా కలిశారు. ఈ సందర్భంగా తమ సుదీర్ఘ కాలపు బదిలీల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.సిబ్బంది విన్నపాన్ని సావధానంగా విన్న మంత్రి, ప్రస్తుతం బదిలీల అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం లభించేలా చూస్తానని వారికి భరోసా ఇచ్చారు. మంత్రి స్పందన పట్ల పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగ ప్రసాద్ పాల్గొన్నారు.



# గుడిబండలో బొల్లం దిష్టిబొమ్మ దగ్ధం

- కాంగ్రెస్ శ్రేణుల ఉగ్ర నిరసన*

**కోదాడ 25,జనవరి 25(వుదయం):**
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గుడిబండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉగ్ర నిరసన చేపట్టారు. సీనియర్ నాయకులు తూమాటి నాగిరెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు కోదాడ-మేళ్లచెరువు రహదారిపై బొల్లం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని విమర్శించారు. బొల్లం తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అభివృద్ధిపై చర్చించే ధైర్యం లేకనే ఇటువంటి నీచ రాజకీయాలకు బొల్లం పాల్పడుతున్నారని అన్నారు. మరలా ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఖబర్దార్ అంటూ హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కూరుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, కుక్కడపు నాగరాజు గౌడ్, పులి వెంకటేశ్వర్లు, వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి, నరోత్తం రెడ్డి, నర్సిరెడ్డి, సిద్దయ్య, రాములు, వీరారెడ్డి, అఖిల్, పవన్, కుమార్, హేమంత్, అసన్ హాలీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విధ్యార్థుల పునఃశ్చరణ తరగతులు



**మధిర,జనవరి 25 (వుదయం ):**
మధిర డివిజన్ లోని షెడ్యూల్డ్ కులాల అధివృద్ధి శాఖ ఆద్వర్యంలో 10 వ తరగతి విధ్యార్థులకు పునఃశ్చరణ తరగతులు మధిర సహాయ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి కొత్త వేంకటేశ్వరరావు నిర్వహించినారు. ఈ సంధర్బంగా విధ్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,ఈ కార్యక్రమాన్ని జిల్లా ఉప సంచాలకులు గుడికందుల జ్యోతి ఆదేశముల మేరకు డివిజన్ స్థాయిలో నిర్వహిస్తునట్లు తెలిపారు. విధ్యార్థులనుద్ధేశించి మాట్లాడుచు ప్రభుత్వం కలిపిస్తున్న వసతి సౌకర్యములను ఉపయోగించుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని డివిజన్ లోని అన్నీ వసతి గృహాల విధ్యార్థులు 10/10 జిపి పాయింట్స్ సాధించాలని అధిక మార్కులు సాధించడం ద్వారా కార్పోరేట్ కాలేజీలో ఉచిత ప్రవేశం పొందవచ్చు అని జీవితంలో గొప్పగా స్థిరపడవచ్చు అని విధ్యార్థులకు వివరించారు. ఉత్తమ టీచర్స్ చే పునఃశ్చరణ తరగతులు ఉపయోగపడతాయి అన్నారు. అధ్యాపకులు కె.రవీందర్ రెడ్డి (మెథమెటిక్స్) ఎస్ త్రివేణి (సైన్స్)ఎస్కే అజీమ్ (హిందీ), పి. సుగుణరావ్ (ఇంగ్లీషు), జి. గోపి(తెలుగు)ఈ కార్యక్రమంలో మధిర, ఎర్రుపాలెం, చింతకాని, బోనకల్, వైరా ,కొణిజర్ల, మండలాలకు చెందిన వసతి గృహ సంక్షేమ అధికారులు సలీం, వెంకటేశ్వర్లు,ప్రభాకర్ రావు,శరత్ బాబు, అంజిబాబు,రాజేశ్వరరావ్, వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, స్వప్న, హసీనా,కృష్ణవేణి,ధనలక్ష్మి, మరతమ్మ, జానీ బేగం,టుటర్స్, ప్రశాంత్, కృష్ణ,వసతి సిబ్బంది పాల్గొన్నారు.

# 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే




**పినపాక, జనవరి 25/వుదయం :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని నా భారత్ నా ఓటు భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు అనే థీమ్‌తో నిర్వహించిన 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం పాల్గొని ర్యాలీని నిర్వహించిన ఎమ్మెల్యే మణుగూరు మండలం అంబేద్కర్ సెంటర్ నందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ర్యాలీలు పాల్గొని, ప్రజలను చైతన్యపరుస్తూ అంబేద్కర్ సెంటర్ వరకు చేరుకొని అక్కడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీ ద్వారా ఓటు హక్కు ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్వో నరేష్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ఎంపీఓ వెంకటేశ్వరరావు బిటి రామారావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు శివ సైదులు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొనికార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- సమాచార హక్కు రక్షణ చట్టం మండల అధ్యక్షుడు మేడి నాగరాజు

**గరిడేపల్లి హుజూర్‌నగర్, జనవరి 25 (వుదయం):**
సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కాసారి గూడెం గ్రామ పరిసరాల్లో రహదారి వెంట చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో దానిని చూసి చలించి పోయిన మేడి నాగరాజు సమాచార హక్కు రక్షణ చట్టం మండల అధ్యక్షులు వాటిని శుభ్రంచే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, ఎటువంటి జబ్బులు దరిచేరవని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే రకరకాల సీజనల్ వ్యాధులు మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ చికెన్ గున్యా లాంటి వైరల్ ఫీవర్ ల బారిన పడవలసి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు.



## ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి వరం

- ఎమ్మెల్యే నాగరాజు

**వర్ధన్నపేట వుదయం:**
పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ్ లక్ష్మి వరమని వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మండల పరిధిలోని 57 మంది అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ. 57,లక్షల 06 వేల 612 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలు పేద, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆడబిడ్డల భవిష్యత్తుకు బలమైన ఆధారంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వము అందిస్తున్న సహాయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు తమ పిల్లల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్కరూ సంక్షేమ పథకాల నుంచి వంచితులుగా ఉండకూడదనే ఉద్దేశంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ, ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తన వంతు పూర్తి బాధ్యతతో కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పోశాల శివశంకర్ రెడ్డి, సర్పంచ్ జెట్టబోయిన రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాంకర్ సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు మధు గౌడ్, నత్తిరెడ్డి, మార్నేని లక్ష్మణరావు, పెండ్ర సంపత్, రాజిరెడ్డి, తో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బంజారాల 'సాతి భవాని' మహాజాతర

- ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం
- జాతరకు సహకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి25 (వుదయం ):**
బంజారాల ఆరాధ్య దైవాలు అయిన 'శ్రీశ్రీశ్రీ సాతి భవాని' అమ్మవార్ల మహాజాతర ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వారం రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్లు బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ చైర్మన్ బానోత్ వీరూ నాయక్ తెలిపారు. ఈ మహాజాతరకు యావత్ హిందూ సమాజం తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్ కాలనీలోని జేపీసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ హాస్పిటల్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరూ నాయక్ మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల క్రాస్‌రోడ్ కొత్తూరు గ్రామ సమీపంలో నిర్వహించ తలపెట్టిన ఈ మహాజాతరకు ప్రభుత్వ శాఖల నుండి అనుమతి పొందడం జరిగిందని తెలిపారు. తొలుత ఈనెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన జాతర కొన్ని అనివార్య కారణాల వలన ఫిబ్రవరి 3వ తేదీకి వాయిదా పడిందని వివరించారు. మహాజాతరలో భాగంగా ఈనెల 28వ తేదీ నుండి ప్రత్యేక హోమాలు, శాంతి పూజలు భోగ్ బండార్ జరుపనున్నామని పేర్కొన్నారు. ఈ మహాజాతరకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. బంజారాల ఆరాధ్య దైవాలు అయిన మేరేమా జగదంబ భవానీ, జ్వాల్మ భవానీ, హింగ్లా భవానీ, తుల్జా భవానీ, కేంకాళి భవానీ, ధ్యాలంగళ్ భవానీ, మత్రాళ్ భవానీలకు వారం రోజులపాటు ప్రత్యేక పూజలు, భోగ్‌బండార్‌ నిర్వహించడం జరుగుతుందన్నారు. మహాజాతర సందర్భంగా భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని, ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకుంటామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులను కలిసి జాతరకు అవసరమైన అనుమతులు కోరుతూ విన్నవించగా, వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కొందరు కావాలని జాతర నిర్వహణపై అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. బంజారా సంఘాల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, సంఘటిత, అసంఘటిత రంగాల నాయకులు, కార్యకర్తలతోపాటు రాజకీయ నాయకుల అండదండలు, సహాయ సహకారాలతో ఈ మహాజాతరను విజయవంతం చేసేందుకు సాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. హిందూ సాంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకుగాను బంజారాలుగా తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నామన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ జయంతి నిర్వహణకు గాను ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మహాజాతరకు హిందూ బంధువులు, బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జేపీసీ ప్రధాన కార్యదర్శులు ధరావత్ కాన్షీరామ్, గుగులోత్ కేశవ్, బానోత్ గణేష్ మహరాజ్, ట్రెజరర్ బానోత్ రమేష్, కో-కన్వీనర్ బానోత్ గోల్యియా నాయక్, బానోత్ మోహన్ నాయక్, మాళోత్ శివ నాయక్, మాళోత్ శంకర్, గుగులోత్ భద్రునాయక్, బానోత్ మంచ్యా నాయక్, లావుడ్య హన్మంతు నాయక్, భూక్య రాము, మహిళా విభాగం కో-కన్వీనర్లు భూక్య రుక్మిణి, భట్టు మంజుల, మాళోత్ గంగీ, హలావత్ రుక్మిణి, జాటోత్ భరత్, ధరావత్ నర్సింహా, సోషల్ మీడియా విజయ్ నాయక్, వెంకట్‌లు పాల్గొన్నారు.

# బొల్లం వ్యాఖ్యలు రాజకీయ విజ్ఞతకు విరుద్ధం: వరప్రసాద్ రెడ్డి



**కోదాడ, జనవరి 25(వుదయం):**
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ కోదాడ మండల అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, రాజకీయాల్లో విమర్శలు సహజమే కానీ వ్యక్తిగత దూషణలు అహంకారానికి నిదర్శనమన్నారు. 60 వేల ఓట్లతో ఓడిపోయిన సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. తక్షణమే బొల్లం బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, బొల్లం చేసిన అక్రమాలు-అన్యాయాలపై గుడిబండకు వచ్చి తేల్చుకుందామని సవాల్ విసిరారు. మరోసారి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సర్పంచుల పోరం అధ్యక్షులు కొత్త గురవయ్య, సీనియర్ నాయకులు భాష బోయిన భాస్కర్, సర్పంచులు పాలిక సురేష్, మందుల నాగయ్య, లిక్కీ గురవమ్మ, బాబ్జి, హాజీ, శరభయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో మున్నూరు కాపుల సత్తా చాటాలి



- మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు 2026 డైరీని ఆవిషరించిన ప్రముఖులు

**ఖమ్మం,జనవరి 25 (వుదయం) :**
అర్బన్ మండలం పుట్టకోట దగ్గరలోని PVNR ఫంక్షన్ హాల్ జరిగిన మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగ ,విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది..డైరీ ఆవిష్కరణను ఖమ్మం మున్నూరుకాపు సంఘం సీనియర్ నాయకులు RJC కృష్ణ, ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బాల శ్రీనివాస్ ఇతర ప్రముఖులు నూతన డైరీని ఆవిషరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది ఉన్నారు.. మున్నూరుకాపు కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని వారు కోరారు..అలాగే మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వారి సమస్యలు పరిష్కరించేందుకు మా సంఘం ముందు ఉంటుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాల శ్రీనివాస్ అన్నారు..రాబోయే రోజుల్లో మున్నూరుకాపులు తమ ప్రభావాన్ని చూపాలని వారు పిలునిచ్చారు..డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెద్ద బోయిన నాగరాజు, కర్నాటి సోమయ్య,నిర్మల సూరిబాబు,మేకల బిక్షమయ్య,ఏనుగుల రాజు పటేల్,సత్య నారాయణ పటేల్.పసుపులేటి శ్రీనివాస్,పగడాల రాంప్రసాద్,రాకం శ్యామ్ బాబు ,శారద రంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి మధుపల్లి ప్రజలు కృతజ్ఞతలు



**మధిర, జనవరి25 (వుదయం ):**
మడుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో రాయపట్నం రోడ్డు నుండి తాళ్లురు క్రాస్ రోడ్డు వరకు 16.5 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు బట్టి విక్రమార్కకు మడుపల్లి పరిసర గ్రామ ప్రజలు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఓటు వేయడంతో దేశ నిర్మాణంలో మీవంతు



- లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి

**కాజీపేట, జనవరి 25 (వుదయం) :**
స్థానిక పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) హనుమకొండలో ఎన్ సి సి ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించి, 18 సంవత్సరాలు నిండిన విద్యార్థినులు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం బాధ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థినులు అందరూ విధిగా ఓటరు నమోదు చేయించుకొని భవిష్యత్తులో ఓటు వేయడం ద్వారా తమ బాధ్యత ను నెరవేర్చాలని ఈ రకంగా దేశ నిర్మాణంలో తమ వంతు విధి నిర్వహణ నిర్వర్తించాలని తెలిపారు. ఎన్ సి సి క్యాడెట్స్ ఓటరు ప్రతిజ్ఞ ను చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా . సుహాసిని, ఎన్ సీ సి కేర్ టేకర్ ఆఫీసర్ డా. బండారి సువర్ణ, ఎన్ సి సి క్యాడెట్స్ పాల్గొన్నారు.

# 200 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ







- ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ, జనవరి 25 (వుదయం ) :**
ప్రజా పాలనలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నదని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం కార్యక్రమంలో భాగంగా 200 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీల సంక్షేమాన్ని మాటల్లో కాదు, పనుల్లో చూపిస్తోందని అన్నారు. గత పాలనలో మైనారిటీలను ఓటు బ్యాంకులా మాత్రమే చూశారని, కానీ ప్రస్తుతం ప్రభుత్వం మైనారిటీలను భాగస్వాములుగా భావిస్తూ వారి ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి పథకం ద్వారా యువతకు, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కుట్టు మిషన్లు, వ్యాపార రుణాలు, నైపుణ్య శిక్షణల ద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇది కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాదని, అభివృద్ధికి పునాది వేస్తున్న కార్యక్రమమని అన్నారు. మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందిస్తున్నామని, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, వృత్తి శిక్షణ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. మైనారిటీ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూసే విధానంతో పాలన సాగిస్తోందని, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు భిన్నంగా ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.లబ్ధిదారులు ఈ కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది మొదలు మాత్రమేనని, రాబోయే రోజుల్లో మైనారిటీల కోసం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొస్తామని తెలిపారు.ఇప్పటికే మరో 200 కుట్టు మిషన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు.ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మైనారిటీ అనుబంధ సంఘ నాయకులు, మైనారిటీ పెద్దలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



**పరకాల జనవరి 25 (వుదయం):**
తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా క్యాలెండర్‌ను పరకాల ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షులు గందె వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆదివారం ఉదయము పరకాల అరుణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ షాప్ నందు ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు రక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందని, రైతుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. రైతులకు ఉపయోగపడే విధంగా కార్యక్రమాలు చేపడుతూ, ప్రభుత్వానికి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ కంపెనీ ప్రతినిధులు ప్రకాష్, మల్లారెడ్డి,దయాకర్, కుమారస్వామి, గౌతమ్ పాల్గొన్నారు.

# బిసిల ఐక్యతతోనే రాజ్యాధికారం





**హైదరాబాద్,జనవరి 25 (వుదయం) :**
గత 80 సంవత్సరాలుగా బహుజనులకు రాజ్యాధికారం దక్కలేదని, అందరూ ఒక్కటై పోరాడితేనే బీ సి రాజ్యం సాధ్య పడుతుందని మాజీ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే,కేశవరావు అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రాజ రాజేశ్వరి గార్డెన్లో... తెలంగాణ మున్నూరు కాపు సంఘం.. ఆధ్వర్యంలో డైరీ ఆవిష్కరణ సభ జరిగింది.సంఘం అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు, అధికార ప్రతినిధి డైరీ కమిటీ చైర్మన్ మంగళహార లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన నిర్వహించిన సర్పంచ్ ల సన్మానం డైరీ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపులు ముందుండి అన్ని కులాలను కలుపుకొని రాజ్యాధికారం దిశగా పయనించాలని సూచించారు.వి, హనుమంతరావు మాట్లాడుతూ సర్పంచులు అంచలంచలుగా చట్టసభల వరకు ఎదగాలని ఎంపీటీసీ జడ్పిటిసి మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక సంఖ్యలో మున్నూరు కాపులు గెలిపించేందుకు సర్పంచ్లు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో దానం నాగేందర్ మాట్లాడుతూ కోకాపేటలో కేటాయించిన ఐదు ఎకరాల స్థలానికి ప్రభుత్వం 15 కోట్లు కేటాయించాలని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు, మున్నూరు కాపులు కష్టజీవులని పేర్కొన్నారు,తమ హక్కుల కోసం ఎవరి మీదనైనా పోరాటం చేస్తామని పేర్కొన్నారు, కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రివర్యులు పల్లెం రాజు మాట్లాడుతూ మున్నూరు కాపులు మున్నూరు కాపులు నీతి నిజాయితీతో బ్రతుకే కష్టజీవులు అన్నారు కానీ తెగిస్తే ఎంతవరకైనా పోరాడతారన్నారు, ఇప్పటికీ రాజ్యాధికారం దక్కకపోవడం మనలోని అనైక్యత కారణం అన్నారు, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య మాట్లాడుతూ మున్నూరు కాపులు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలన్నారు ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టిన కమిటీ సభ్యులను అభినందించారు, మాజీ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ తెలంగాణ ప్రకాష్, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్, హజారి రమేష్ తెలంగాణ జర్నలిస్ట్ ల సంఘం ఉపాధ్యక్షులు, ,అల్లం భాస్కర్, మిద్దెల జితేందర్, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మార్క్ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,బుక్క వేణుగోపాల్,ఈ సంపల్లి వెంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, కోశాధికారి కంచి సత్యనారాయణ మహిళా అధ్యక్షురాలు బండి పద్మ, డైరీ కమిటీ సభ్యులు ఆకుల సత్యనారాయణ కోలా శివకుమార్, పర్వతం సతీష్, వివిధ జిల్లాల అధ్యక్షులు, మహిళా సోదరీమణులు సర్పంచులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సోమశిల సౌందర్యం.. పర్యాటకానికి మణిహారం

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్ జనవరి 25 (వుదయం) :**
నల్లమల అడవుల మధ్య కృష్ణమ్మ ఒడిలో ఒదిగి ఉన్న సోమశిల పర్యాటక కేంద్రం ఆధ్యాత్మికతకు, ప్రకృతి ప్రేమికులకు అద్భుతమైన గమ్యస్థానమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన సోమశిల ఎకో టూరిజం పార్కును సందర్శించారు. వ్యూ పాయింట్ నుంచి కృష్ణా నది, ప్రకృతి అందాలను వీక్షించారు.
ఈ సందర్భంగా సోమశిల తీరం నుంచి ఎకో పార్కు వరకు మంత్రి బోటులో విహరించారు. అక్కడి ప్రకృతి అందాలను, అటవీ, పర్యాటక శాఖ కల్పిస్తున్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
అనంతరం మంత్రి మాట్లాడుతూ సోమశిల శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్స్ లో ప్రకృతి అందాలు పర్యాటక ప్రేమికుల్ని సరికొత్త అనుభూతిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడి వ్యూ పాయింట్ వద్ద ప్రకృతి దృశ్యాలు పర్యాటకులను కట్టిపడేస్తాయని, ముఖ్యంగా ఎకో పార్కు పరిసరాల్లోకి అప్పుడప్పుడు పులులు వంటి వన్యప్రాణులు రావడం ఇక్కడి పర్యాటకానికి మరింత ఆకర్షణను తెస్తుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు, దేశ విదేశీ పర్యాటకులను పెద్ద ఎత్తున ఆకర్షించేలా సోమశిలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సోమశిల ప్రాంతం కేవలం విహారకేంద్రంగానే కాకుండా 15 శివాలయాల సముదాయంతో ఆధ్యాత్మిక క్షేత్రంగానూ అలరారుతోందని ఆయన గుర్తు చేశారు. పర్యాటకుల సౌకర్యార్థం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (TGTDC) సోమశిల నుండి శ్రీశైలం వరకు ఐదు గంటల పాటు సాగే ప్రత్యేక బోటింగ్ సేవలను అందిస్తోందని, ఈ ప్రయాణంలో నదీ తీర అందాలను చూస్తూ సాగే ప్రయాణం మధురానుభూతిని కలిగిస్తుందని చెప్పారు.
ఈ ప్రాంతంలో ఉన్న హరిత మృగవాణి రిసార్ట్స్ పర్యాటకులు బస చేయడానికి అద్భుతమైన వసతి కల్పిస్తున్నాయని, సమీపంలోని మల్లెల తీర్థం, పాలధార, పంచదార వంటి జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.



# చదువుతోపాటు యువతకు క్రీడలు స్ఫూర్తిదాయకం

*బెజుగామలో ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి*



**గజ్వేల్, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బెజుగామ గ్రామంలో సర్పంచ్ నక్కీర్త గోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్ వేసి ఆటను ప్రారంభించిన అనంతరం ఆంక్ష రెడ్డి మాట్లాడుతూ..

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మంచి వేదికలని ఆమె కొనియాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి, ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, జిల్లాకు మరియు రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ నక్కీర్త గోపాల్ మాట్లాడుతూ గ్రామంలో యువతను ప్రోత్సహించేందుకు నిరంతరం ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని,

క్రీడాకారులకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్కీర్త నాగేందర్, శివారెడ్డి, క్రీడాకారులు, గ్రామ యువత మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత

*వైభవంగా కోనాయిపల్లిలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు*



**సిద్దిపేట 25 (వుదయం ప్రతినిధి)**

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం కోనాయిపల్లి గ్రామంలో గల శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 1, 2026 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా రూపొందించిన ఆహ్వాన పత్రికను వంగ రాజేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నిర్వాహకులు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ బ్రహ్మోత్సవాలను భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, శ్రీ భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, విశేష అర్చనలు, మహా అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ దువ్వల మల్లయ్య యాదవ్, మాజీ సర్పంచ్ పిల్లి వెంకటేశం, నిమ్మ నరసింహ రెడ్డి, పెద్ది శ్రీకాంత్ రెడ్డి, దువ్వల చంద్రం, రాధరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమక్క–సారలమ్మ జాతరకు ఆహ్వానంఅదేవిధంగా సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం అక్కెనపల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న శ్రీ సమక్క–సారలమ్మ జాతరకు హాజరుకావాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నిర్వాహకులు ఆహ్వానించారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమక్క–సారలమ్మ జాతర గిరిజన సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమ్మవార్ల కృప కోసం భక్తులందరూ పెద్ద సంఖ్యలో జాతరకు హాజరై ఆశీస్సులు పొందాలని

ఆయన పిలుపునిచ్చారు.

# అక్షర స్నేహం.. ఆపన్న హస్తం

***ప్రమాద బాధితుడికి రూ. 70 వేల ఆర్థిక సాయం***



**పాములపర్తి (మర్కుక్), జనవరి 25 (వుదయం )**

చదువుకున్న రోజుల్లో పంచుకున్న జ్ఞాపకాలే కాదు, కష్టాల్లో ఉన్నప్పుడు పంచుకునే సాయమే అసలైన స్నేహమని నిరూపించారు ఆ పూర్వ విద్యార్థులు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటన స్థానికుల్లో స్ఫూర్తిని నింపింది. వివరాల్లోకి వెళ్తే..పాములపర్తి గ్రామానికి చెందిన బోయిని రాజు ఇటీవల జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసి.. ఆయనతో కలిసి చదువుకున్న 2004–2005 విద్యా సంవత్సరం పదవ తరగతి మిత్రులు స్పందించారు. ప్రమాదానికి గురైన తమ మిత్రుడిని ఆదుకోవాలని సంకల్పించి, చందాలు వేసుకుని 70 వేల రూపాయల భారీ ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఆదివారం రాజు నివాసానికి చేరుకున్న పూర్వ విద్యార్థులు, సదరు మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "మిత్రుడు రాజు ఆపదలో ఉన్నాడని తెలిసి మేమంతా ఒక్కటయ్యాము. ఇటీవల జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం లోనే ఒకరికొకరం అండగా ఉండాలని నిర్ణయించుకున్నాం. ఆ నిర్ణయం మేరకు ఈ రోజు మా మిత్రుడికి చిన్న సాయం చేశాం. భవిష్యత్తులోనూ మా స్నేహితులకు ఎలాంటి కష్టం వచ్చినా మేమంతా ఒకే తాటిపై నిలబడి ఆదుకుంటాం" అని భరోసా ఇచ్చారు.తమ తోటి మిత్రుడి ప్రాణం కాపాడుకునేందుకు, ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన యువతను గ్రామస్తులు వేనోళ్ల కొనియాడారు. నేటి కాలంలో స్నేహానికి అసలైన అర్థం చెప్పారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాతూరు మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు, సీనియర్ నాయకులు తండా స్వామి, పాములపర్తి కరుణాకర్, హైమద్, రాజు, కనకయ్య, రవి, గచ్చు భాయ్ నరేష్ గౌడ్, నర్సింలు, ప్రభాకర్, కనకరాజు, ఇతర పూర్వ విద్యార్థులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై విద్యార్థుల చైతన్య ర్యాలీ




**జగదేవపూర్, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

జగదేవపూర్ మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. మండల తహసిల్దార్ నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులతో కలిసి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుపై మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు మరియు ప్రజాప్రతినిధులు కలిసి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ఈ సందర్భంగా తహసిల్దార్ కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు, గ్రామ నాయకులు బుద్ధ నాగరాజు, మాజీ ఎంపీటీసీ కవిత, వార్డు సభ్యులు, ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఆసిఫ్ అలీ హాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల జనవరి 25 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణంలో గల అతి పురాతనమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రథసప్తమి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ఈ సందర్భంగా ఆయనకు స్వామివారి వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని అందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ స్వామి వారి కృప కటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు దేవాలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య ధర్మకర్తలు నేతి శ్రీనివాస్ కటుకం దివాకర్ కోట గంగాధర్ గోడికె రాములు చిలువేరి విజయకుమార్ చిట్యాల పద్మ ఆలయ ఈవో ఎం విక్రమ్ జూనియర్ అసిస్టెంట్ పేడిపల్లి నర్సయ్య సదానంద చారి తదితరులు పాల్గొన్నారు

## మైనర్ల డ్రైవింగ్‌పై
# పోలీసుల ఉక్కుపాదం

***39 మందికి పర్యావరణ శిక్ష!***
***వాహనాలిచ్చిన తల్లిదండ్రులకు రూ. 1.95 లక్షల భారీ జరిమానా***
***కోమటి చెరువు వద్ద మొక్కలు నాటాలని కోర్టు వినూత్న తీర్పు***
***పిల్లల ప్రాణాలతో ఆడుకోవద్దు: సీపీ రష్మీ పెరుమాళ్ హెచ్చరిక***



**సిద్దిపేట, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

నగరంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్ల పట్ల సిద్దిపేట పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 39 మంది మైనర్లపై పోలీసులు ఛార్జ్‌షీట్ నమోదు చేశారు. ఆదివారం వీరిని కోర్టులో హాజరుపరచగా, మెజిస్ట్రేట్ గారు అత్యంత వినూత్నమైన మరియు గుణపాఠం చెప్పే తీర్పును వెలువరించారు. నిబంధనలు అతిక్రమించిన సదరు 39 మంది మైనర్లు రేపు (సోమవారం) సిద్దిపేటలోని కోమటి చెరువు పరిసరాల్లో మొక్కలు నాటాలని కోర్టు ఆదేశించింది. తద్వారా తప్పు చేసిన వారికి పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాలని మెజిస్ట్రేట్ భావించారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణ బాధ్యతలోనూ భాగస్వాములు కావాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించినందుకు గాను, వారి తల్లిదండ్రులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి రూ. 5,000/- చొప్పున, మొత్తం 39 మంది తల్లిదండ్రులకు కలిపి రూ. 1,95,000/- భారీ జరిమానా విధించింది. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం అంటే వారి ప్రాణాలను పణంగా పెట్టడమే. ఇది కేవలం ట్రాఫిక్ ఉల్లంఘన మాత్రమే కాదు, ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదకరం. తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. చట్టం పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఇటువంటి కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు.

# నిరుపేద కుటుంబానికి చెలిమి ఫౌండేషన్ అండగా

*కుటుంబానికి 'చెలిమి ఫౌండేషన్' ద్వారా 84వ సహాయక కార్యక్రమం*

**సిద్దిపేట, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి 'చెలిమి ఫౌండేషన్' ద్వారా 84వ సహాయక కార్యక్రమం నిర్వహించారు. గత నెలలో కిడ్నీ సమస్య, ఆపై హార్ట్ ఎటాక్‌తో మరణించిన బోండ్ల రమేష్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఆయన భార్య బోండ్ల మమత, ఇద్దరు ఆడపిల్లలు అక్షిత (8వ తరగతి), అవంతిక (5వ తరగతి) ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వారికి భూమి గానీ, సొంత ఇల్లు గానీ లేదు. ప్రస్తుతానికి వారు సీసీ రోడ్డు మీద రేకుల షెడ్డు వేసుకొని, మమత రోజువారీ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు.ఈ కుటుంబం గురించి ఫౌండేషన్ సభ్యులు కొట్టాల శ్రీనివాస్, గుంటుక శ్రీనివాస్, నాగపూరి బాబు ద్వారా తెలియడంతో, తక్షణ సహాయం అందించాలని నిర్ణయించారు. ఆదివారం బోండ్ల రమేష్ భార్య మమత మరియు వారి పిల్లలకు సహాయంగా రూ.3500 విలువైన నిత్యావసర సరుకులు మరియు రూ.11,500 నగదు, మొత్తం కలిపి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ అధ్యక్షులు మంగిలిపల్లి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు గుంటుకు శ్రీనివాస్, సభ్యులు గుర్రం తులసిదాస్, గుర్రం శ్రీకాంత్ పాల్గొన్నారు. మానవతా దృక్పథంతో అందించిన ఈ సహాయానికి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీతోనే పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధి

*మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి..–కాషాయ కండువా కప్పుకున్న బిఆర్ఎస్ నేతలు*

**..పెద్దపల్లి జనవరి 25 (వుదయం ప్రతినిధి)**



పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుండటంతో భారతీయ జనతా పార్టీలో వివిధ పార్టీలకు చెందిన నాయకుల వలసలు కొనసాగుతున్నాయి. బిజెపి నాయకులు బెజ్జంకి దిలీప్ కుమార్, అడిచెర్ల స్వతంత్ర కుమార్ ఆధ్వర్యంలో 9వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకులు బొల్లం అనిల్, బోల్లం భూమేందర్ వారి అనుచరులు బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణ రెడ్డి,జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి వారికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా గుజ్జుల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ సుపరిపాలన, సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదం అందిస్తున్న ఫలాల కారణంగాదేశంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని తెలియచేశారు. పెద్దపల్లి మున్సిపల్ అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని ఉద్ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఠాకూర్ రాంసింగ్, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, జంగా చక్రధర్ రెడ్డి, శివంగారి సతీష్, మోలుగురి రాజవీరు, మోర మనోహర్, కాసనగొట్టు విజయ్, కోదాడి భాస్కర్, పిట్ట వినయ్, కుక్క వంశీ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామివారిని దర్శించుకున్న మంత్రి పొన్నం



**కరీంనగర్ జనవరి 25,(వుదయం ప్రతినిధి):**

మార్కెట్ రోడ్డు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహనంలో స్వామివారు విహరించగా ఈ వేడుకల్లో మంత్రి, సుడా చైర్మన్ పాల్గొన్నారు.

అనంతరం మంత్రికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ పాల్గొన్నారు.

# 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

*బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుట్ల ఎమ్మెల్యే కు దరఖాస్తు అందజేసిన ఎండి ఆమెర్*



**కోరుట్ల జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణ 19వ వార్డు భారత రాష్ట్ర సమితి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ ఆదివారం భారత రాష్ట్ర సమితి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లకు భారత రాష్ట్ర సమితి కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ కోరుట్ల పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్ నాయకులు గడ్డం మధు ల ఆధ్వర్యంలో దరఖాస్తులు అందజేసిన 19 వ వార్డు భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి ఎండి అమేర్ ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ భారత రాష్ట్ర సమితి పార్టీ కోరుట్ల మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్ నాయకులు గడ్డం మధు 19 వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి ఎండి ఆమేర్ తదితరులు పాల్గొన్నారు

# నేటి తరాలు మన సంస్కృతి సాంప్రదాయాల గురించి తెలుసుకోవాలి

*దేవుని పట్ల భక్తి భవం పెద్దలపట్ల గౌరవభావం కలిగి ఉండాలి .ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్*




**జగిత్యాల. జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

శ్రీ గుట్ట రాజేశ్వర దేవస్థానం కళ్యాణ మండపంలో బ్రహ్మ శ్రీ బుర్ర భాస్కర శర్మ చే శ్రీ శివ మహా పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం కార్యక్రమానికి హాజరైన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి తరానికి మన సంస్కృతి సాంప్రదాయాలు గురించి తెలియదు ఇలాంటి ప్రవచనాల వల్ల మన సంస్కృతి సంప్రదాయాలు తెలిసి దేవుని పట్ల భక్తి భావం పెద్దల పట్ల గౌరవ భావం కలుగుతాయి అతి పురాతన ధర్మం మన హిందూధర్మం మన ధర్మాన్ని పాటిస్తూ ఇతర ధర్మాలను మతాలను మనం గౌరవించాలి జగిత్యాల అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తానని జగిత్యాల నియోజకవర్గంలో అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేయటం జరిగింది గుట్ట రాజేశ్వర ఆలయానికి ధ్యాన మందిరం కూడా మంజూరు చేయటం జరిగిందని భగవంతుని కృప తో జగిత్యాల ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం భగవంతుడు కల్పించాలని కోరుకున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఊటూరి భాస్కర్ తాజోద్దీన్ కొత్తపల్లి శ్రీను పుల్లయ్య కుటుంబ సభ్యులు శంకర్ మేక పవన్ ప్రవీణ్ రావు జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ నక్క అశోక్ ఉదయ్ క్రాంతి శృంజయ్ నాని జగన్ రాజు తదితరులు పాల్గొన్నారు

# పదవ తరగతి విద్యార్థులకు మైత్రి ఫౌండేషన్ బాసట



**సిద్ధిపేట, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ కుకునూరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాక్షి దినపత్రికలను అందజేశారు. 2006 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. పదవ తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా సాక్షి దినపత్రికలో ప్రచురితమయ్యే మోడల్ పేపర్లు, సబ్జెక్టు నోట్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని భావించి, ప్రతిరోజూ 10 పత్రికలు అందేలా ఏర్పాటు చేశారు. ఇటీవల స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన రాముని పల్లి సర్పంచ్ శ్రీనివాస్, వార్డు మెంబర్లు మహిపాల్, నాగరాజు, నర్సింలు, స్వామిలను ఈ సందర్భంగా మైత్రి ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలి: పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులై పాఠశాల గౌరవాన్ని పెంచాలని, ఉన్నత చదువులపై అవగాహన పెంచుకోవాలని ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం కుకునూరపల్లి ఎంఈవో బచ్చలి సత్తయ్య సహకారంతో నిర్వహించబడింది. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు రిప్పల స్వామి, డాక్టర్ శివకుమార్, మల్లేష్ గౌడ్, బి. శ్రీనివాస్, టి. మహేందర్,

ఎల్. విక్రమ్, ఎం. మల్లేష్, కిషన్, జి. కిరణ్ కుమార్ రెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె నుండి ఢిల్లీ దాకా..

*గణతంత్ర వేడుకలకు మిరుదొడ్డి మహిళ 'లక్ పతి దీదీ' రేణుకకు ఆహ్వానం!*

**సిద్ధిపేట, జనవరి 25 (వుదయం ప్రతినిధి)**




సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాల గ్రామానికి చెందిన కుర్ర రేణుక ఒక సామాన్య మహిళ నుండి దేశ రాజధానిలో జరిగే గణతంత్ర వేడుకల అతిథిగా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్' ద్వారా మహిళలను లక్షాధికారులుగా మార్చాలనే 'లక్ పతి దీదీ' సంకల్పానికి రేణుక ఒక నిదర్శనంగా నిలిచారు. ఒకప్పుడు కూలీ పనులకు వెళ్తూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చిన రేణుక జీవితాన్ని మహిళా స్వయం సహాయక సంఘం మార్చివేసింది. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సంఘం ద్వారా రుణం పొందిన ఆమె, గ్రామంలో ఒక చిన్న కిరాణా షాపును (ఎంటర్ప్రైస్) ఏర్పాటు చేసుకున్నారు. క్రమశిక్షణతో వ్యాపారాన్ని వృద్ధి చేస్తూ, వచ్చిన లాభంతో కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వాలంబన సాధించడమే కాకుండా, తనలాంటి నిరుపేద కుటుంబాలకు ఆదర్శంగా నిలిచారు. రేణుక సాధించిన ఈ ప్రగతిని గుర్తించిన ప్రభుత్వం, ఢిల్లీలో అధికారికంగా నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆమెను ప్రత్యేకంగా ఆహ్వానించింది. ప్రభుత్వ సహకారంతో ఆమె ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. గ్రామీణ మహిళలు సంఘాల ద్వారా లభించే రుణాలను సద్వినియోగం చేసుకుంటే 'లక్ పతి దీదీ'లుగా ఎదగవచ్చని ఆమె ఈ సందర్భంగా నిరూపించారు. ఒక సామాన్య పల్లెటూరి మహిళ తన కష్టంతో,ప్రభుత్వ చేయూతతో దేశ రాజధానిలో జరిగే అత్యున్నత ఉత్సవాల్లో పాల్గొనడంపై మిరుదొడ్డి మండల ప్రజలు మరియు అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బీర్పూర్ జాతరకు మంత్రి అడ్లూరి కి ఆహ్వానం



***ధర్మపురి జనవరి25(వుదయం ప్రతినిధి):***

బీర్పూర్ మండల కేంద్రంలో నిర్వహించే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ ఆదివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేశారు. జనవరి 28వ తేదీ నుండి ఫిబ్రవరి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



# రైతు చెంతకే 'భూధార్'

- క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక 'రోవర్స్'తో కొలతలు
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం,జనవరి 25 (వుదయం) :**
..భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

**అందుబాటులోకి అత్యాధునిక సాంకేతికత**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నాం. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించాం" అని వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పని చేయాలని సూచించారు.

**ధరణి అక్రమాలపై ఉక్కుపాదం**

ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని, ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయంహైదరాబాద్ నాంపల్లి అగ్నిప్రమాద ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ దినోత్సవం



- సీనియర్ సిటిజన్ లకు సన్మానం.

**ఖానాపురం, జనవరి 25 (వుదయం ప్రతినిధి):**
జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ధర్మారావుపేట, కొత్తూరు, రాగంపేట గ్రామాల్లోని ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించి ఆయా గ్రామాల్లోని సీనియర్ సిటిజన్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాద్రాజు వెంకన్న, ఎలగందుల రాజు, బిఐఓలు కాసు యాకయ్య, రెడ్డిమల్ల సంపూర్ణ, కందికట్ల వినోద్ కుమార్, బండారి రాజు, పిండి శ్రీకాంత్, గాలి జోసఫ్, కడారి నర్సయ్య, గాదరబోయిన మహేందర్, కొంకటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల పేర్లతో
# అవార్డులు ఇవ్వడం అభినందనీయం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హనుమకొండ, జనవరి 25 (వుదయం ) :**
పలు రంగాలలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి పురస్కారాలు ప్రధానం చేయడం అభినందనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సెమినార్ హాల్ లో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమండాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సినీ కమెడియన్ ఆర్ ఎస్ నంద హాజరయ్యారు. ముందుగా నిర్వాహకులతో కలిసి ముఖ్య అతిధులు జ్యోతి ప్రజ్వలన చేసారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ లాంటి మహనీయులను గుర్తు చేసుకుంటూ వారి పేరు మీద జాతీయ పురస్కారాలు ప్రధానం చేయడం మంచి పరిణామమని, ఈ సందర్భంగా నిర్వాహకులను కొనియాడారు. రాబోయే కాలంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు వంతు సహకారం సంస్థకు అందిస్తానన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని విభిన్న రంగాలలో కృషి చేస్తున్న కళాకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అవార్డులతో బాధ్యత పెరుగుతుందని, అవార్డులు అందుకుంటున్న పురస్కార గ్రహీతలు మరింత భాద్యతగా పని చేయాలన్నారు. సినీ కమెడియన్ ఆర్ ఎస్ నంద మాట్లాడుతూ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతుండడం గర్వకారణమన్నారు. అతిదుల సమక్షంలో పలువురికి పురస్కారాలు ప్రధానం చేసారు. నిర్వాహకులు అతిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య, జాతీయ కార్యదర్శి డాక్టర్ వంగల మోహన్ రావు,యూత్ అధ్యక్షులు అద్దంకి నాగరాజు, నాగ మల్లేశ్వరి, అరుణ రెడ్డి, వేముల తిరుపతి రెడ్డి, బాణాల రాజు,జొనగాని యాదగిరి గౌడ్,గడ్డం వెంకన్న, తిరుణహరి నరేందర్,మానుపాటి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసిక వికాసానికి దోహదం

- మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్
- ఉల్లాసంగా ఉపాధ్యాయుల క్రికెట్ మ్యాచ్
- పెద్దవంగర టైగర్స్ పై చిట్యాల లయన్స్ గెలుపు

**పెద్దవంగర, జనవరి 25 (వుదయం ప్రతినిధి):**
ఉపాధ్యాయ, ఉద్యోగుల మధ్య క్రీడలు మానసిక వికాసానికి, సమన్వయానికి దోహదం చేస్తాయని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రెండు కాంప్లెక్స్ ఉపాధ్యాయుల మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ కు ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై, టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విధుల ఒత్తిడికి దూరంగా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసంతో పాటుగా శారీరక దృఢత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. క్రీడలు ఉద్యోగుల్లో సమన్వయం, పరస్పర సహకారం, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. క్రీడలు జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీ భావన ఉద్యోగుల పనితీరును మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. * ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రికెట్ మ్యాచ్ మండలంలోని రెండు కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పెద్దవంగర టైగర్స్, చిట్యాల లయన్స్ మధ్య నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. పెద్దవంగర టైగర్స్ జట్టుకు ఎండీ యాకుబ్ పాషా, చిట్యాల లయన్స్ జట్టుకు చిక్కాల సతీష్‌నాయకత్వం వహించారు. టాస్ గెలిచిన పెద్దవంగర టైగర్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. నిర్ణీత 12 ఓవర్లకు చిట్యాల జట్టు 143/5 రన్స్ చేసింది. జట్టులో వేముల సంతోష్ 44 రన్స్ (3*6, 5*4), జంగిలి రాజు 31, జాటోత్ రమేష్ 23, మురళి 22 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన పెద్దవంగర జట్టు 12 ఓవర్లు ముగిసే సరికి 59/3 పరుగులే చేసింది. చిట్యాల జట్టు 7 వికెట్ల తేడాతో పెద్దవంగర జట్టు పై విజయం సాధించింది. వేముల సంతోష్ 2 వికెట్లు, మురళి 1 వికెట్ తీశారు.



# భూపాలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో టిఆర్పి జెండా ఎగరవేయాలి

**భూపాలపల్లి, జనవరి 25 (వుదయం) :**
రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు గాను తెలంగాణ రాజ్యాధికార పార్టీ టిఆర్పితరపున పూర్తి స్థాయిలో పోటీ చేస్తామని భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ...గత పాలకులైన టిఆర్ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. ఎన్నికలు సమీపించగానే ప్రజలను మభ్యపెట్టేందుకు మళ్లీ దొంగ హామీలతో ముందుకు వస్తున్నారని విమర్శించారు. కావున ప్రజలు కాంగ్రెస్ గానీ, టిఆర్ఎస్ గానీ ఈ రెండు పార్టీలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. భూపాలపల్లిలో మెజారిటీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు టిఆర్పి పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. సామాన్యుడు కూడా కౌన్సిలర్‌గా పోటీ చేయగలిగే విధంగా టిఆర్పి పార్టీ అవకాశం కల్పిస్తుందని అన్నారు.ఇకపై ఆశావాహులు కాంగ్రెస్, టిఆర్ఎస్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, బీసీల, ఎస్సీల, ఎస్టీల, మైనారిటీల హక్కుల కోసం ఏర్పడిన టిఆర్పి పార్టీ మీ అందరినీ ఆహ్వానిస్తోందని తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పార్టీ మేనిఫెస్టో రూపొందించబడుతుందని స్పష్టం చేశారు.ప్రస్తుతం భూపాలపల్లి మున్సిపాలిటీ దయనీయ స్థితిలో ఉందని, మళ్లీ పాత పాలకుల చేతికి అధికారాన్ని అప్పగిస్తే అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని హెచ్చరించారు. కావున విజ్ఞులైన ప్రజలు టిఆర్పి పార్టీని ఆదరించాలని, ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నేరుగా తనను సంప్రదించాలని రవి పటేల్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా నాయకులు రోడ్డ శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు మామిండ్ల మధుకర్ గౌడ్, జిల్లా నాయకుడు మామిడి శ్రీకాంత్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారం మండల వ్యవసాయ కార్యాలయం రైతు వేదికలోకి మార్పు



**బయ్యారం, వు దయం ,జనవరి 25.**
బయ్యారం మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకు ఎదురుగా ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఈ పాత కార్యాలయాన్ని రికార్డులను భద్రపరచుటకు ఉపయోగించనున్నామని, ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని రైతు వేదికలోకి మార్చడం జరిగిందని వ్యవసాయ అధికారి కే. రాజు ఒక ప్రకటనలో తెలిపారు.కొత్త ప్రాంగణంలో సిబ్బంది, రైతులకు కూర్చునే విధంగా అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని,ఇకపై వ్యవసాయ శాఖకు సంబంధించిన అన్ని సేవలు రైతు వేదిక బయ్యారంలోనే అందించబడతాయని వారు తెలిపారు. రైతులు ఈ మార్పును గమనించి వ్యవసాయ సేవల కోసం రైతు వేదిక ను సంప్రదించాలన్నారు.ఈ మార్పు జనవరి 26,2026 నుండి అమల్లోకి వస్తుందని తెలిపారు.

# లంబాడీల ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ రామారావు



**బయ్యారం, వూదయం,జనవరి 25.**
బయ్యారం మండలం ఎంపీయుపిఎస్ రంగాపురం పాఠశాలలో సెకండరి గ్రేడ్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న గుగులోత్ రామారావును లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్ ఆదేశాల మేరకు లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త జాదవ్ రమేష్‌నాయక్ రామారావును ఉద్యోగుల మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని మండల సమావేశంలో అందజేశారు.ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నాకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ కుమార్ జాదవ్ కి,రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త రమేష్ నాయక్ నాయకత్వాన్ని జాతి కోసం,జాతి ప్రయోజనాల దృష్ట్యా ఆచరిస్తానని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లంబాడీల ఐక్య వేదిక లక్ష్యాల కోసం కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బోడ రమేష్,లక్ష్మణరావు,రమేష్,బాలాజీ,కిషన్, నాగరాజు, భానోత్ లింగా,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవార్డు అందుకున్న ఆర్ఐ స్వామి, బిఎల్ఓ శ్రీను




**ఖానాపురం, జనవరి 25 (వుదయం ):**
తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆర్ ఐ చనుమల్ల స్వామి, చైతన్య మండల సమైక్యలో కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న బిఎల్ఓ ఏరుకొండ శ్రీను బెస్ట్ సూపర్వైజర్ గా ప్రశంస పత్రంను జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెస్ట్ సూపర్వైజర్ ప్రశంసా పత్రం అందుకున్న ఆర్ఐ మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికలలో ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా సరి చేయడం, 18 సంవత్సరాల పైబడిన వారందరినీ ఓటరుగా నమోదు చేయడంపై జిల్లా అధికార యంత్రాంగం గుర్తించి బెస్ట్ సూపర్వైజర్ గా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం తీసుకున్నట్లు తెలుపుతూ, ఇట్టి కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారం అందించిన తాసిల్దార్ నంగునూరి రమేష్, డిప్యూటీ తహసిల్దార్, నా తోటి అధికారులకు కార్యాలయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆర్ ఐ తెలిపారు.

# గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు




- ఎన్నికల నిర్వహణలో ఉత్తమ కృషికి ఘన గుర్తింపు

**వరంగల్, జనవరి 25 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
జాతీయ ఓటర్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్లను ఆకర్షించే విధంగా గ్రీన్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వినూత్న ఓటర్ అవగాహన కార్యక్రమాల అమలు ద్వారా ఓటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచినందుకు గాను ఈ రాష్ట్ర స్థాయి అవార్డు వరంగల్ జిల్లాకు లభించింది.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని ప్రశంసలు వెల్లువెత్తాయి. కలెక్టర్ డా. సత్య శారదకు అధికారులు, సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**హనుమకొండ టౌన్, జనవరి 25 (వుదయం, ) :**
హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీ హర్ష కన్వెన్షన్ హాల్ నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై బంజారా గోత్ర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం రంగాల్లో బంజారా సమాజం మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. తరతరాలుగా బంజారా సమాజం తన ప్రత్యేకమైన భాష, వేషధారణ, నృత్యాలు, పండుగలు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు. బంజారా గోత్ర క్యాలెండర్ ఆవిష్కరణ ద్వారా యువతకు బంజారా సంస్కృతి, చరిత్రపై అవగాహన మరింత పెరుగుతుందని, ఇది గిరిజన వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించే మంచి ప్రయత్నమని ఎంపీ అన్నారు. సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సాంస్కృతిక విలువలే దేశ బలమని పేర్కొంటూ, ఇలాంటి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు సమాజాన్ని ఏకం చేసే వేదికలుగా నిలుస్తాయని చెప్పారు. బంజారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ డా. కడియం కావ్య భరోసా ఇచ్చారు. హనుమకొండలోని గిరిజన భవన అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోరిక వీరన్న నాయక్, సంగెం మాజీ జెడ్పిటిసి వీరమ్మ, రిటైర్డ్ డిఈఓ జవహర్ లాల్ నాయక్, DMHO రవిరాథోడ్, రిటైర్డ్ ఆర్ జె డి వెంకట్రాం, భోజ్ నాయక్, డాక్టర్ రమేష్‌నాయక్, వెంకట్ నాయక్,సర్పంచ్ బానోతు అరుణ రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడ మల్లికార్జున హిల్స్‌లో
# ఎంపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల ప్రారంభం

- నందారం నరసింహ గౌడ్

**సంగారెడ్డి జిల్లా, అమీన్పూర్ మండలం,బీరంగూడ:**



బీరంగూడ మల్లికార్జున హిల్స్ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఎంపీఎల్ (MPL) క్రికెట్ మ్యాచ్‌లను అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీ నందారం నరసింహ గౌడ్ గారు ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా కార్యక్రమాన్ని రమేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, యువత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో ప్రతిభను వెలికి తీస్తాయని, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.మల్లికార్జున హిల్స్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు మ్యాచ్‌ల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాయి. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ ఉత్సాహం నింపారు. టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ ఎంపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల ద్వారా యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి క్రీడల వైపు ఆకర్షించడమే లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముచ్చర్లపల్లి చిన్నారుల మృతి ఘటనపై
# తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

- కల్వకుర్తి ఆసుపత్రిలో మృతదేహాలను సందర్శించిన జడ్చర్ల ఎమ్మెల్యే
- బాధిత కుటుంబాలకు మనోధైర్యం నింపిన ఎమ్మెల్యే
- ప్రమాదకర గుంతల వద్ద భద్రతా చర్యలు అవసరమని అధికారులకు సూచనలు



**ఊర్కొండ , 25 వుదయం:**
ముచ్చర్లపల్లి చిన్నారుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన జడ్చర్ల నియోజకవర్గాన్ని తీవ్రంగా కలచివేసింది. గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె, కుమారుడు, సోదరి కుమార్తె పొలం వద్ద సెల్ఫీ దిగుతుండగా ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే గారు హుటాహుటిన కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనోధైర్యం నింపారు. ఈ విషాదం మాటల్లో చెప్పలేనిదని, చిన్న వయసులోనే మూడు ప్రాణాలు కోల్పోవడం హృదయ విదారకమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే , ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఉన్న ప్రమాదకర గుంతలు, బావులు, చెరువుల వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

# నిలకడలేని ప్రజా ప్రతినిధి..!

- శుక్రవారం బిజెపి,శనివారం కాంగ్రెస్ పార్టీ....!
- ఆదివారం మళ్లీ బిజెపి పార్టీలోకి....!



**బయ్యారం, వూ దాయం, జనవరి 25.**
బయ్యారం మండలంలో నామలపాడు పంచాయతీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ఐదో వార్డు సభ్యులు చీమల కృష్ణ శుక్రవారం బిజెపి పార్టీ మండల కార్యదర్శులు ఊకే రాంమూర్తి, తుమ్మల శ్రీనివాస్ సమక్షంలో బీజేపీ చేరారు. శనివారం రోజున జారే సాగర్, ఎల్లబోయిన జంపన్న సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఆదివారం మళ్లీ స్వంత పార్టీ బిజెపిలో చేరినట్లు బీజేపీ మండల కార్యదర్శులు, తుమ్మల శ్రీనివాస్,ఊకే రాంమూర్తి మీడియాకు తెలిపారు.మూడు రోజుల్లో రెండు పార్టీలలో చేరడంతో ఈ ప్రజా ప్రతినిధి కి నిలకడ లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.. రేపు మళ్ళీ ఏ పార్టీలో చేరుతాడో అని ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్ గా గారె గణేష్



**రాయపర్తి వుదయం :**
:మహబూబాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈసీ మెంబరుగా మండల కేంద్రానికి చెందిన గారె గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఓలం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాళ్ళ వెంకటేశ్వర్లు, కోశాధికారి చిలంచర్ల సతీష్ ఈసీ మెంబరుగా ఎన్నికైన గణేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. రైస్ మిల్లులు అంటే యంత్రాల సమూహం కాదని రైతన్న కష్టాని ఫలాలుగా మార్చే సంపద బాండాగరాలని తెలిపారు. కర్షకులు కళ్ళల్లో ఆనందం నింపడానికి రైస్ మిల్లర్లు తాపత్రయపడుతుంటారని వ్యాఖ్యానించారు. నాపై నమ్మకంతో జిల్లా ఈసీ మెంబరుగా ఎన్నుకున్న పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతూ అసోసియేషన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తదుపరి మండల కేంద్రానికి చెందిన పలువురు అతనికి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వుదయం సినిమా

## చిరంజీవితో నటించడం నా అదృష్టం

### నటుడు కరాటే కార్తి





నటన అంటే ఎంతో ఇష్టం కావడంతో సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాన్ని వదిలి సినిమా రంగంలోకి అడుగు పెట్టి.. కమల్ హాసన్ నటించిన 'దశావతారం' చిత్రంలో జూనియర్ ఆర్టిస్టుగా తొలిసారి నటనకు శ్రీకారం చుట్టారు కరాటే కార్తి. 'సింగం 3', 'దబాంగ్ 3', 'బిగిల్', 'పేట', 'ఖైదీ' వంటి పలు చిత్రాల్లో నటించి మెప్పించారు.

సినీ రంగంలో తన 14 యేళ్ళ పోరాటానికి తగిన గుర్తింపు, విజయం 'డాక్టర్' చిత్రం ద్వారా దక్కిందని నటుడు కరాటే కార్తి అంటున్నారు. ఈ క్రమంలో హీరో శివ కార్తికేయన్ నటించిన 'డాక్టర్'తో మంచి గుర్తింపుతో పాటు విజయం కూడా వరించిందని కార్తి పేర్కొన్నారు.

తాజాగా కరాటే కార్తి మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమాలో విలన్ గా నటించి మెప్పించారు. మెగాస్టార్ చిరంజీవితో నటించడం అదృష్టమని అతని దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నానని, అసలు మెగాస్టార్ చాలా సాధారణ మనిషిలా ఉంటాడని అలా ఉండడం అతని గొప్పదనమని అలాగే అనిల్ రావిపూడి తో వర్క్ చేయడం చాలా ఎనర్జీ ఇచ్చిందని అతను చెప్పినట్లు చేస్తే చాలు ఎవరైనా మంచి ఆర్టిస్ట్ అవ్వొచ్చని ఆయన అన్నారు.

సీఆర్‌పీఎఫ్‌లో పనిచేసిన తనకు బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సైతం వచ్చిందన్నారు. అఖిల భారత కరాటే పోటీల్లో ఏకంగా 13సార్లు చాంపియన్‌గా నిలిచిన ఆయన జిమ్నాస్టిక్, సిలంబాట్టం, జూడో, కిక్ బాక్సింగ్ క్రీడల్లో శిక్షణ తీసుకున్నట్టు పేర్కొన్నారు. కానీ, తనకు నటన అంటే ఎంతో ఇష్టం కావడంతో సీఆర్‌పీఎఫ్ ఉద్యోగాన్ని వదిలి సినిమా రంగంలోకి అడుగు పెట్టిన తనకు మంచి సినిమాల్లో అవకాశాలు వస్తున్నాయి అన్నారు. హీరో సూర్య మరియు వెంకీ అట్లూరి సినిమాలో తాను మంచి రోల్ లో నటిస్తున్నట్లు తెలిపారు.

## ట్రెడిషనల్ లుక్స్‌లో మహానటి



స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'నేను లోకల్' సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు పరిచయమైన ఈ చిన్నది అనతి కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. అలా దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. ఇక 'మహానటి' 'దసరా' సినిమాలతో ఈ అమ్మడి రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ప్రజెంట్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సరసన రౌడీ జనార్ధన్ మూవీలో యాక్ట్ చేస్తోంది. ఇక కీర్తి సురేష్ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే.. తన చిన్ననాటి స్నేహితుడైన ఆంటోని తట్టిల్‌ని ప్రేమించి ఏడాది క్రితం డిసెంబర్ 12న వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక అప్పటి నుంచి ఈ జంట ఎంతో అన్యోన్యంగా ఉంటూ వేకేషన్స్ కు తిరుగుతూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ భామ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్యారెట్ గ్రీన్ కలర్ ట్రెండీ అవుట్ ఫిట్‌లో ఇయర్ రింగ్స్, కళ్లకు కాటుక, రింగ్స్, నెక్లెస్‌తో చాలా ట్రెడిషనల్‌గా కనిపించింది. కింద బ్లూ కలర్ జీన్స్‌తో టాప్‌ను పెయిరప్ చేసింది. నవ్వుతూ తన స్మైల్‌తోనే మెస్మరైజ్ చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## ఏజ్‌లో కాకపోతే ఇంకెప్పుడు

బిగ్ బాస్ బ్యూటీ దివి వద్త్యా మహేష్ బాబు నటించిన 'మహర్షి' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బిగ్‌బాస్ తెలుగు సీజన్ 4 ద్వారా బాగా గుర్తింపు పొందారు. అక్కడ తన గ్లామర్‌తో ఆడియన్స్‌ను ఫిదా చేసింది. ఇక ఈ అమ్మడి అందానికి మెగాస్టార్ చిరంజీవి కూడా పడిపోయాడు కాబోలు తన నెక్స్ట్ సినిమాలో ఛాన్స్ ఇస్తానని మాటిచ్చేశాడు. మాట ఇచ్చినట్లే చిరు నటించిన ఓ సినిమాలో ఈ భామ కూడా యాక్ట్ చేసింది. అలాగే సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ నిత్యం హాట్ హాట్ ఫొటోలతో కుర్రకారుకు హీట్ పుట్టిస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా జబర్దస్త్ వర్ష హోస్ట్ చేస్తున్న 'కిస్సిక్ టాక్స్' లేటెస్ట్ ఎపిసోడ్‌కి ఈ ముద్దుగుమ్మ గెస్టుగా వచ్చింది. ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన అమ్మాయిల డ్రెస్సింగ్ వివాదం పైన షాకింగ్ కామెంట్స్ చేసింది.



## అనుబంధాల చాయ్ వాలా

'చాయ్ వాలా'లోని తండ్రీ కొడుకుల ఎమోషన్ అందర్నీ కట్టిపడేస్తుంది'' అన్నారు హీరో శివ కందుకూరి. ఇప్పుడాయన.. తేజ అశ్విని జంటగా ప్రమోద్ హర్ష తెరకెక్కించిన ఈ సినిమాని రాధా వి పావుడిప్ప నిర్మించారు. రాజీవ్ కనకాల, రాజ్ కుమార్ కసిరెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో టైటిల్ గీతాన్ని విడుదల చేశారు. ఈ వేడుకలో సిటీ కమిషనర్ వీసీ సజ్జనార్, నీలోఫర్ ఫౌండర్ బాబురావు, కిమ్స్ ఎండీ రవికిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ.. ''టైటిల్ గీతం బాగుంది. ఈ సినిమా యువతకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని నమ్ముతున్నా. ఇందులో తండ్రీ కొడుకుల అనుబంధంతో పాటు చాలా అంశాలున్నట్లు అర్థమవుతోంది. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకముంది'' అన్నారు. ''ఈ సినిమాలో తండ్రీ కొడుకుల ఎమోషన్ చాలా బాగుంటుంది. అలాగే చాయ్‌కి.. షాప్ ఓనర్‌కీ మధ్య అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రమోద్ హర్ష, ప్రశాంత్ ఆర్ విహారి, వెంకట్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.





## చిరు వెంకీ 'సంక్రాంతి' ఫుల్ సాంగ్

'మన శంకరవరప్రసాద్ గారు'లో చిరంజీవితో కలిసి వెంకటేశ్ సందడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోలో రూపొందిన 'అదిపోద్ది సంక్రాంతి' పాట మరింత జోష్ నింపింది. ఈ సాంగ్ ఫుల్ వీడియో తాజాగా విడుదలైంది. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను నకాశ్ అజీజ్, విశాల్ దద్లానీ పాడారు. భీమ్స్ సంగీతం అందించారు. చిరు హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా విడుదలై, మంచి విజయాన్ని అందుకుంది.

## చేతి కర్ర సాయంతో బర్త్ డే పార్టీకి

బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ఎల్బో క్రచస్ (ముంజేతికి సపోర్ట్‌గా పెట్టుకునే స్టిక్)తో కనిపించడంతో అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 'హృతిక్‌కు ఏమైంది?' అంటూ సోషల్ మీడియాలో కొందరు ఆరా తీస్తుంటే.. ఆయన త్వరగా కోలుకోవాలంటూ మరికొందరు ఆకాంక్షించారు. ముంబయిలో నిర్వహించిన డైరెక్టర్ గోల్డీ బెహల్ పుట్టినరోజు వేడుకకు హృతిక్ హాజరు కాగా.. సంబంధిత ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. వాటిలోనే హృతిక్ స్టిక్ సాయంతో నడుస్తూ కనిపించారు. గతేడాది ఫిబ్రవరిలోనూ హృతిక్ క్రచస్ వినియోగించారు. అయితే, కాలికి గాయమైందంటూ తానే స్వయంగా అప్పుడు ప్రకటించడం గమనార్హం. 2025లో 'వార్ 2'తో ప్రేక్షకుల ముందుకొచ్చారు హృతిక్. ఇందులో టాలీవుడ్ హీరో ఎన్టీఆర్ కూడా నటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'క్రిష్ 4' కోసం వర్క్ చేస్తున్నారు హృతిక్. ఈ చిత్రానికి ఆయనే దర్శకత్వం వహించనున్నారు.



## వరుస ఫ్లాప్స్.. క్రేజీ ఆఫర్స్



'పెళ్లి సందడి' చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఆ తర్వాత 'ధమాకా'తో మాస్ రాజా సరసన అదిరిపోయే స్టెప్పులేసి గ్లోబల్ స్థాయిలో పాపులర్ అయ్యారు. తెలుగులో టాప్ హీరోలందరి సరసన అవకాశాలు దక్కించుకుంటూ ఒకానొక సమయంలో 'బిజీయెస్ట్ హీరోయిన్'గా పేరు తెచ్చుకున్న శ్రీలీల కెరీర్ గ్రాఫ్ ప్రస్తుతం కాస్త ఒడిదుడుకులకు లోనవుతోంది. అలా తన అందం, అద్భుతమైన డ్యాన్స్‌తో టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన శ్రీలీల, ఇటీవల 'పరాశక్తి' సినిమాతో కోలీవుడ్‌లోకి అడుగు పెట్టారు. శివకార్తికేయన్ సరసన నటించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, కథనంలో లోపాల వల్ల బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాన్ని అందుకుంది. దీంతో తమిళంలో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలన్న ఆమె ఆశలకు కొంత నిరాశ ఎదురైంది. 'పరాశక్తి' ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, శ్రీలీల క్రేజ్ మాత్రం తగ్గలేదు.

## కాకరేపుతున్న కృతి శెట్టి

'ఉప్పెన' సినిమాతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిపోయిన కృతి శెట్టి గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ సినిమాతోనే బేబమ్మగా తెలుగు ఆడియన్స్ మదిలో నిలిచిపోయింది. దీంతో ఈ క్యూట్ హీరోయిన్‌కు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా చాలా సినిమాల్లో నటించినా ఉప్పెన లాంటి హిట్ అయితే రాలేదు. దీంతో కొన్ని రోజులు తెలుగు ఇండస్ట్రీకి దూరమైంది. ప్రజెంట్ ప్రదీప్ రంగనాథ్ హీరోగా నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' మూవీలో నటిస్తున్న ఈ చిన్నది.. రీసెంట్‌గా స్టార్ హీరో కార్తి నటించిన 'అన్నగారు వస్తారు' మూవీతో మన ముందుకు వచ్చింది. నలన్ కుమార స్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాను స్టూడియో గ్రీన్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. అయితే థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే.. ఈ భామ సోషల్ మీడియాలో చేసే రచ్చ మామూలుగా ఉండదు. నిత్యం స్టైలిష్ వేర్ డ్రెస్సులతో కుర్రకారును ఫిదా చేస్తూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా కృతి శెట్టి తన ఇన్‌స్టా అకౌంట్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో క్రేజీ అవుట్ ఫిట్‌లో కిర్రాక్ ఫొటోస్ షేర్ చేసింది. యద అందాలు ఆరబోస్తూ వావ్ అనిపించింది. ఇక వాటిని షేర్ చేస్తూ.. 'ఎందుకంటే సరైన దృష్టిలో, మీరు ఎల్లప్పుడూ కళగానే ఉంటారు' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు కాకరేపుతున్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.